thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 339 కరీంనగర్ శుక్రవారం, 14 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## పకడ్బందీగా పోల్ డాటా సిస్టం... తప్పిదాలకు ఛాన్సే లేదు

న్యూఢిల్లీ: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ డేటా తారుమారు అయ్యిందంటూ కొద్దికాలంగా పలు విపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తోసిపుచ్చారు. పోలింగ్ డాటా వ్యవస్థ చాలా పకడ్బందీగా ఉందని, తప్పిదాలకు ఎలాంటి తావులేదని చెప్పారు. 'లోక్‌సభ 2024 అట్లాస్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజీవ్ కుమార్ బుధవారంనాడు మాట్లాడుతూ, పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో సహా లక్షలాది మంది సిబ్బంది పోలింగ్ డాటాలో పాలుపంచుకుంటారని చెప్పారు. అందువల్ల పొరపాట్లకు ఆస్కారం ఉండదని వివరించారు. "ఈసీ నమ్మకమైన వ్యవస్థ. ఎలాంటి పొరపాటుకు ఆస్కారం ఉండదు. ఎవరైనా తప్పు చేసినా సిస్టమ్ దానిని ఒప్పుకోదు" అని రాజీవ్ కుమార్ తెలిపారు.




# తిరుగులేని మహాశక్తిగా మోదీ సర్కార్

## సొంతంగా బలం పుంజుకున్న బిజెపి!!

న్యూఢిల్లీ: దేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపై ఇండియా టుడే- సీ-వోటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే నిర్వహించిన సర్వేలో ఆసక్తికర ఫలితాలు వెలువడ్డాయి. ఇప్పటికిప్పుడు భారత్?లో లోక్ సభ ఎన్నికలు జరిగితే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధిస్తోందని సర్వేలో తేలింది. ఎన్డీఏ కూటమి 343 సీట్లు సాధించే అవకాశం ఉందని సర్వే ఫలితాల ద్వారా స్పష్టమైంది. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాలసిన సాధారణ మెజార్టీ (272 సీట్లు)ని బీజేపీ సునాయసంగా సాధిస్తోందని ఇండియా టుడే- సీ ఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. ఇక.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 232 సీట్లు సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే.. 188 స్థానాలకు పడిపోతుందని సర్వేలో తేలింది. తాజా సర్వేలో పార్టీల పరంగా చూస్తే బీజేపీ 281 సీట్లు, కాంగ్రెస్ 78 స్థానాలు దక్కించుకుంటాయని స్పష్టమైంది. 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లు గెలవగా.. కాంగ్రెస్ 99 స్థానాల్లో విజయం సాధించింది. అదే ఇప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీ 240 సీట్లను కాస్త.. 281 స్థానాలకు పెంచుకుంటుందని.. కాంగ్రెస్ 99 సీట్ల నుంచి 78కి పడిపోతుందని సర్వే ఫలితాల్లో బహిర్గతమైంది. ఇండియా టుడే-సివోటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ ఈ పోల్‌ను 2025, జనవరి 2 నుంచి 2025, ఫిబ్రవరి 9 మధ్య నిర్వహించింది. దేశవ్యాప్తంగా అన్ని లోక్‌సభ నియోజకవర్గాలలో 1,25,123 మంది ఓటర్ల అభిప్రాయాలను సేకరించి నివేదిక రూపొందించినట్లు ఇండియా టుడే స్పష్టం చేసింది. కాగా, 2024 లోక్ సభ ఎన్నికల్లో "ఇస్ బార్ చార్ సౌ పార్" (400 సీట్లు) నినాదంతో బీజేపీ బరిలోకి దిగింది. కానీ బీజేపీకి ఓటర్లు ఊహించని షాకిచ్చారు. కాషాయ పార్టీని కేవలం 240 స్థానాలకే పరిమితం చేశారు. దీంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఎన్డీఏ కూటమిలోని మిత్ర పక్షాల మద్దతు బీజేపీకి అనివార్యమైంది. ఈ క్రమంలోనే ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలైన టీడీపీ, జేడీయూ మద్దతుతో బీజేపీ కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. లోక్ సభ ఎన్నికల తర్వాత నుంచి బీజేపీ క్రమంగా తమ బలం పెంచుకుంటూ పోయింది. మహారాష్ట్ర, హార్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయాలు సాధించి కేంద్రంలో సీటును మరింత స్ట్రాంగ్ చేసుకుంది. 2024 లోక్ సభ ఎన్నికల్లో కాస్తా పుంజుకున్న కాంగ్రెస్ క్రమంగా డౌన్ ఫాల్ అవుతోందని సర్వేలో తేలింది. ఇందుకు కారణం కాంగ్రెస్ పార్టీ సొంత వైఖరేనని సర్వేలో ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.



## 19న ఫామ్‌హౌస్ నుంచి బయటకు కేసీఆర్ !

హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు రెడీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత బయటకు రాని ఆయన ఇప్పుడు పార్టీ విస్తృత కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 19వ తేదీన తెలంగాణ భవన్ కు రావాలని కార్యవర్గ సభ్యులందరికీ సమాచారం పంపారు. పార్టీ కార్యాచరణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కొన్ని కిలక నిర్ణయాలను ప్రకటించే ముందు కేసీఆర్ ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయడం లేదు. ఈ కారణంగా బీజేపీని గెలిపించడానికే ఈ నిర్ణయం తీసుకుందన్న ప్రచారం ఊపందుకుంటోంది. ఇలాంటి సమయంలో .. ఆ ప్రచారం ఉధృతంగా జరిగితే మరింత నష్టం జరిగే అవకాశం ఉంది. దీనికి చెక్ పెట్టడానికి కేసీఆర్ వ్యూహాత్మకంగా కాంగ్రెస్ తో పాటు బీజేపీపై కూడా ఈ సమావేశంలో విమర్శలు చేసే అవకాశం ఉంది.

అయితే కార్యకవర్గ సమావేశాల్లో మాట్లాడిన విషయాలు బయటకు వస్తాయి కానీ.. ఎప్పుడూ రికార్డెడ్ గా బయటకు రావు. రికార్డు చేస్తారో లేదో స్పష్టత ఉండదు. ఇటీవల వారానికో సారి అయినా పార్టీ నేతలను కలుస్తున్నారు. అప్పుడు కొన్ని ప్రకటనలు చేస్తున్నారు. త్వరలోనే వస్తానని బహిరంగసభ జరుపకుందామని చెబుతున్నారు. గజ్వేల్ లో బహిరంగసభకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోందని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల ప్రకటన వస్తే అలాంటి సభ పెట్టాలనుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా తేదీలు ప్రకటించలేదు. విస్తృత సమావేశం తర్వాత కేసీఆర్ ఇక రెగ్యులర్ సమావేశాల్లో పాల్గొంటారా..లేకపోతే మళ్లీ ఫామ్ హౌస్‌కు వెళ్తారా అన్నది అప్పటి పరిస్థితుల్ని బట్టి నిర్ణయించుకునే అవకాశం ఉంది.

## లేక్ బఫర్ జోన్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఉచిత మొబైల్ యాప్: హైడ్రాలేక్స్

హైదరాబాద్‌లో ఇటీవల లేక్ బఫర్ జోన్లలో నిర్మాణాలపై శాశ్వత చర్యలు ప్రారంభమైన నేపథ్యంలో, చాలా కుటుంబాలు ఇండ్లను కోల్పోయి ఎంతో బాధ పడుతున్నారు. తమ జీవితపు పొదుపులు వృథా కావడంతో, కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ దురదృష్టకర పరిణామాలకు చెక్ పెట్టడానికి "హైడ్రాలేక్స్" పేరిట ఓ ఉచిత మొబైల్స్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆస్తి కొనుగోలు చేసే ముందే ఫుల్ టాంక్ లెవల్ పరిధిని, తదనంతరం లేక్ బఫర్ జోన్ నిబంధనలను పూర్తిగా తనిఖీ చేయాలి. ఇలా చేయడం వలన అనవసర సమస్యలను నివారించుకోవచ్చు," అని హైడ్రాలేక్స్ యాప్ డెవలప్‌మెంట్ బృందం చెబుతోంది. ఇప్పుడు అత్యాధునిక టెక్నాలజీతో అలాంటి వివరాలు తెలుసుకోవడానికి రోజులు లేదా వారాలు పడకుండా, ఈ యాప్ వాడితే ఒక్కసారిగా ఫోన్‌లోనే వివరాలు అందుబాటులో ఉంటాయి.

పైగా ఇది పూర్తిగా ఉచితంగా ఇచ్చిన సదుపాయం కావడంతో ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవచ్చు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ఇప్పుడు లేక్ బఫర్ జోన్‌లోని నిర్మాణాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తోంది.


ఈ చర్యల్లో భాగంగా, బఫర్ జోన్‌లో ఉన్న ఎటువంటి నిర్మాణాన్నైనా పూర్తిగా తొలగిస్తున్నది. గతంలో ప్రాపర్టీ కొనుగోలు చేసినప్పుడు బఫర్ జోన్ నిబంధనల గురించి తెలియకపోవడంతో కొందరు ఇప్పుడు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**బఫర్ జోన్, FTL నిబంధనలపై అవగాహన ఎందుకు ముఖ్యం?**
: బఫర్ జోన్ నిబంధనల్ని ఉల్లంఘిస్తే నిర్మాణాన్ని వెంటనే తొలగించే అవకాశం ఉంది. మార్జిన్లని దాటితే: జల ప్రవాహానికి అంతరాయం కలిగించడం వల్ల చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సివస్తుంది. ఈ రెండు ఉల్లంఘనల కారణంగా ఆస్తిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంటుంది. భవనాల తొలగింపుపై ఎటువంటి పరిహారం కూడా





అంద దు. హైడ్రాలేక్స్ యాప్‌లో ఏం ఉపయోగాలు ఉన్నాయి? మీ స్థలం లేదా ప్రాతంలోని సమీప లేక్ దూరాన్ని వెంటనే చూపిస్తుంది. బఫర్ జోన్ పరిధిలోకి వస్తోందో లేదో స్పష్టంగా తెలియజేస్తుంది. ఫుల్ టాంక్ లెవల్ లిమిట్లు కూడా ఈ యాప్‌లో చూడవచ్చు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనే కాక, మొత్తం గ్రేటర్ హైదరాబాద్ ముట్టడి ప్రాంతంలో ఎక్కడైనా పనిచేస్తుంది. ప్రత్యేకంగా ఎవరికి ఉపయోగపడుతుంది? ప్లాట్ మొదటిసారిగా కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, డెవలపర్లు ప్రస్తుత గృహ యజమానులు భవిష్యత్తులో పెట్టుబడులు పెట్టాలని చూస్తున్న వ్యక్తులు మన ఇంటిని మళ్లీ ఇబ్బందుల్లో పడనీయకుండా ఉండటమే ఉత్తమం.. నివారణే శ్రేయస్కరం బఫర్ జోన్‌లోని ఇళ్లను తక్షణమే తొలగిస్తున్న పరిస్థితుల్లో, ఆస్తిని కొనుగోలు చేసే ముందు చట్టపరమైన మార్గనిర్దేశాన్ని అనుసరించడం చాలా అవసరం.

ఈ యాప్ వలన ముందు జాగ్రత్తగా మీ ప్రాజెక్ట్‌ను చెక్ చేసుకోవడం ఎంతో సులభమే కాదు, మీ కుటుంబ భవిష్యత్తును రక్షించడంలో అమూల్యమైన గైడెన్స్ ను అందిస్తుంది.




## 'అప్పుల కుప్పగా తెలంగాణ'.. పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్

ఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రం .. ఇప్పుడు అప్పుల కుప్పగా మార్చారు'అని రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడారు. నిర్మల సీతారామన్ ఇంకా ఏమన్నారంటే? 'ఏపీ విభజన సమయంలో తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉంది. కానీ ఇప్పుడు అది అప్పుల కుప్పగా తయారైంది. నేను ఏ పార్టీని తప్పుబట్టడం లేదు. ఇందిరాగాంధీ గెలిచిన మెదక్ నియోజకవర్గంలో తొలుత రైల్వే స్టేషన్‌ను మోదీ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించింది మోదీ ప్రభుత్వమే. ఎరువుల ఉత్పత్తిలో రికార్డు స్థాయిలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని పెంచాం. నిజామాబాదులో పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ఘనత ప్రధానిదే. అత్యద్భుతమైన పసుపు పండే ప్రాంతం నిజామాబాద్. తెలంగాణకు చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జహీరాబాద్‌లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. వరంగల్‌లో పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం, బీబీనగర్‌లో ఎయిమ్స్, 2605 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం, భారత్ మాల కింద నాలుగు గ్రీన్ కారిడార్లు, రైల్వేల అభివృద్ధి కోసం తెలంగాణకు రూ.5337 కోట్ల బడ్జెట్ కేటాయింపు, ఏరుపాలెం నంబూరు మధ్య , మల్కాన్ గిరి పాండురంగాపురం మధ్య 753 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం,ఐదు కొత్త వందేభారత్ ట్రైన్ల కేటాయింపు, 40రైల్వే స్టేషన్స్ రీడెవలప్, పీఎం ఆవాస్ అర్బన్ కింద రెండు లక్షల ఇళ్ల నిర్మాణం స్వచ్ఛ భారత్ మిషన్ కింద 31 లక్షల టాయిలెట్ల నిర్మాణం, జల్‌జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్ల కనెక్షన్లు, 82 లక్షల ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల మంజూరు, 199 జనఔషధి కేంద్రాలను ఏర్పాటు..ఇలా చెప్పుకుంటూ పోతే అనే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాము' అని వ్యాఖ్యానించారు.




## మైక్రోసాఫ్ట్ కొత్త క్యాంపస్..ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: హైదరాబాద్ లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించుకోవడం మనందరికీ గర్వకారణం. హైదరాబాద్ జర్నీలో ఇదొక మైలురాయి. మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉంది.మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. మీరు హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయి.ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను.భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దే. మైక్రోసాఫ్ట్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఏఐ ఫౌండేషన్ అకాడమీతో కూడిన ADVANTA(I) GE TELANGANAను ప్రారంభించడంలో భాగస్వాములుగా ఉన్నాయి. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ, మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించనున్నాయి.ఈ పెట్టుబడి మా స్టార్టప్ ఎకోసిస్టమ్ బలోపేతం చేయడంతోపాటు మెంటార్షిప్, ఏఐ టూల్స్ మరియు గ్లోబల్ నెట్వర్క్ యాక్సెస్ ను ఇస్తుంది. మా ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తుందని గర్వంగా చెబుతున్నా.ఈ కేంద్రం ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుంది. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్ కు ధన్యవాదాలు.ఆవిష్కరణల పట్ల మీ నిబద్ధత మా తెలంగాణ రైజింగ్ విజన్ కు తోడవుతుంది.




## హైదరాబాద్‌లో గూగుల్ ఏఐ కేంద్రం.. సీఎం సమక్షంలో ఎంవోయూ

హైదరాబాద్: నగరంలో ఏఐ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. టీహబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో గూగుల్ ప్రతినిధులు ఎంఓయూ కుదుర్చుకున్నారు. కృత్రిమ మేధ అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటునందించనుంది. వ్యవసాయం, విద్య, రవాణారంగం, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు గూగుల్ ఏఐ కేంద్రం సహకరిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.



## డిప్యూటీ సీఎం భట్టి ప్రీ బడ్జెట్ సమావేశం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పన కసరత్తులో భాగంగా డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం డాక్టర్ బీఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆర్ అండ్ బీ శాఖ, ఆర్థిక శాఖ అధికారులతో భట్టి ప్రీ బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖలు అందించిన ప్రతిపాదనలపై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే ఆర్థిక శాఖ అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను స్వీకరించింది. శాఖలు, పథకాల వారీగా రాబడులు, వ్యయాల అంచనాలను, ఉద్యోగుల జీతభత్యాల వివరాలను అన్ని శాఖలు పంపించాయి. ఈ ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రీ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల ప్రతిపాదనలపై ఇప్పటికే చర్చించారు. ఒక్కో ప్రభుత్వ శాఖలతో భట్టి సమావేశమవుతూ బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ కసరత్తు చేస్తున్నారు.




కరీంనగర్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే రాష్ట్రాలన్నింటికీ మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొంత మంది సర్వేలో పాల్గొనకుండా తమ సమాచారాన్ని ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. భారాస నేతలు చెబుతున్నట్లు ఇది రీసర్వే కాదని పొన్నం స్పష్టం చేశారు. సర్వేలో పాల్గొనని భారాస నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉంటే భారాస అగ్ర నేతలు సర్వేలో పాల్గొని తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. "భాజపా వ్యాపారులస్తుల అనుకూల పార్టీ. కులగణన, బీసీ, ఎస్సీ వర్గీకరణ ఆ పార్టీకి ఇష్టం లేదు. ప్రజల అకాంక్షలకి అనుగుణంగా తెలంగాణలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి. సర్వే పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. సామాజిక మార్పు కలిగించే నిర్ణయం ఇది.

రాజకీయ విమర్శల కొసమే భాజపా నేతలు బీసీలు, ముస్లింలపై విమర్శలు చేస్తున్నారు. ముస్లిం కమ్యూనిటీలోని పేద ముస్లింలు బీసీలోనే కొనసాగుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తాం. బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే శాసనసభలో బిల్లును అడ్డుకొవద్దు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.




**భారాస నేత, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సిద్ధమవుతున్నారని వ్యాఖ్యానించారు. తొర్రూరు మండలంలో నిర్వహించిన భారాస కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. ఇప్పటికిప్పుడు అసెంబ్లీ ఎన్నికలు వస్తే.. భారాస 100 అసెంబ్లీ సీట్లు గెలవడం ఖాయమని చెప్పారు.**

## జర్నలిస్టుపై దాడి కేసు.. సుప్రీంకోర్టులో నటుడు మోహన్‌బాబుకు ఊరట

దిల్లీ: నటుడు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టుపై దాడి కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు తాజాగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది డిసెంబరు 10న జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి ప్రాంగణంలో.. ఆయనను ప్రశ్నించిన ఒక టీవీ ఛానల్ విలేకరి చేతిలోని మైకు లాక్కొని అతడిపై దాడి చేశారంటూ ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు గత ఏడాది డిసెంబరు 23న కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గాయపడిన జర్నలిస్టుని ఆస్పత్రికి వెళ్లి మోహన్‌బాబు పరామర్శించారని విచారణ సందర్భంగా మోహన్‌బాబు తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విలేకరికి అవసరమైన ఆర్థిక సాయం కూడా చేస్తామని ఇప్పటికే ప్రకటించినట్టు కోర్టుకు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్ లేకుండా చేసి, ఇంటికి వచ్చిన వారిపై దాడి చేశారని.. విచారణకు కూడా వెళ్లలేదు కదా అని ధర్మాసనం ప్రశ్నించింది. ఆ విధంగా వ్యవహరించలేదని న్యాయవాది తెలిపారు. "ఇది పూర్తిగా ఇక కుటుంబానికి సంబంధించిన విషయం. వారికి రెండు రాష్ట్రాల్లో ఉన్న ఆస్తుల వ్యవహారం. కుమారుడు, తండ్రికి మధ్య ఉన్న కుటుంబ వివాదం తప్ప బయట ప్రపంచానికి ఏమాత్రం సంబంధం లేదు. ఒక యూనివర్సిటీ, విద్యా సంస్థలకు సంబంధించి తప్ప మరేమీ లేదు" అని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గాయపడిన జర్నలిస్టు ఎలా ఉన్నారని ధర్మాసనం అడిగింది. విలేకరి తరఫు న్యాయవాది పరిస్థితిని వివరించారు. వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం.. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.




హైదరాబాద్: నగర శివారులోని మొయినాబాద్ మండలం తొల్కట్ట ఫామ్‌హౌస్‌లో కోడి పందేల నిర్వహణ కేసులో భారాస ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. మాదాపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందజేశారు. కోడి పందేల నిర్వహణపై వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌ను భూపతిరాజు అనే వ్యక్తికి లీజుకు ఇచ్చామని ఎమ్మెల్సీ చెబుతున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని పోలీసులు ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో శ్రీనివాస్‌రెడ్డిని సైతం పోలీసులు నిందితుడిగా చేర్చారు. మంగళవారం పొద్దుపోయాక పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 61 మంది చిక్కిన విషయం తెలిసిందే. వారి వద్ద రూ.30 లక్షల నగదు, జూదక్రీడలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లు దొరికాయి. పోలీసులు 50 కార్లు, 80 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది వ్యాపారులే. అందరికీ నోటీసులిచ్చి వదిలేశారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకుని కొందరు పరారయ్యారు. దాంతో పరారైన వ్యక్తులెవరనే దానిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.




హైదరాబాద్: నగరశివారులోని మొయినాబాద్ మండలం తొల్కట్టలో జరిగిన ఘటనతో తనకు సంబంధం లేదని భారాస ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పోలీసుల నోటీసులకు పూర్తి వివరణ ఇస్తానని, విచారణకు సహకరిస్తానని చెప్పారు. జరిగిన ఘటన, పోలీసుల నోటీసుల నేపథ్యంలో ఆయన ప్రకటన జారీ చేశారు. "2018లో కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన అన్ని వ్యవహారాలను నా మేనల్లుడు జ్ఞానదేవ్ రెడ్డి చూసుకుంటున్నారు. అక్కడ ఫామ్ హౌస్, గెస్ట్ హౌస్ లేవు. కేవలం మామిడి, కొబ్బరి తోట, పనివారి కోసం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. నా ప్రమేయం లేకుండానే తోటను వర్రా రమేష్ కుమార్ రెడ్డి అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్లు నిన్నటి ఘటన తర్వాత జ్ఞానదేవ్ రెడ్డి నుంచి తెలిసింది. వర్రా రమేష్ కుమార్ రెడ్డి కూడా ఆ తోటను ఎం.వెంకటపతి రాజుకు కౌలుకు ఇచ్చారని.. నిన్నటి వరకు నా దృష్టికి రాలేదు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నిన్నే పోలీసులకు ఫిర్యాదు చేశా. మీడియాలో వస్తున్నట్లు ఆ తోటలో ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగి ఉంటే వాటికి, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఘటన జరిగిన రోజు నేను హైదరాబాద్‌లో లేను. వరంగల్‌లో ఎల్లమ్మ పండుగ కార్యక్రమంలో ఉన్నా. కేవలం రాజకీయంగా నన్ను ఇబ్బంది పెట్టడానికే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క చిన్న కేసు కూడా లేకుండా ప్రజా సేవకే అంకితమయ్యా. చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోను. భూమి యజమానిగా పోలీసులు నాకు నోటీసు ఇచ్చారు.. దానికి పూర్తి వివరణ ఇస్తా. సామాజిక మాధ్యమాల్లో నాపై దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులకు లీగల్ నోటీసులు పంపిస్తా" అని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తొల్కట్ట ఫామ్‌హౌస్‌లో మంగళవారం పొద్దుపోయాక పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 61 మంది చిక్కిన విషయం తెలిసిందే. వారి వద్ద రూ.30 లక్షల నగదు, జూదక్రీడలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లు దొరికాయి. పోలీసులు 50 కార్లు, 80 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది వ్యాపారులే. అందరికీ నోటీసులిచ్చి వదిలేశారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకుని కొందరు పరారయ్యారు. దాంతో పరారైన వ్యక్తులెవరనే దానిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.




వికారాబాద్: కుల్కచర్ల మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం రాత్రి నిద్రపోయిన విద్యార్థి ఉదయం లేవకపోవడంతో స్పందించిన హాస్టల్ సిబ్బంది పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. కొన్ని గంటల ముందే విద్యార్థి మృతి చెందినట్టు నిర్ధరించారు. విద్యార్థి మృతికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. అయితే, వసతి గృహంలో ఎలాంటి గొడవలు జరగలేదని తోటి విద్యార్థులు పేర్కొన్నారు.

పరిగి ఆస్పత్రికి చేరుకున్న జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి కమలాకర్ రెడ్డి.. పరిస్థితిపై ఆరా తీశారు. తమ కుమారుడి మృతికి కారణాలు తెలపాలంటూ పరిగి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

## పాతికేళ్ల ప్రస్థానం.. ఫిబ్రవరి 19న భారాస విస్తృతస్థాయి సమావేశం



హైదరాబాద్: పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న వేళ రజతోత్సవ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది. ఈ మేరకు పార్టీ విస్తృతస్థాయి కార్యవర్గం ఈ నెల 19న సమావేశం కావాలని.. అధినేత కేసీఆర్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 19న తెలంగాణభవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశం జరగనుంది. కేసీఆర్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, జడ్పీ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పాల్గొననున్నారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రధానంగా చర్చిస్తాం. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా భారాస శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర చర్చ ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధన, హక్కులను కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై సమావేశంలో చర్చిస్తాం"అని కేటీఆర్ తెలిపారు.

## రుణం కట్టలేదని.. ఇంత దారుణమా..: కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్ ప్రభుత్వం పై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో కామెంట్స్ చేశారు. అన్నదాత రుణం కట్టలేదని బ్యాంక్ సిబ్బంది అతని పట్ల దారుణంగా వ్యవహరించారని.. రుణం కట్టలేదని.. ఇంత దారుణమా.. అంటూ కేటీఆర్ మండిపడ్డారు. నాటి కాంగ్రెస్ పాలనలో.. అన్నదాతలు అప్పు కట్టలేదని.. ఆడబిడ్డల పుస్తెలు లాక్కెళ్లే దుస్థితి అని.. ఇప్పుడు రైతుల ఇళ్ల దర్వాజాలు, కరెంట్ మోటర్లు, స్టార్టర్లు తీసుకెళ్లే దైన్యస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. మళ్లీ ఆనాటి దృశ్యాలు కళ్లముందుకు తెచ్చిందని కేటీఆర్ అన్నారు. కష్టాల్లో ఉన్న పాడి రైతు లోన్ కట్టలేదని.. ఏకంగా ఆ ఇంటికి ఉన్న గేటును బ్యాంక్ సిబ్బంది ఎత్తుకెళ్లారని.. మరి రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని.. మాటతప్పిన ముఖ్యమంత్రిపై చర్య తీసుకునే ధైర్యముందా అని ప్రశ్నించారు. రుణం తీర్చలేదని రైతుపై చూపిన ప్రతాపాన్ని.. రుణమాఫీ చేయని సీఎం రేవంత్ రెడ్డిపై చూపించగలరా.. అని అన్నారు. పేద రైతుకు ఒక న్యాయం.. పదవిలో ఉన్న వారికి మరో న్యాయమా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకోవాలని, రైతులు అంతా గమనిస్తున్నారని.. ఇలాంటి ఘోరాలను చూస్తూ ఊరుకోరని.. కాంగ్రెస్ నేతల్ని ఇంటి గేటు కూడా తొక్కనియ్యరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాగా బ్యాంకులో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని బ్యాంకు అధికారులు ఇంటి గేట్లు ఎత్తుకెళ్లిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది.

# తెలంగాణ ఏర్పాటులో సుష్మా కీలక పాత్ర

## సుష్మా స్వరాజ్ మద్దతు తోనే తెలంగాణ బిల్లు ఆమోదం - ఫిబ్రవరి 14... సుష్మా స్వరాజ్ జయంతి



తెలంగాణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంలో సుష్మా స్వరాజ్ కీలకపాత్ర పోషించారు. ఆమె జన్మదిన సందర్భంగా సుష్మా పాత్ర గురించి ఒకసారి మననం చేసుకుందాం. 2014 ఫిబ్రవరి 18వ తేదీ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన రోజు. తెలంగాణ బిల్లుకు సభలో మూడింట రెండొంతుల మెజార్టీ కావాలి. దీనికి ఓటింగ్ కూడా జరపాల్సి ఉంటుంది. దీంతో సెక్రెటరీ జనరల్ నిబంధనలు వివరిస్తూ.. సభకు నిరాటంకంగా అంతరాయాలు కలుగుతున్నప్పుడు, అధికార, ప్రతిపక్ష పార్టీలు అంగీకరిస్తే 'హెడ్ కౌంట్' (ఎంపీలను నిలబెట్టి, లెక్కించడం) సరిపోతుందని చెప్పారు. దీంతో సుష్మా స్వరాజ్ నిర్ణయం కీలకమైంది. ఆమె అంగీకరిస్తేనే స్పీకర్ మీరాకుమార్ ఈ పద్ధతికి ఒప్పుకునేలా కనిపించారు. సుష్మా స్వరాజ్ దానికి అంగీకరించారు. 'మీరు బిల్లు పెట్టండి. నేను లేచి నిలబడి మాట్లాడతాను. తర్వాత హోం మంత్రిని ఒక్కొక్క క్లాజు చదువుకుంటూ వెళ్లమనండి. అలాగే ఓటింగ్ కూడా పెట్టండి' అని సూచించారు. దీనికి అంతా అంగీకరించారు. లోక్‌సభలో తెలంగాణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకురాలి హోదాలో సుష్మా స్వరాజ్ ప్రసంగించగా, కాంగ్రెస్ పార్టీ తరపున జైపాల్ రెడ్డి ప్రసంగించారు. బిల్లును ప్రవేశపెట్టిన హోం మంత్రి సుశీల్ కుమార్ షిండేతో కలిపి చర్చలో ప్రసంగించింది మొత్తం ముగ్గురు మాత్రమే. ఈ సందర్భంగా ఆ నాడు తెలంగాణ బిల్లుపై సుష్మా స్వరాజ్ ప్రసంగం ఇలా ఉంది.. "ధన్యవాదాలు అధ్యక్ష జీ. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ బిల్లును ఆమోదం కోసం ఇప్పుడే హోం మంత్రి ప్రవేశపెట్టారు. మా పార్టీ తరపు నుంచి ఆ బిల్లుకు మద్దతు ఇచ్చేందుకు నేను నిలబడ్డాను. ఈ బిల్లుకు మేం మద్దతు ఇవ్వటమే కాదు. ఇది పాసయ్యేలా ఓట్లు కూడా వేస్తాం. ఎందుకంటే ఇది మా విశ్వసనీయతతో ముడిపడిన విషయం. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుకు బిల్లును తీసుకొస్తే, బీజేపీ మద్దతు ఇచ్చి దాన్ని ఆమోదించేలా చేస్తుందని పార్లమెంటు బయట, పార్లమెంటు లోపల, తెలంగాణలోను, తెలంగాణ వెలుపల కూడా మేం ఎన్నోసార్లు డిమాండ్ చేశాం. అంతే కాదు, ఒకవేళ కేంద్ర ప్రభుత్వం కనుక బిల్లును తీసుకురాకపోతే, మా ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో తెలంగాణను ఏర్పాటు చేస్తాం అని కూడా హామీ ఇచ్చాం. అధ్యక్ష జీ.. మీరే సాక్షి. మీరు ఇదే స్థానంలో కూర్చున్నారు. నేను ఇక్కడి నుంచే మాట్లాడాను. తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకుంటున్న పిల్లలకు విజ్ఞప్తి చేస్తూ తెలుగులో చెప్పాను. 'తెలంగాణ కోసం బలిదానం వద్దు. తెలంగాణ చూడటానికి బతకాలి. బతకాలి' అని. ఇప్పుడు దీన్ని వ్యతిరేకించి ఆ పిల్లల విశ్వాస ఘాతుకానికి ఎలా పాల్పడతాం? కాబట్టే, మొత్తం విపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నప్పటికీ మేం నిలబడి ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. ఎందుకంటే తెలంగాణ ఏర్పడాలన్న ఆ పిల్లల స్వప్నం నిజం కావాలి. నేను కొన్ని విషయాలను రికార్డులోకి తీసుకురావాలనుకుంటున్నాను. నా తొలి ఫిర్యాదు కాంగ్రెస్ అధిష్ఠానంపైన. సోనియా జీ ఇవాళ చూడటం లేదు. కానీ, ఆమె సభలోనే ఉన్నారు. నా తొలి ఫిర్యాదు మీమీదే సోనియా జీ. తెలంగాణ ఇస్తామని 2004లో మీరు వాగ్దానం చేశారు. 2014 వచ్చింది. మీ ప్రభుత్వం తొలి దఫా(2004-2009)లో ఏమీ చేయలేదు. రెండో దఫా (2009-2014)లో సైతం, 15వ లోక్‌సభ చివరి సమావేశం, చివరి వారంలో మీరు బిల్లును తీసుకొచ్చారు. 21వ తేదీన సమావేశాలు ముగుస్తాయి. ఈరోజు 18. కేవలం మూడు రోజులే మిగిలి ఉన్నాయి. మీరు విషయాన్ని లాగుతూ, లాగుతూ.. ఇక్కడి దాకా తీసుకొచ్చారు. ఎలా తీసుకొచ్చారంటే.. మీ పార్టీ వాళ్లు కూడా దీన్ని అంగీకరించట్లేదు. మీరు మీ పార్టీ వాళ్లని ఒప్పించలేకపోయారు, మీరు మీ మంత్రులనే ఒప్పించలేకపోయారు, మీరు మీ ముఖ్యమంత్రిని కూడా ఒప్పించలేకపోయారు. అధ్యక్ష జీ, ఏ సభ ఇలాంటి దృశ్యం చూసి ఉండదు. ప్రధానమంత్రి సభలో కూర్చుని ఉన్నారు. ఆయన మంత్రిమండలిలోని సభ్యుడు వెల్‌లో నిలబడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సభలో కూర్చుని ఉన్నారు. అయినా ఫర్వాలేదంటూ ఆ పార్టీ సభ్యులు వెల్‌లోకి వచ్చి నిలబడ్డారు. ఆ పార్టీ ముఖ్యమంత్రి ధర్నాలో కూర్చున్నారు. ప్రధానమంత్రి క్యాబినెట్‌లో బిల్లును ఆమోదిస్తే.. వాళ్ల ముఖ్యమంత్రి దాన్ని వ్యతిరేకించి వెనక్కి పంపించారు. ఇలాంటి దృశ్యాలు ఈ సభలో చూస్తున్నాం. అధ్యక్ష జీ మేం కూడా మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేశాం. అద్వానీ ఇప్పుడు సభలో లేరు. కానీ, అప్పుడు ఆయన హోం శాఖ మంత్రి. ఆయన హయాంలోనే మూడు రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్క రక్తపు చుక్క కూడా చిందలేదు. ఒక్క క్షణం కూడా సభలో అశాంతి లేదు. పూర్తి శాంతి, ఉత్సాహంతో మూడు రాష్ట్రాల ఏర్పాటు జరిగింది. మూడు రాష్ట్రాలూ ఇప్పుడు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. ఇప్పుడు పార్టీలన్నీ విడిపోయాయి, సీమాంధ్ర, తెలంగాణ నాయకులు ఒకచోట కూర్చోవడం లేదు, నామా నాగేశ్వరరావు ఉన్నారు. ఆయన్ను నేను శాండ్ విచ్ అంటుంటాను. తెలంగాణ ప్రజలతో కలిసి వస్తుంటారు. తెలంగాణాను వ్యతిరేకించే వారితో కూడా కలసి వస్తుంటారు. కాంగ్రెస్ పార్టీది కూడా ఇదే పరిస్థితి. జగన్ పార్టీ పరిస్థితి కూడా ఇదే. అన్ని పార్టీలూ విడిపోయాయి." "నేను గర్వంగా చెప్తున్నాను.. ఇప్పుడు కూడా బీజేపీ సీమాంధ్ర, తెలంగాణ నాయకులు మాత్రం కలసికట్టుగా కూర్చుని, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. బీజేపీ సీమాంధ్ర నాయకులు, కార్యకర్తలు చెబుతున్నారు.. తెలంగాణ ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ కూడా తెలంగాణకే చెందాలి. కానీ, మాకు కూడా న్యాయం చేయండి' అని. న్యాయం కోసం వాళ్లు ఏం కోరుకుంటున్నారు? హైదరాబాద్‌లో రూ.1500 కోట్ల మిగులు ఆదాయం ఉంటే దాంతో తెలంగాణకు మేలు జరుగుతుంది. మరి కోస్తాంధ్ర, రాయలసీమకు జరిగే నష్టాన్ని ఎవరు పూడ్చుతారు? దాన్ని కేంద్ర ప్రభుత్వమే పూడ్చాలి. హోం మంత్రి హామీతో ఇది నెరవేరదు. నిధులు ఇచ్చే ఏర్పాటు చేయండి. వారి నష్టాన్ని పూడ్చే మాట చెప్పండి. మరోమాట వారు చెబుతున్నారు. హైదరాబాద్‌లో 148 సంస్థలు ఉన్నాయి, పదేళ్లపాటు అది సంయుక్త రాజధాని. కానీ, సీమాంధ్రలో ఏర్పాటు కావాల్సిన సంస్థలకు సూత్రప్రాయంగా ప్రణాళికా సంఘం నుంచి అనుమతి ఇవ్వండి. వాటికి టోకెన్ అమౌంట్‌గా కొంత నిధులు ఇవ్వండి. మధ్యంతర బడ్జెట్ రూపంలో వాటిని నిధులు సమకూర్చండి. వారు చెబుతున్న మూడో మాట.. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంటున్నారు. దానికోసం మండలాల బదిలీ జరగాల్సి ఉంది. దీనిపై వెంకయ్యనాయుడు సమక్షంలో వారి మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు జైరామ్ రమేశ్ లేఖ మా వద్ద ఉంది. కానీ, దీన్ని క్యాబినెట్‌లో మార్చేశారు. ఒప్పందం ప్రకారం వాటిని బదిలీ చేయండి. అందుకే అధ్యక్ష జీ.. తెలంగాణ ఏర్పాటు కావాలి. హైదరాబాద్ కూడా తెలంగాణలోనే ఉండాలి. అయితే, సీమాంధ్ర వారికి కూడా న్యాయం జరగాలి. అందుకే ఇవన్నీ బిల్లులో ఉండాలి. ఇది నా కోరిక. ఈ బిల్లులో గవర్నర్‌కు అధికారాలను కట్టబెట్టారు. ఇలాంటి శక్తులు ఇవ్వాలంటే రాజ్యాంగాన్ని మార్చాల్సి ఉంటుంది. సాధారణ బిల్లుతో పాటు రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీసుకొస్తే మేం మద్దతు ఇస్తామని ప్రభుత్వానికి చెప్పాం. లోపాల బిల్లు తీసుకురావొద్దు.. అసలైన బిల్లు తీసుకురండి అని చెప్పాం. ఈ బిల్లు ఆమోదం పొందగానే బయటకు వెళ్లి పాటలు పాడతారు. "కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. సోనియా అమ్మ తెలంగాణ ఇచ్చింది" అంటారు. సోనియా అమ్మను గుర్తుచుకుంటే.. ఈ చిన్నమ్మను కూడా గుర్తుంచుకోండి. తెలంగాణకు మద్దతు ఇస్తామని మా పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు కాబట్టి, జన చేతన యాత్రలో మా సీనియర్ నాయకుడు అద్వానీ మాట ఇచ్చారు కాబట్టి మేం ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. మా విశ్వసనీయత కోసం మద్దతు ఇస్తున్నాం. ఏ రాజకీయ పార్టీకైనా, నాయకుడికైనా విశ్వసనీయతే ముఖ్యం. మనం ఏదైనా చెబితే ఎదుటివాళ్లు దానిపై నమ్మకం ఉంచాలి. అందుకే మేం ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాం. హోం మంత్రి సమాధానం ఇచ్చేప్పుడు సీమాంధ్రకు న్యాయం చేయాలని నేను చెప్పినవన్నీ ఈ బిల్లులో పెట్టాలని నేను కోరుతున్నాను. అలా సీమాంధ్రులు కూడా సంతోషిస్తారు. ఒకవేళ అలా చేయకుంటే.. రాబోయే ప్రభుత్వం మాదే. మేం న్యాయం చేస్తాం అని నేను ఇక్కడ నిలబడి చెబుతున్నాను. సీమాంధ్రవాళ్లు.. బాధపడకండి. మీ భద్రతకు మాది పూచీ. ఈ హామీ ఇస్తూ నేను ఈ బిల్లుకు మద్దతు పలుకుతున్నాను. ఈ బిల్లు ఆమోదానికి మద్దతు తెలుపుతున్నాను. ధన్యవాదాలు." బిల్లు ఆమోదం పొందిన తర్వాత పార్లమెంటు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుష్మా స్వరాజ్ మాట్లాడుతూ, "బిల్లును సభలో పెట్టాలి. కానీ, అది ఆమోదం పొందకూడదు. దీనికి కారణం బీజేపీనే అని నిందించాలి. బిల్లు పెట్టడం ద్వారా తెలంగాణ వారిని, దాన్ని ఆమోదించకుండా సీమాంధ్ర వారిని సంతృప్తిపర్చాలి. ఇదే కాంగ్రెస్ ప్లాన్. ఇది మాకు స్పష్టంగా అర్థమయ్యింది. దీంతో సభలో ఆందోళనలు జరుగుతున్నా సరే మేం బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అందుకే మేం మా వైఖరిని మార్చుకోం. ఇప్పుడు ఇచ్చాం' అని చెప్పారు. ఆగస్టు 6వ తేదీ రాత్రి సుష్మా స్వరాజ్ మృతి చెందిన సందర్భంగా, తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... "కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ మృతి పట్ల సంతాపం ప్రకటిస్తున్నాను. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఆమె ఇచ్చిన మద్దతును తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. చిన్నమ్మా, మీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. అంటూ ట్విటర్ ద్వారా సుష్మాకు నివాళులర్పించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి : జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్



మార్చి 10 నుండి 22 వరకు నిర్వహించనున్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధ్యక్షతన, దేవస్థానం ఈఓ శ్రీనివాస్ ఇందుకు సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులతో నిర్వహించిన జాతర సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ధర్మపురి బ్రహ్మోత్స వాలకు వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా, ఇబ్బందులు కలుగకుండా, సమస్యలను అధిగమిస్తు, గత అనుభవాల ఆధారంగా పని చేయాలని సూచించారు.

వేసవి కాలం మొదలవుతున్నందున భక్తులకు మంచి నీరు, మినరల్ వాటర్, మజ్జిగ ప్యాకెట్లు, భోజన ఏర్పాట్లు చేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేస్తూ బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ఆర్వో ప్లాంట్, వాటర్ క్యాన్ల ను వినియోగించుకోవాలని సూచించారు. కళ్యాణానికి మంత్రులు, ప్రముఖులు రావడం సెంటిమెంట్ గా ఉందని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో తెల్లవారి నుండే కాలువల పరిశుభ్రం, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. విద్యుత్ దీపాలు, నిరంతర సరఫరా, పారిశుద్ధ్య సక్రమ నిర్వహణ కొరకు పారిశుధ్య అదనపు సిబ్బందిని నియమించాలని, రైస్ మిల్లర్లు, వర్తక వ్యాపార సంఘాల వారుఏటా అన్నదానం నిర్వహిస్తున్న సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తా ఈ ఏడు కూడా అవసరమైన సహకారాలను అందించాలని కోరారు. శాఖల వారిగా చేయవలసిన కార్యక్రమాలను మరింత ఉత్సహంగా, వైభవంగా నిర్వహించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రవాణాశాఖ తరపున భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాలనుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని రవాణా శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఎండ వేడిమి కారణంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చలువ పందిరి – చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులు అధికారులను ఆదేశించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. భక్తులకు 12 రోజుల పాటు ఉచిత అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈ వో శ్రీనివాస్ పేర్కొన్నారు కలెక్టర్ గారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ,అశోకకుమార్, డి.ఎస్.పి రఘు చందర్, ఈవో శ్రీనివాస్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్ దార్ కృష్ణ చైతన్య, వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల యజమానులు, వర్తక, వ్యాపార సంఘాల బాధ్యులు, స్వచ్ఛంద సేవకులు, నాయకులు, పాల్గొన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల...**


# గీత దాటిన కాంగ్రెస్ నేతలపై వేటు.. ఎమ్మెల్సీ మల్లన్నపై యాక్షన్ ఉంటుందా?



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రూటు మార్చింది. ఇంటర్నల్ డెమొక్రసీ పేరుతో పార్టీ క్రమశిక్షణను తప్పుతున్న నేతలపై చర్యలకు సిద్ధమంటోంది. మాట వింటే ఓకే.. వినకపోతే వేటు అంటూ సంకేతాలు పంపుతోంది. ఇప్పటికే ఓ నేతను బయటకి పంపగా, మరికొందరి పేర్లతో లిస్టు రెడీ అయిందంటున్నారు. ఎవరికి తోచింది వారు మాట్లాడుతూ.. రోడ్డెక్కుతామంటే గతంలో బుజ్జగింపులు ఉండవని హెచ్చరిస్తోంది కాంగ్రెస్ హైకమాండ్. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లివచ్చాక అధిష్టానంలో వచ్చిన మార్పుతో నేతల నోళ్లకు తాళాలు పడుతున్నాయంటున్నారు. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క అంటోంది తెలంగాణ పీసీసీ. కాంగ్రెస్ అంటేనే అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో బోలెడంత స్వేచ్ఛ. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించే నేతలు.. అధిష్టానం సడన్ వార్నింగుతో మారుతారా? అనేది ఆసక్తి రేపుతోంది. పార్టీకి నష్టం కలిగిస్తే ఎవరైనా ఉపేక్షించేది లేదని అధిష్ఠానం తేల్చిచెబుతోంది. శాంపిల్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా పేరున్న ఎల్లారెడ్డి నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి సుభాష్ రెడ్డిపైనే వేటు వేసింది. మారకపోతే మరికొంత మందిపై వేటు పడటం ఖాయమని గాంధీభవన్ లో వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అంతర్గత కుమ్ములాటలు ఎక్కువే. గత ఎన్నికలకు ముందు పార్టీలో గ్రూప్ వార్ పతాకస్థాయిలో ఉండేది. అయితే ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. సీనియర్లు అంతా సిన్సియర్ గా పనిచేయడంతో గెలుపు గాంధీభవన్ వాకిట వాలింది. ఇక అధికారంలో వచ్చాక షరా మామూలే అన్నట్లు మళ్లీ గ్రూపుల గొడవ ఎక్కువవుతోంది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, ఒక నేత తీసుకున్న నిర్ణయాన్ని మరో నేత తప్పుపట్టడం రివాజుగా మారింది. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఈ సమస్య మరింత తీవ్రంగా కలవరపెడుతోందని అంటున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఈ తలనొప్పిగా ఎక్కువగా ఉంది. మరోవైపు పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా కొందరు మాట్లాడటంతో సోషల్ మీడియాలో ట్రోల్స్, పబ్లిక్‌లోకి నెగెటివ్ టాక్ వస్తుందని కాంగ్రెస్ హైకమాండ్ గుర్తించినట్లు చెబుతున్నారు. ఈ మధ్యకాలంలో కొందరు కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ విధానాలపై చేస్తున్న విమర్శలు ప్రతిపక్షాలకు అస్త్రాలు అవుతున్నాయి. సొంత పార్టీ నేతలే ప్రభుత్వ తీరును తప్పు పడుతున్నారని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నారు. మరికొన్ని చోట్ల గ్రూపు తగాదాలతో రచ్చ నడుస్తుంది. ఇవన్నీ పార్టీకి తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా పది మంది ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీ పార్టీలో అగ్గిరాజేసింది. దీంతో ఇంటర్నల్ ఇష్యూస్‌పై కాంగ్రెస్ అధిష్ఠానం ఫోకస్ పెంచింది. ఇటీవల జరిగిన సీఎల్పీ సమావేశంలోనూ ఈ అంశంపై సీరియస్‌గా చర్చించారు. ఇకపై పార్టీ గీత దాటితే వేటు తప్పదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలను ఎవరూ వ్యతిరేకించొద్దని, డౌట్స్ ఉంటే ఉంటే పార్టీ ఇంటర్నల్ వేదికలపై చర్చించాలని సూచించారు. బహిరంగంగా మాట్లాడి పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందులు తేవొద్దని వార్నింగ్ ఇచ్చారు. పార్టీ లైన్ దాటితే ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని, పార్టీ క్రమశిక్షణ సంఘం ఈ విషయంలో అలర్ట్‌గా ఉండాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించడంతో పార్టీలో మార్పు వస్తుందని ఆశిస్తున్నారు. ఈ క్రమంలనే సమస్య తీవ్రత గుర్తించిన పార్టీ క్రమశిక్షణ కమిటీ ఈ మధ్య పలువురికి షోకాజ్ నోటీస్ జారీ చేసింది. ఎల్లారెడ్డి నియోజకవర్గ కీలక నేత సుభాష్ రెడ్డి..ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుపై అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో సుభాష్ రెడ్డి అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. సుభాష్ రెడ్డి ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో ఆయన్ని పార్టీ నుంచి బహిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డి వర్గంగా ముద్రపడిన సుభాష్‌రెడ్డిపై ఆల్ అఫ్ సడెన్‌గా పార్టీ బహిష్కరణ వేటు వేయడం గాంధీభవన్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ లైన్ దాటితే ఎవరైనా..ఎంతటి వారైనా వదిలేదని చెప్పేందుకే తన అనుచరుడిపై ముందుగా సీఎం వేటు వేశారని అంటున్నారు. దీంతో ఇన్నాళ్లు వాయిస్ పెంచి మాట్లాడిన నేతలు సైలెంట్ అవుతున్నారని గాంధీ భవన్ వర్గాల సమాచారం. ఇక ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న, కరీంనగర్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీనివాస్ కు క్రమశిక్షణ సంఘం నోటీసులు ఇచ్చారు. అదేవిధంగా గాంధీభవన్‌లో గొడవ పడిన యూత్ కాంగ్రెస్ నేతలలో కొందరికి నోటీసులు జారీ అయ్యాయంటున్నారు. వీరంతా ఇచ్చే సమాధానంపైనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అంటున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ మల్లన్న ఎలా రియాక్ట్ అవుతారన్నది ఆసక్తి రేపుతోంది. పార్టీ ఆదేశాలను పాటించి వివరణ ఇస్తారా? లేక తన స్వతంత్రతను కొనసాగిస్తారా? అనేది చూడాల్సివుంది. ఏదిఏమైనా కాంగ్రెస్ అధిష్టానం తీరు చూస్తే ఇకపై కఠిన నిర్ణయాలు ఉంటాయనే సంకేతాలే అందుతున్నాయంటున్నారు.

# ఇక మొదలుపెట్టినట్లేనా?.. ఐపీఎస్ సునీల్ పై సీఐడీ విచారణ!

ఒకప్పుడు సీఐడీ బాస్ గా పనిచేసిన ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ ఇప్పుడు అదే శాఖలో విచారణ ఎదుర్కొంటున్నారు. సీఐడీ అధిపతిగా ఉండగా, నిబంధనలు అతిక్రమించి వ్యవహరించారని, వ్యక్తుల స్వేచ్ఛను హరించారని ఆయనపై కేంద్రానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై నివేదిక ఇవ్వాల్సిందిగా కేంద్ర హోంశాఖ కోరడంతో ఏపీ సీఐడీ రంగంలోకి దిగింది. ఓ న్యాయవాది, మరో జర్నలిస్టుతోపాటు ఇద్దరు టీడీపీ నేతల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. దీంతో సునీల్ కుమార్ పై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐపీఎస్ అధికారి సునీల్ కుమారును వీఆర్ లో పెట్టారు. డీజీ క్యాడరులో ఉన్న ఆయనపై డిప్యూటీ స్పీకర్ రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు నమోదు చేశారు. అదేవిధంగా పలు అవినీతి ఆరోపణలూ చేస్తున్నారు. కానీ, దేనికీ ఆధారాలు లేకపోవడం వల్ల సునీల్ కుమారుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతోందంటున్నారు. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించారనే కారణంతో ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి ఆర్పీ సిసోడియా కమిటీ వేశారు. ప్రభుత్వం టార్గెట్ చేయడంతో ప్రస్తుతం ఖాళీగా ఉన్న సునీల్ పై ఇప్పుడు సీఐడీ విచారణ మొదలుపెట్టడం చర్చనీయాంశమవుతోంది. గత ప్రభుత్వంలో అప్పటి వైసీపీ పెద్దలకు అనుకూలంగా సునీల్ కుమారు వ్యవహరించారని ఆరోపణలు




ఎదుర్కొంటున్నారు. వైసీపీ పాలనను ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించారని ఆయనపై ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో సునీల్ పై చర్యలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందంటున్నారు. అయితే ఆయన అఖిల భారత స్థాయి అధికారి కావడంతో ప్రభుత్వానికి కొన్ని నిబంధనలు ఆటంకంగా మారాయని అంటున్నారు. దీంతో సునీల్ ను ఎట్టి పరిస్థితుల్లో వదలకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు పంపి, అటు నుంచి నరుక్కురావాలని చూస్తున్నారంటున్నారు. దీంతో గత ప్రభుత్వంలో సునీల్ వ్యవహరించిన తీరును వివరిస్తూ న్యాయవాది లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు చెబుతున్నారు. సీఐడీ డీజీగా సునీల్ కుమారు పనిచేసిన సమయంలో టీడీపీ కార్యకర్తలు, నేతలు, జర్నలిస్టులను అర్ధరాత్రి అరెస్టు చేసి, కస్టోడియల్ టార్చర్, థర్డ్ డిగ్రీ ప్రయోగించేవారని లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. సునీల్ సీఐడీ చీఫ్ గా పనిచేసిన కాలంలోనే ఈ ఫిర్యాదులు చేయగా, అప్పటి ప్రభుత్వం వాటిని తొక్కిపెట్టిందని అంటున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరోసారి న్యాయవాది లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో న్యాయవాది లక్ష్మీనారాయణ ఫిర్యాదుపై విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర హోంశాఖ అదేశించింది. కేంద్ర హోంశాఖ కోరిక ప్రకారం విచారణకు సీఎస్ విజయానంద్ ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ పోలీసులు న్యాయవాది లక్ష్మీనారాయణతోపాటు సునీల్ కుమారు బాధితులుగా చెప్పుకుంటున్న సీనియర్ జర్నలిస్టు అంకబాబు, టీడీపీ మీడియా సెల్ ఇన్‌చార్జి, దారపనేని నరేంద్ర, సోషల్ మీడియా నేత గార్లపాటి వెంకటేశ్వరరావు నుంచి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. జర్నలిస్టు అంకబాబు వయసును కూడా పరిగణలోకి తీసుకోకుండా అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేశారని, దుర్భాషలాడరని ఆయన వాంగ్మూలమిచ్చారు. అదేవిధంగా టీడీపీ నేతలు సైతం తమకు సీఐడీ కస్టడీలో కొట్టారని ఫిర్యాదులు చేశారు. ఈ సంఘటనల వెనుక సీఐడీ చీఫ్ సునీల్ కుమార్ ఉన్నట్లు తాము భావిస్తున్నామని వరు సీఐడీకి తెలిపారు. దీంతో ప్రభుత్వం ఐపీఎస్ సునీల్ పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఉత్కంఠగా మారింది.

# మాస్ మహారాజ్ మల్లన్నకు ఏమైంది..?

## సోషల్ మీడియా స్టార్ కోసం నెటిజన్ల సెర్చింగ్

పాలమ్మినా..పూలమ్మినా..కష్టపడ్డా.. ఫేమస్ అయినా.. ఈ డైలాగ్ వినగానే గుర్తుకు వచ్చే నేత మల్లన్న అలియాస్ మల్లారెడ్డి. రెండు తెలుగు స్టేట్స్‌లో మాస్ ఇమేజ్ ఉన్న బిజినెస్ మన్ కం పొలిటీషియన్ మల్లారెడ్డి. ఆయనేం చేసినా సోషల్ మీడియా షేక్ అవ్వాల్సిందే. సోషల్ మీడియా కోసమే ఆయన యాక్టవిటీస్ ఉంటాయా? అనిపిస్తుంది. ఇలా ఎప్పుడూ సోషల్ మీడియాలో హడావుడి చేసిన మల్లారెడ్డి ముఖం కొద్దిరోజులుగా కనిపించకపోవడంతో ఆయన ఫ్యాన్స్ బోర్ ఫీలవుతున్నారు. ఆల్ ఆఫ్ సడెన్‌గా మల్లారెడ్డి ఎందుకు సైలెంట్ అయ్యారంటూ ఆరా తీస్తున్నారు. మల్లన్న అంతా ముద్దుగా పిలుచుకునే మల్లారెడ్డి ఒక్కసారి గమ్మున ఉండిపోయారేంటి? అంటూ సోషల్ మీడియాలో సెర్చ్ చేస్తున్నారు ఆయన అభిమానులు. మల్కాజ్‌గిరి ఎంపీగా రాజకీయాల్లో ఆరంగేట్రం చేసినా, బీఆర్ఎస్ మంత్రిగా ఆయన ఇచ్చిన స్పీచులు తెలుగు రాష్ట్రాల్లో క్రేజ్ తెచ్చిపెట్టాయి. ఆయన ఇంటర్వ్యూల కోసం మెయిన్ స్ట్రీమ్ మీడియాతోపాటు సోషల్ మీడియా కూడా ఎంతో ఆత్రుతగా ఎదురుచూసేది. తమ స్క్రీన్ పైన మల్లన్న కనిపిస్తే చాలు ఒక్కసారిగా తమ చానల్స్ ట్రెండింగ్ అయిపోతాయని యూట్యూబర్లు మల్లన్న చుట్టూ తిరిగేవారు. అయితే బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి మల్లన్న జోరు తగ్గించేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మల్లారెడ్డి ఆస్తులపై బుల్డోజర్ వెళ్లిన నుంచి



మునుపటిలా ఆయనలోని మాస్ లీడర్ బయటకి రావడం లేదంటున్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో మల్లారెడ్డికి పెద్దకష్టమే వచ్చి పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గులాబీ పార్టీ హయాంలో కాలేజీ ఫంక్షన్లు, పబ్లిక్‌లో తిరుగుతూ, మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ తనదైన చతురతతో నవ్వులు పూయించేవారు. ఆఖరికి అసెంబ్లీలో ఆయన మాట్లాడినా స్పీకర్, సీఎం సహా అందరు కడుపుబ్బా నవ్వుకునేవారు. ఆయనను తమ స్ట్రెస్ బూస్టర్ గా భావించేవారు. అయితే ఇప్పుడు ఆయన పరిస్థితి గమ్మత్తుగా మారింది. ఏమైందో ఏమోగాని కొన్ని రోజులుగా మల్లారెడ్డి నోటి నుంచి మాటలు రావడం లేదు. డైలాగ్స్ పేలడం లేదు. పెద్దగా బయటకు రావడం కూడా లేదు. పొలిటికల్ స్క్రీన్ పై మల్లారెడ్డి కనిపించ ఆయన అభిమానులు బోర్ ఫీలవుతున్నారు. ఒకప్పుడు చిన్నా చితక కార్యక్రమాలకు కూడా హాజరై సందడి చేసే మల్లన్న ఎందుకిలా మారిపోయారనేది చర్చనీయాంశంగా మారింది. పార్టీ కార్యక్రమాలకు కూడా మల్లారెడ్డి గైర్హాజరు బీఆర్ఎస్ లోనూ చర్చకు దారితీస్తోంది. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో ఏదైనా ప్రోగ్రామ్‌కు వచ్చినా ఇంతకు ముందులా ఆయన మాట్లాడటం లేదని చెబుతున్నారు. మౌనంగా ఉండిపోవడం, లేకపోతే పైపైనే మాట్లాడి బైబై చెప్పేస్తున్నారని అంటున్నారు. మల్లారెడ్డి సందడి లేక పార్టీ కార్యకర్తలలో కూడా హుషారు తగ్గిపోయిందని అంటున్నారు. అయితే మల్లారెడ్డిలో మార్పునకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది. మల్లారెడ్డి మనుమరాలి పెళ్లికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లిన నుంచి ఈ మార్పు రావడంతో ఏదో జరిగిందని చర్చించుకుంటున్నారు. అదే సమయంలో ఏపీ సీఎం చంద్రబాబును మల్లారెడ్డి కలవడం కూడా ఓ కారణమంటున్నారు. మల్లారెడ్డి యూనివర్సిటీతో పాటు అల్లుడి విద్యాసంస్థలు, ఇతర వ్యాపారాలను దృష్టిలో పెట్టుకునే ఆయన వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నారని కూడా కొందరు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అనవసరమైన మాటలు మాట్లాడి ప్రభుత్వం దృష్టిలో పడితే తన వ్యాపారాలకే నష్టమని మల్లన్న ఆందోళనతో ఉన్నట్లు మరికొందరు చెబుతున్నారు. ఏదిఏమైనా మల్లన్నలో మునుపటి జోరు కనిపించకపోవడం సోషల్ మీడియాలో కూడా ఏదో వెలితి కనిపిస్తోందని ఆయన అభిమానులు అంటున్నారు. సో మల్లారెడ్డి.. ఏం జరిగితే అది జరిగింది.. నువ్వు ఎప్పటిలానే ఉండు అన్నా అంటూ అంతా కోరుతున్నారు.


చురకలు

## సంపాదకీయం

# చిరంజీవి రాజకీయం... లైట్ తీసుకున్నారా ?

మెగాస్టార్ చిరంజీవి 2008లో పాలిటిక్స్ లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయన అదే ఏడాది ఆగస్టు నెలలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో పోటీ చేయడం అతి పెద్ద సంచలనం. ఆనాడు ఉమ్మడి ఏపీలో ప్రజారాజ్యం పార్టీ ఎంట్రీ గురించి సాగిన చర్చ అంతా ఇంతా కాదు. ఉమ్మడి ఏపీలో బలమైన థర్డ్ పొలిటికల్ ఫోర్స్ గా మెగాస్టార్ నిలుస్తారని అప్పటి సంప్రదాయ పార్టీల కోటలను బద్ధలు కొడతారని అంతా అంచనా వేశారు. కానీ జరిగింది వేరు. దానికి గల కారణాలు అనేకం ఉన్నాయి. ఎందుకంటే చిరంజీవి మీద ఉన్న హైప్ ఒక రేంజిలో సాగింది, కానీ కొత్త పార్టీగా గ్రౌండ్ లెవెల్ లో బాలారిష్టాలను అధిగమించలేక పోవడం, సరైన వ్యూహాలు లేకపోవడం వల్లనే చతికిలపడింది. అయినా కానీ ప్రజారాజ్యం ఉమ్మడి ఏపీలో సాధించిన 71 లక్షల ఓట్లు 18 సీట్లు ఒక భారీ రికార్డు గానే నేటికీ ఉంది. ఒక వైపు కాంగ్రెస్ కి చెందిన ముఖ్యమంత్రి వైఎస్సార్ ఉంటే మరో వైపు టీడీపీ అధినేత చంద్రబాబు ఉన్నారు. ఈ ఇద్దరి మధ్యన మెగాస్టార్ ఒంటరిగా సాగించిన రాజకీయ పోరాటంలో ఆ సీట్లూ ఓట్లూ అంటే దటీజ్ మెగాస్టార్ పొలిటీకల్ విక్టరీ అని చెప్పాలి. కేవలం ఎనిమిది నెలలలో చిరంజీవి ఉమ్మడి ఏపీలో చేసిన రాజకీయ అలజడి అది. ఓడినా చిరంజీవి అంటే ఇతర పార్టీలు భయపడే పరిస్థితి నాడు ఉండేది. ఆ పార్టీని అలా ఉంచితే 2014 ఎన్నికల్లో ఏమి జరిగేది అన్నది ఒక ఊహాతీతమైన ఆలోచన. కానీ ప్రజారాజ్యం పార్టీకి 2009 కి మించి మంచి ఫలితాలే వస్తాయి తప్ప అంతకు తగ్గి రావు అన్నది మరో విశ్లేషణ. ఎపుడైతే చిరంజీవి పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారో నాటి నుంచే మెగా పొలిటికల్ ఇమేజ్ ఒక్కసారిగా డౌన్ అయింది అన్నది ఒక కఠిన విశ్లేషణ. ఈ నేపథ్యంలో చూసినపుడు మెగా పాలిటిక్స్ కి ఆనాడే క్రేజూ మోజూ తగ్గడం మొదలైంది. ఇక చిరంజీవి తన రాజ్యసభ సభ్యత్వం ముగించుకుని సినిమాలు మళ్ళీ స్టార్ట్ చేశాక ఆయన రాజకీయాల గురించి చర్చ అయితే జన సామాన్యంలో లేదు అని చెబుతారు. అయితే పొలిటికల్ పార్టీలలో మాత్రం ఆయనను ఏదో విధంగా ఉపయోగించుకోవాలని ఆశ ఆరాటం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అనేక రూమర్స్ చిరంజీవి చుట్టూ వ్యాపిస్తూనే ఉన్నాయి. చిరంజీవిని ఎలాగైనా పాలిటిక్స్ లోకి తీసుకుని రావాలని చూసే పార్టీలకు కొదవ లేదు. కానీ చిరంజీవి మాత్రం రాజకీయాల విషయంలో దూరం అని చెబుతున్నారు. దాని మీద మరోసారి ఆయన ఒక సినిమా ఫంక్షన్ లో క్లారిటీ ఇచ్చారు. అయితే అదే ఫంక్షన్ లో చిరంజీవి తనకు వారసుడిగా మనవడు రావాలని చేసిన కామెంట్స్ మాత్రమే సోషల్ మీడియాలో హైలెట్ అయి వైరల్ అయ్యాయి తప్ప ఆయన రాజకీయాల జోలికి పోను, అవి నాకు వద్దు అంటూ చేసిన సంచలన ప్రకటన మాత్రం జనంలోకి పెద్దగా ఎక్కలేదు. దాని అర్థం ఏమిటి అంటే చిరంజీవి రాజకీయాన్ని జనాలు లైట్ తీసుకున్నారనే అంటున్నారు. ఒకనాడు చిరంజీవి రాజకీయలలోకి వస్తే సీఎం సీటు ఖాయమన్న భావన ఇదే తెలుగు జనాల్లో ఉండేది. ఆ ఆకాంక్షలకు తగిన విధంగా ప్రజారాజ్యం పనిచేసి ఉంటే కథ వేరేగా ఉండేదని అంటారు. కానీ ఆ పార్టీ విలీనం తోనే చిరు రాజకీయం మీద అంతగా జనాలు మొగ్గు చూపడం లేదు అని అంటున్నారు. ఆయనను తమ పార్టీలలో తీసుకోవాలని ఆయా పార్టీల అధినేతలు ఆసక్తిని చూపుతున్నా గ్రౌండ్ రియాలిటీ మాత్రం వేరేగా ఉందని అంటున్నారు. చిరంజీవి ఒకసారి రాజకీయాల్లోకి వెళ్ళి వచ్చారు. ఇపుడు ఆయన తన సినీ జీవితానికే జనాలు నూరు శాతం మార్కులేసి పద్మ విభూషణ్ స్థాయి దాకా తీసుకుని వచ్చారు కాబట్టే ఆయన కూడా సినీ రంగానికే చివరి వరకూ సేవ చేస్తాను అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే నేను పాలిటిక్స్ లోకి జీవితాంతం రాను అన్న మెగాస్టార్ స్టేట్ మెంట్ ఎంతటి సంచలనం రేకెత్తించాలి. కానీ ఒక సాధారణ వార్తగా మిగిలిపోయింది అంటే ఆలోచించాల్సిందే మరి.


# అపార అనుభవశాలి దామోదరం సంజీవయ్య - ఫిబ్రవరి 14... దామోదరం సంజీవయ్య జయంతి



దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి, అలాగే తొలి దళిత ముఖ్యమంత్రి. సంయుక్త మద్రాసు రాష్ట్రంలో, ఆంధ్రరాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో అనేకసార్లు ఆయన మంత్రి పదవులు నిర్వహించగా, రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పనిచేసిన ప్రత్యేకత ఆయనది. అలాగే కాంగ్రెస్ పార్టీ తొలి దళిత అధ్యక్షులు కూడా. 38 ఏళ్ల చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కింది. వివిధ శాఖల్లో మంత్రిగా పని చేసిన గొప్ప రాజకీయవేత్త, అపార అనుభవశీలి, స్నేహశీలి, సౌమ్యుడు, సాహితీవేత్త, ఆదర్శప్రాయుడు, చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య. దామోదరం సంజీవయ్య, పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వంలో తెలుగు భాష వాడుక అధికం చేయడం, భూసంస్కరణల అమలు ఇలా ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలు ఆయన హయాంలో చేపట్టారు. దామోదరం సంజీవయ్య (ఫిబ్రవరి 14,1921 – మే 8,1972) 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా, కల్లూరు మండలంలో, కర్నూలు నుండి ఐదు కిలోమీటర్ల దూరములో ఉన్న పెద్దపాడు లో చదువుకోవటానికి అవకాశాలు లేని ఒక దళిత నిరుపేద కుటుంబంలో మునెయ్య, సుంకులమ్మ దంపతులకు జన్మించారు. పేద కుటుంబంలో పుట్టినా పట్టుదలే పెట్టుబడిగా 'లా' డిగ్రీ సాధించిన అనన్యుడు. పెద్దపాడులో 4వ తరగతి వరకు చదివి ఆ తరువాత కర్నూలులోని అమెరికన్ బాప్టిస్ట్ మిషన్ పాఠశాలలో చేరారు. 1935లో కర్నూలు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో చేరి 1938లో ఎస్.ఎస్.ఎల్.సీ జిల్లాలోనే ప్రథమునిగా ఉత్తీర్ణుడయ్యారు. తరువాత చిన్నయ్య ఆర్థిక సహాయముతో అనంతపురం దత్తమండల కళాశాలలో గణితము, ఖగోళ శాస్త్రములు అధ్యయనము చేశారు. 1942లో బీ.ఏ పూర్తి చేసిన తర్వాత జీవనోపాధి కొరకు అనేక చిన్నా చితక ఉద్యోగాలు చేశారు. అప్పుడు రెండవ ప్రపంచ యుద్ధము వలన ఉద్యోగాలు దొరకడము చాలా కష్టముగా ఉంది. సంజీవయ్య కర్నూలు పట్టణ రేషనింగ్ ఆఫీసులో గుమస్తాగా 48.80 రూపాయల జీతముతో ఉద్యోగములో చేరారు. 1944 లో కొంతకాలము మద్రాసు కేంద్ర ప్రజా పనుల శాఖ కార్యాలయములో సహాయకునిగా పనిచేశాడు. 1945 జనవరిలో కేంద్ర ప్రజా పనుల శాఖ తనిఖీ అధికారిగా బళ్లారిలో పని చేశారు. ఈ గజెటెడ్ హోదా కల ఉద్యోగము డిసెంబరు 1945 లో రద్దయ్యేదాకా 11 నెలల పాటూ పని చేశారు. ఆ తరువాత కొంత సమయము మద్రాసులోని పచ్చయప్ప పాఠశాలలో అధ్యాపకునిగా పని చేసారు. సంజీవయ్య 1946లో అప్పటి బళ్లారి జిల్లా జడ్జి కే.ఆర్.కృష్ణయ్య చెట్టి ప్రోత్సాహముతో మద్రాసు లా కాలేజీలో 'ఎఫ్.ఎల్' లో చేరారు. అప్పట్లో కాలేజిలో స్కాలర్షిప్పు ఇచ్చే పద్ధతి ఉండేది కాదు. అందువలన సంజీవయ్య మద్రాసు జార్జ్‌టౌన్ లోని ప్రోగ్రెస్సివ్ యూనియన్ ఉన్నత పాఠశాలలో పార్ట్ టైం గణిత అధ్యాపకునిగా పనిచేశారు. అక్కడ ఇచ్చే 90 రూపాయల జీతముతో హాస్టలు ఖర్చులు భరించేవాడు. లా చదువుతున్నపుడు సంజీవయ్యకు రోమన్ న్యాయానికి సంబంధించిన లాటిన్ పదాలు గుర్తు పెట్టుకోవడము కష్టమయ్యేది. లాలో ఆయనకు సహాధ్యాయి అయిన ప్రముఖ రచయిత రావిశాస్త్రి వాటిని తెలుగు పాటగా మలిచి పాడుకుంటే బాగా గుర్తుంటాయని సలహా ఇచ్చారు. లా చదివే రోజుల్లో సంజీవయ్య చంద్రగుప్త అనే నాటకములో పాత్ర ధరించాడు. శివాజీ అనే ఇంకొక నాటకాన్ని తామే రచించి రంగస్థలము మీద ప్రదర్శించారు. ఈయన గయోపాఖ్యానము గద్యముగా రచించారు. అయితే ఇందులో ఏ ఒక్కటి ప్రస్తుతము లభ్యము అవుటలేదు. లా పట్టా చేతపుచ్చుకొని సంజీవయ్య 1950 అక్టోబర్ లో మద్రాసు బార్ లో న్యాయవాదిగా నమోదు చేసుకొన్నాడు. ఆయన గణపతి వద్ద ఆ తరువాత జాస్తి సీతామహా లక్ష్మమ్మ వద్ద సహాయకునిగా పనిచేశారు. సంజీవయ్యకు విద్యార్థిగా ఉన్న రోజుల్లో రాజకీయాలపై, స్వాతంత్ర్యోద్యమముపై ఏమాత్రము ఆసక్తి చూపలేదు. కానీ లా అప్రెంటిసు చేస్తున్న సమయములో వివిధ రాజకీయ నాయకుల పరిచయము, సాంగత్యము వలన రాజకీయాలలో ప్రవేశించాలనే ఆసక్తి కలిగినది. సంజీవయ్య మంచి వక్త. తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ధారాళంగా, మనోరంజకంగా మాట్లాడేవారు. 1950 జనవరి 26న రాజ్యాంగము అమలు లోకి రావడముతో అప్పటి దాకా రాజ్యాంగ రచన నిర్వహించిన భారత రాజ్యాంగ సభ ప్రొవిజనల్ పార్లమెంట్ గా అవతరించింది. అయితే ప్రొవిజనల్ పార్లమెంటులో, రాష్ట్రాల శాసనసభలలో రెండిట్లో సభ్యత్వము ఉన్న సభ్యులు ఏదో ఒక సభ్యత్వముని ఎన్నుకోవలసి వచ్చింది. షెడ్యూల్డ్ కులమునకు చెందిన ఎస్.నాగప్ప అలా తన శాసనసభ సభ్యత్వము అట్టిపెట్టుకొని ప్రొవిజనల్ పార్లమెంటుకు రాజీనామా చేయడముతో ఆ స్థానమును పూరించడానికి బెజవాడ గోపాలరెడ్డి, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ తరఫున సంజీవయ్యను ఎంపిక చేశాడు. ఎన్నికలు జరిగి తొలి విధానసభ ప్రమాణ స్వీకారము చేయడముతో 1952 మే 13 న ప్రొవిజనల్ పార్లమెంటు రద్దయినది. టంగుటూరి ప్రకాశం పంతులు మంత్రివర్గములో ఆరోగ్యశాఖా మంత్రిగా ఉండగానే సికింద్రాబాదులో పాఠశాల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కృష్ణవేణిని సంజీవయ్య 1954, మే 7 న పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకున్నాడు. వీరికి సంతానము లేదు. సుజాత అను ఒక బాలికను దత్తత తీసుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సంజీవరెడ్డి తన ప్రత్యర్థి అయిన పిడతల రంగారెడ్డిని దెబ్బకొట్టాలని కర్నూలు జిల్లాలోని బస్సురూట్లను జాతీయాకరణ చేశారు. అప్పుడు సుప్రీంకోర్టు వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందువల్ల సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఆ స్థానంలో తాత్కాలికంగా కేంద్ర మధ్యవర్తిగా దామోదరం సంజీవయ్యను 1960 జనవరిలో రాష్ట్రానికి తీసుకువచ్చారు. సంజీవయ్య శాసన సభలో అధిక సంఖ్యాకుల బలంతో వచ్చిన వ్యక్తి కాదు. సహజంగా కుల, ముఠా రాజకియాల మధ్య సతమత మయ్యారు. బలీయమైన రెడ్డి వర్గం ఎ.సి.సుబ్బారెడ్డి నాయకత్వాన ఎదురు తిరిగి సొంత పక్షం పెట్టుకున్నారు. 1962లో ఎన్నికలు జరిగి తిరిగి కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చినపుడు సంజీవయ్య పోటీ చేద్దామను కున్నారు కానీ ఢిల్లీ నాయకత్వం అందుకు అంగీకరించ లేదు. ఎ.సి. సుబ్బారెడ్డి మరీ తలబిరుసు తనంతో కులం పేరు ఎత్తి సంజీవయ్యను ఎద్దేవ చేసారు. 1962లో ముఖ్యమంత్రిగా దిగిపోయిన సంజీవయ్య, గవర్నరుకు రాజీనామా సమర్పించిన మర్నాడే సికిందరా బాదులో తన భార్యను వెంట బెట్టుకుని అజంతా టాకీసులో సినిమాకని నడచి వెళ్లారు. సంజీవయ్య వ్రాసిన లేబర్ ప్రాబ్లమ్స్ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పుస్తకాన్ని ఆక్స్ ఫర్డ్ వారు ప్రచురించారు. 1950 – 1952 ప్రొవిజనల్ పార్లమెంటు సభ్యుడుగా, 1952 ఏప్రిల్ 20 – 1953 అక్టోబర్ 1 రాజాజీ మంత్రివర్గములో మద్రాసు రాష్ట్ర మున్సిపల్, సహకార శాఖ మంత్రిగా, 1953 అక్టోబర్ 1 – 1954 నవంబర్ 15 ప్రకాశం మంత్రివర్గములో ఆంధ్ర రాష్ట్ర ఆరోగ్య, హరిజనోద్ధరణ, పునరావాస శాఖా మంత్రిగా, 1955 మార్చి 28 – 1956 నవంబర్ 1 బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గములో ఆంధ్ర రాష్ట్ర రవాణా, వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా, 1956 నవంబర్ 1 – 1960 జనవరి 10 నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గములో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శ్రమ, స్థానిక స్వయం పరిపాలనా శాఖ మంత్రిగా, 1960 జనవరి 11 – 1962 మార్చి 29 ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, 1962 జూన్ – 1964 జనవరి 6 అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు. 1964 జనవరి 24 – 1964 జూన్ 9 నెహ్రూ ప్రభుత్వములో కేంద్ర శ్రమ, ఉద్యోగ శాఖామంత్రిగా, 1964 జూన్ 9 – 1966 జనవరి 23 లాల్ బహుదూర్ శాస్త్రి ప్రభుత్వములో కేంద్ర శ్రమ, ఉద్యోగ శాఖమంత్రిగా, 1966 జనవరి 24 – 1967 మార్చి 12 ఇందిరా గాంధీ ప్రభుత్వములో కేంద్ర పరిశ్రమల శాఖామంత్రి 1970 ఫిబ్రవరి 18 – 1971 మార్చి 18 ఇందిరా గాంధీ ప్రభుత్వములో కేంద్ర శ్రమ, పునరావాస శాఖ మంత్రిగా, 1971 మార్చి 18 నుండి 1972 మే 7 వరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా పని చేశారు. 1967లో ఎన్నికల ప్రచార సమయములో విజయవాడ నుండి హైదరాబాదుకు వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆ ప్రమాదం నుంచి పూర్తిగా ఎన్నటికి కోలుకో లేకపోయారు. 1972 మే 7 వ తేదీ రాత్రి 10:30 గంటల ప్రాంతములో ఢిల్లీలో గుండె పోటుతో మరణించారు. ఆయన స్మారకార్థం పాటిగడ్డ సమీపమున ఒక ఉద్యానవనమును పెంచి ఆయన పేరు మీదుగా సంజీవయ్య పార్కు అని పేరు పెట్టారు. 2008 లో విశాఖపట్నంలో స్థాపితమైన ఆంధ్ర ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీకి ఆయన జ్ఞాపకార్థం 2012 లో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ అని పేరుమార్చారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# నవ్వుల రారాజు రాజబాబు - ఫిబ్రవరి 14...రాజబాబు వర్ధంతి



పుణ్యమూర్తుల అప్పలరాజు అనగానే ఎవరా అని ఆలోచించవచ్చు. రాజబాబు అంటే హాస్య నటునిగా తెలియని తెలుగు వారుండరు. రేలంగి, రమణారెడ్డి తరవాత అంతకు మించిన ప్రేక్షక ఆదరణ పొందిన నటునిగా గుర్తింపు పొందారు. తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత గొప్ప హాస్య నటుల్లో ఒకరు రాజబాబు. రెండు దశాబ్దాల తక్కువ వ్యవధిలో ఆయన శిఖర స్థాయిని అందుకున్నారు. దాదాపు 600 చిత్రాల్లో నటించిన రాజబాబు.. తెలుగు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తారు. అప్పట్లో ఆయన దక్షిణాదిన అత్యంత డిమాండ్ ఉన్న కమెడియన్లలో ఒకరు. రోజుకు రెండు మూడు షిఫ్టుల్లో విరామం లేకుండా పని చేసిన ఘనత ఆయనది. తెలుగు చలనచిత్ర రంగంలో రెండు దశాబ్దాలు హాస్యనటునిగా వెలిగిన రాజబాబు (అక్టోబరు 20, 1935 – ఫిబ్రవరి 14, 1983) "శతాబ్దపు హాస్య నటుడి"గా ప్రసంశలు అందుకొన్న గొప్ప వ్యక్తి. అక్టోబరు 20, 1935 తేదీన పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం లో పుట్టిన రాజబాబు పూర్తి పేరు పుణ్యమూర్తుల అప్పలరాజు. తల్లిదండ్రులు శ్రీ పుణ్యమూర్తుల ఉమామహేశ్వర రావు , శ్రీమతి రవణమ్మ. నిడదవోలు లోని పాఠశాల చదువు చదువుతూనే బుర్రకథ నేర్చుకోవడానికి శ్రీ అచ్యుత రామయ్య గారి దగ్గర చేరారు. ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత ఉపాధ్యాయ శిక్షణ కోర్సు ముగించి తెలుగు ఉపాధ్యాయునిగా కొద్దికాలం పని చేశారు. ఉపాధ్యాయునిగా పనిచేసేటప్పుడే నాటకాలలో పాలుపంచు కొనేవారు. రాజబాబు డిసెంబరు 5, 1965 తేదీన లక్ష్మీ అమ్ములు ను వివాహమాడాడు. వారికి నాగేంద్రబాబు, మహేశ్ బాబు అనే ఇద్దరు సంతానం కలిగారు. ఒక సారి నాటకంలో రాజబాబును చూసిన గరికపాటి రాజారావు (పుట్టిల్లు సినిమా దర్శకుడు) సినిమాలలో చేరమని ఉత్సాహ పరిచారు. దాంతో చెప్పా చెయ్యకనే ఫిబ్రవరి 7, 1960 రోజున మద్రాసు చేరుకొన్నారు. పూట గడవడానికి హాస్య నటుడు అడ్డాల నారాయణరావు పిల్లలకు ప్రైవేటు చెప్పేవారు. కొన్నాళ్ళ తరువాత అడ్డాల నారాయణరావు రాజబాబుకి సమాజం సినిమాలో అవకాశం కల్పించారు. మొదటి సినిమా తరువాత "తండ్రులు–కొడుకులు","కులగోత్రాలు","స్వర్ణగౌరి","మంచి మనిషి" మొదలగు చిత్రాలలో అవకాశాలు వచ్చాయి. స్వర్ణగౌరి చిత్రానికి గాను 350 రూపాయలు మొట్టమొదటి పారితోషికంగా స్వీకరించారు. మొదటి చిత్రం విడుదల తరువాత వచ్చిన చిన్న చిన్న పాత్రలలో నటిస్తూనే "కుక్కపిల్ల దొరికిందా", "నాలుగిళ్ళ చావిడి", "అల్లూరి సీతారామరాజు" మొదలగు నాటకాలు వేశారు. జగపతి ఫిలింస్... వి.బి.రాజేంద్రప్రసాద్ చిత్రం "అంతస్తులు" చిత్రంలో నటించినందుకు గాను మొట్ట మొదటి సారిగా పెద్దమొత్తం 1300 రూపాయల్ని పారితోషికంగా పొందారు. ఇక వెనక్కు తిరిగి చూసుకో వలసిన అవసరం లేకుండా వరుసగా నిర్మాణ సంస్థలు నిర్మించిన ఎన్నో చిత్రాలలో నటించారు. ఆకాశ రామన్న, సతీ శబరి, ప్రచండ భైరవి, సత్య హరిశ్చంద్ర, సంగీత లక్ష్మి, పరమానందయ్య శిష్యుల కథ, ఉమ్మడి కుటుంబం, విచిత్ర కుటుంబం లాంటి చిత్రాలలో నటించారు. రాజబాబుకు జంటగా లీలా రాణి, మీనా కుమారి, ప్రసన్న రాణి, గీతాంజలి లాంటి వారు నటించినా, ప్రేక్షకాదరణ పొందిన జోడీ మాత్రం రమాప్రభ అని చెప్పాలి. ఇద్దరు అమ్మాయిలు, ప్రేమనగర్, ఇల్లు ఇల్లాలు, పల్లెటూరి బావ, సెక్రెటరి, జీవన జ్యోతి, కార్తీక దీపం, అడవి రాముడు, సోగ్గాడు లాంటి చిత్రాలు రాజబాబు – రమాప్రభ జోడీకి మంచి హాస్య జంటగా పేరు తెచ్చాయి. రాజబాబు తాతా మనవడు, పిచ్చోడి పెళ్ళి, తిరుపతి, ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు లాంటి సినిమాలలో హీరోగా నటించారు. ఈ సినిమాలలో ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు సినిమాలను స్వయంగా బాబ్ %డ% బాబ్ ప్రొడక్షన్స్ అన్న నిర్మాణ సంస్థ పేరుతో నిర్మించారు. సినిమాలో ప్రేక్షకులను తన అద్భుత నటనతో కడుపుబ్బ నవ్వించిన రాజబాబు నిజ జీవితంలో గొప్ప తాత్విక ఆలోచనలు గలవారు. ప్రతి ఒక్క సంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా పాతతరం నటుల్ని, నటీమణుల్ని సత్కరించే వాడు. ప్రత్యేకంగా హాస్యంలో తనకు స్ఫూర్తిని ఇచ్చిన బాలకృష్ణను సత్కరించారు. రాజబాబుచే సత్కారం పొందిన వారిలో ఇంకా డా.శివరామ కృష్ణయ్య, సూర్యకాంతం, సావిత్రి, రేలంగి మొదలగు ప్రముఖులు ఉన్నారు. ఎన్నో సంస్థలకు ఎన్నెన్నో విరాళాలిచ్చిన దాత రాజబాబు. రాజమండ్రిలో చెత్తా చెదారం శుభ్రపరిచే వాళ్ళకు అదే ఊరిలో దానవాయి పేటలో భూమి ఇచ్చారు. అంతే కాక కోరుకొండలో జూనియర్ కాలేజీ కట్టించారు. దాని పేరు కూడా ఆయన పేరు మీదే "రాజబాబు జూనియర్ కళాశాల"గా ఉంది. వరుసగా ఏడు సార్లు ఫిలింఫేర్ అవార్డు పొందిన మొట్ట మొదటి హాస్య నటుడు రాజబాబు. ఆయన జీవితంలో మొత్తం తొమ్మిది ఫిలింమ్ ఫేర్ అవార్డులు, మూడు నంది బహుమతులు, ఎన్నెన్నో అవార్డులు రివార్డులూ పొందారు. "చెన్నై ఆంధ్రా క్లబ్బు" వారు వరుసగా ఐదు సంవత్సరాలు "రోలింగ్ షీల్డు"ని ప్రధానం చేసారు. అంతే కాక శతాబ్దపు హాస్య నటుడిగా అవార్డు పొందారు. రాజబాబుకు ఘంటసాల పాటలంటే ఎంతో ఇష్టం. మహా శివరాత్రి రోజు, ఘంటసాల వర్ధంతి అయిన ఫిబ్రవరి 11 రోజున మొత్తం ఘంటసాల పాటలు వింటూనే ఉన్నారు. అదే రోజు రాత్రి గొంతులో ఏదో ఇబ్బంది వచ్చి హైదరాబాదు లోని థెరెసా ఆసుపత్రిలో చేరాడు. ఆ ఆసుపత్రి లోనే ఫిబ్రవరి 14, 1983 రోజున తెలుగు సినీ అభిమానుల్ని శోక సముద్రంలో ముంచి స్వర్గస్తుడయారు. అనుకరించడానికి అసాధ్యమైన ప్రత్యేకమైన శైలి రాజబాబుది. ఆయన మరణంతో తెలుగు చిత్రసీమకు కలిగిన లోటు ఎప్పటికి తీర్చలేనిది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ముచ్చింతల్ క్షేత్రంలో గుబాళిస్తున్న ఆధ్యాత్మిక పరిమళాలు - నానాటికీ అధికమవుతున్న భక్తుల సందర్శనలు



ముచ్చింతల్ లో పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి చొరవతో 216 అడుగుల ఎత్తయిన రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగి మూడేళ్లు పూర్తయింది. ఈ విగ్రహాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ 5 ఫిబ్రవరి 2022న వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఆవిష్కరించి జాతికి అంకితం ఇచ్చారు. 2025 వసంత పంచమితో విగ్రహావిష్కరణ మూడేళ్లు పూర్తి చేసుకుంది. రాజా ఆదరణ పొంది ప్రాబల్యాన్ని సంతరించుకున్న జైన, – బౌద్ధ, శైవ మతాలు స్థానిక ఆచార వ్యవహారాలలో కలసి, అనేకానేక శాఖలుగా విభజితాలై, వేర్వేరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ తమ శాఖలు – గొప్ప వని నొక్కి చెబుతూ, మూల ఉపనిషత్తుల సారాన్ని ప్రజలకు చేరువ చేయజాలని సమయాన, విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించి ఉద్ధరించారు శ్రీ రామానుజాచార్యులు. త్రిమతాచార్యులలో, ద్వితీయులైనా, కర్తవ్య నిర్వహణలో అద్వితీయులు. అసమాన ధైర్యాన్ని ప్రదర్శించి, – సాటిలేని భక్తి తత్పరునిగా తత్వవేత్తగా, ఆస్తిక హేతువాదిగా, పరమ యోగిగా, నాటికి ప్రబల ప్రచారంలో ఉన్న సంప్రదాయాలన్నీ, దేవుడిని కొలవడానికి భిన్న మార్గాలే కాని, వైదిక మతానికి బదులుగా పాటించాల్సినవి కానే కాదని నొక్కి చెప్పిన ధీశాలి ఆయన. రామానుజులు జన్మించే నాటికి చోళులు, శైవ మతానుయాయులు అయినప్పటికీ, వైదిక మతాలను వ్యతిరేకించ లేదు. చాళుక్యులు శైవ మతస్తులు అయి ఉండి, తర్వాత జైన మతాన్ని ఆలపించారు. హొయసల రాజులు, జైన, వీరశైవ మతాలను ఆదరించారు. మౌర్యుల కాలానికి బౌద్ధం క్షీణ దశకు చేరుకుంది. మద్రాసుకు 30 మైళ్ళ దూరాన గల, శ్రీపెరుంబుదూరులో, హరిత గోత్రోద్భవులు, ఆపస్తంభ సూత్ర, యజుర్వేద శాఖాధ్యాయులు, శ్రీమాన్ అసూరి సర్వక్రతు కేశవ సోమయాజి దీక్షితార్, కాంతిమతి దంపతులకు కలియుగ సంవత్సరం 4118 క్రీస్తు శకం 1017 వైశాఖ శుక్ల పక్ష షష్టి గురువారం జనన మొందారు రామానుజులు. రామానుజులు ఆనాటి ఆచార వ్యవహారాలు, చాందసంగా మారి, సామాజిక ప్రగతికి అడ్డు రాకముందే, గుర్తించి వాటిని, మానడమో, మార్చడమో చేయాలని కర్తవ్య నిర్దేశం చేశారు. గురువు చెప్పేదంతా గుడ్డిగా నమ్మక తర్కానికి గురిచేసి, తప్పో, ఒప్పో నిర్ణయించు కోవడం పాపం కాదని, హితవు పలికారు. సమాజ శ్రేయస్సు కన్నా, వ్యక్తిగత శ్రేయస్సు ముఖ్యం కాదని రామానుజులు నొక్కి చెప్పారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ లో 45 ఎకరాల విస్తీర్ణంలో పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి సత్ సంకల్పంతో దివ్య క్షేత్ర పనులు 2016లో ప్రారంభ మయ్యాయి. 45 ఎకరాల విస్తీర్ణంలో రూ.1000 కోట్లతో పనులు జరిగాయి. పల్లవ, చోళ, చాళుక్య, కాకతీయ, విజయనగర నిర్మాణ శైలులను కలగలిపి వివిధ 2700 మంది శిల్పుల భాగస్వామ్యంతో నిర్మాణాలు చేపట్టగా, ప్రధానంగా.. సమతామూర్తి 216 అడుగుల, 1800 కిలోల బరువు గల మహా పంచలోహ విగ్రహాన్ని 1600 భాగాలుగా తొమ్మిది నెలల కఠోర శ్రమ తో చైనాలో తయారు చేయించారు. మన దేశానికి తెచ్చాక చైనాకు చెందిన 60 మంది నిపుణులు విగ్రహ రూపునిచ్చారు. వెయ్యేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సమతామూర్తి మహా విగ్రహం చుట్టూ శ్రీవైష్ణవంలో దివ్యదేశాలుగా భావించే 108 పుణ్య క్షేత్రాలు, గర్భాలయాల ఆకృతిలో 108 ఆలయాలను నిర్మించారు. వీటిని అనుసంధానిస్తూ మధ్యలో 468 స్తంభాలతో భారీ దివ్యదేశ మండపాన్ని నిర్మించారు. సమతామూర్తి విగ్రహ దిగువ న భద్రవేదిక 54 అడుగులు, పద్మ పీఠం 27 అడుగులు, శ్రీరామానుజాచార్యుల విగ్రహం 108 అడుగులు, స్వామి చేతిలోని త్రిదండం 27 అడుగుల ఎత్తు ఉన్నాయి. మహా విగ్రహం కింద విశాలంగా ఉన్న గర్భగుడిలో 120 కిలోల బంగారు విగ్రహ రూపంలో రామానుజులు నిత్య పూజా. మూర్తిగా దర్శనం ఇస్తారు. అలా వెయ్యేళ్ల క్రితం భారతావనిలో నడయాడిన సమతా మూర్తి జగద్గురు శ్రీరామానుజాచార్యులు భక్తులకు నిత్య దర్శనం ఇస్తున్నారు. ముచ్చింతల్ లో గల త్రిదండి చినజీయర్ స్వామి చొరవతో 216 అడుగుల ఎత్తయిన రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగి రెండేళ్లు పూర్తయింది. 2022 ఫిబ్రవరి 5వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన చేతుల మీదుగా ఈ సమతా మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వసంత పంచమితో మూడవ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. గత మూడేళ్లుగా అనుదినం దేశ విదేశాల నుండి పర్యాటకులు, సందర్శకులు, యాత్రికులు, భక్తులు నానాటికీ పెరిగిపోతూ, కొత్త అనుభూతులను వెంట తీసుకెళ్ళు తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# వడపోద్దాం.. వాడేద్దాం

హైదరాబాద్ : నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లో శుద్ధి చేసిన మురుగునీరు పునర్వినియోగంతో నీటి కొరతకు కొంతమేర పరిష్కారం చూపేందుకు జలమండలి కార్యాచరణను సిద్ధం చేసింది. బల్దియాలో నీటి అవసరాలు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తోంది. నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)ల నిర్వహణను ప్రత్యేకంగా పరిశీలించనుంది. వీటిని నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవడంతో పాటు మురుగుజలాలను శుద్ధి చేసి వాటిని తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాల్సి ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇలాంటి ఎస్టీపీలు నగరంలో వెయ్యిదాకా ఉన్నట్లు జలమండలి గుర్తించింది. ఇవి పనిచేస్తున్నాయా? లేదా? పని చేస్తే ఏ ప్రమాణాల మేర శుద్ధి చేస్తున్నారు? ఆ నీటిని వినియోగిస్తున్నారా? లేదా? అనే అంశాలు పరిశీలించనుంది.

**పనితీరు మదింపు**



నగరంలోని ప్రైవేటు ఎస్టీపీలను గుర్తించి డేటాను రూపొందించడంతో పాటు వాటి పనితీరును థర్డ్‌పార్టీతో మదింపు చేసేందుకు జలమండలి రంగం సిద్ధం చేసింది. వందశాతం నిబంధల మేరకు నిర్వహించాలని జలమండలి ఇప్పటికే గేటెడ్ కమ్యూనిటీలను ఆదేశించింది. ఆస్కి లేదా ఈపీటీటీఆర్ఐ వంటి సంస్థలతో ప్రైవేటు ఎస్టీపీలను మదింపు చేయనున్నారు. నిబంధనల మేరకు లేని గేటెడ్ కమ్యూనిటీలపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే జరిమానా విధించాలని జలమండలి భావిస్తోంది.

**50 శాతం రాయితీ..**

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిబంధనల మేరకు శుద్ధి చేసిన మురుగునీటి జలాలను కనీసం 50 శాతం పునర్వినియోగించుకోవాలి. ఇటీవల జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి నగరంలోని బిల్డర్లతో సమావేశమైనప్పుడు గేటెడ్ కమ్యూనిటీల్లోని ఎస్టీపీల నిర్వహణపై ప్రత్యేకంగా చర్చించారు. నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్రమాణాలను జలమండలి పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. పూర్తి స్థాయిలో ఎస్టీపీలను ఏర్పాటు చేసుకున్నవారికి సీవరేజీ ఛార్జీల్లో 50 శాతం దాకా రాయితీ ఇవ్వనున్నారు.

# అభయహస్తంపై ఆశలు

పెద్దపల్లి : కొన్నేళ్లుగా నిలిచిపోయిన అభయ హస్తం సొమ్ము చెల్లించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటన ఖాతాదారులకు ఊరట కలిగిస్తోంది. ఈ మేరకు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న స్వయం సహాయక మహిళలకు ఇబ్బందులు తీరనున్నాయి. నెలాఖారులోపు అర్హుల ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితా రూపొందించనున్నారు. దశాబ్ద కాలం తర్వాత మహిళలు పొదుపు చేసిన సొమ్ము తిరిగి జమ కానుండటంతో హర్షం వ్యక్తమవుతోంది.

**పింఛను.. ఉపకార వేతనాలు**

స్వశక్తి సంఘాల సభ్యుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. సంఘంలో చేరిన ప్రతి మహిళ ఏడాదికి రూ.365 చొప్పున ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం మరికొంత నగదు జమచేసేది. 60 ఏళ్లు దాటిన మహిళలకు ప్రతి నెలా రూ.500 పింఛను చెల్లించాలన్నది లక్ష్యం. అలాగే కుటుంబంలో 9, 10 తరగతులు, ఇంటర్, ఐటీఐ చదివే విద్యార్థులు ఉంటే ఏడాదికి రూ.1200 చొప్పున ఇద్దరు పిల్లలకు ఉపకార వేతనాలు అందించేవారు. అభయ హస్తం



లబ్ధిదారులు సహజ మరణం పొందితే రూ.30 వేలు, ప్రమాదవశావత్తు మరణిస్తే రూ.70 వేల పరిహారాన్ని కుటుంబాలకు అందించేవారు.

**పదేళ్లుగా నిరీక్షణ**

2014లో రాష్ట్ర పునర్విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని నిలిపివేసింది. ఆసరా పథకాన్ని ప్రారంభించి పింఛను సొమ్ము రెట్టింపు చేసింది. అంతకుముందు అభయహస్తం పథకానికి పదేళ్ల పాటు కట్టిన డబ్బులు తిరిగి చెల్లిస్తామని పలుమార్లు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. 60 ఏళ్లు దాటిన మహిళల్లో చాలా మందికి అటు ఆసరా, ఇటు అభయహస్తం సొమ్ము అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవిత చరమాంకంలో ఆర్థిక భరోసా ఇస్తుందని ఆశించిన మహిళలు నిరాశకు గురవుతున్నారు.

**మొత్తం 3,34,232 మంది**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 3,34,232 మంది మహిళలు అభయహస్తం పథకానికి ప్రీమియం సొమ్ము చెల్లించారు. వీరిలో ఎంతమంది 60 ఏళ్లు పైబడి ఉన్నారో క్షేత్ర స్థాయిలో సెర్ప్ అధికారులు తేల్చనున్నారు. మృతుల పేర్లను జాబితా నుంచి తొలగించి, గ్రామాల వారీగా వివరాలు సేకరించనున్నారు. ఈ మేరకు అర్హుల లెక్క తేలనుంది. స్వశక్తి సంఘాల్లోని మహిళల ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించనున్నారు. గతంలో మాదిరిగానే పిల్లలకు ఉపకార వేతనాలు అందనున్నాయి.నాలుగేళ్లు క్రమం తప్పకుండా చెల్లించా..మా సంఘంలో నాలుగేళ్లు క్రమం తప్పకుండా ఏడాదికి రూ.365 చొప్పున చెల్లించా. నాకు 60 ఏళ్లు దాటడంతో అభయహస్తం పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా. మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.కనకమ్మ, కమాన్‌పూర్ మండలం

# నిధులు లేవు.. విధులకు రారు!



కోరుట్ల : గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలై ఏడాది ముగుస్తోంది. ఒక్కో పంచాయతీకి ఒక్కో అధికారిని నియమించాల్సి ఉండగా.. అధికారుల కొరత కారణంగా రెండు నుంచి మూడ్నాలుగు గ్రామాలకో ప్రత్యేకాధికారిని నియమించారు. దీంతో పనిభారం పెరిగి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించింది. పంచాయతీలతో పాటు మండల పరిషత్తులకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినా వారు పట్టించుకున్న దాఖలాల లేవు. సొంత శాఖల్లో పనిభారంతో పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడంతో క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమావేశాలు, సంతకాలకే పరిమితమవుతుండడంతో పాలన పడకేసింది. నిధుల లేమి, పర్యవేక్షణ లోపం, పాలనా వ్యవహారాలు చూసే వారు కరవై ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

**భారమంతా కార్యదర్శి పైనే..**

పాలకవర్గాలు లేకపోవడం, ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడం, నిధుల లేమితో పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపై పడుతోంది. పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా, ప్రభుత్వ పథకాల సర్వే, ట్రాక్టర్, ట్యాంకర్ల నిర్వహణ, తాగునీటి పథకాల మరమ్మతు, పైపులైన్ల లీకేజీ, వీధి దీపాలు ఇలా పలు రకాల పనుల కోసం పలువురు పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులను వెచ్చించాల్సి వస్తోందన్న ఆరోపణలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సరిపడా విడుదల కాకపోవడంతో కష్టంగా మారింది. నిధుల కొరతతో పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకలేక, వారితో పని చేయించడం కష్టతరంగా మారింది.

**వేసవి గట్టెక్కేనా..**

పల్లెల్లో ముఖ్యంగా వేసవిలో తాగునీటి అవసరాలతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ ముఖ్యం. భగీరథ నీరు పల్లెలకు సక్రమంగా చేరకపోవడంతో స్థానిక వనరులపై ఆధారపడతారు. తాగునీటి పథకాల్లో నీటి వనరులు లేని గ్రామాల్లో మంచినీటి కటకట తప్పదు. ట్యాంకర్లు, అద్దె బోర్లు, ఇతర ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నా పంచాయతీల్లో నిధులు ఉంటేనే సాధ్యపడుతుంది. ప్రత్యేకాధికారుల పాలనలో వేసవి ఎలా గట్టెక్కుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎండా కాలంలో వివిధ రకాల వ్యాధులు విజృంభిస్తాయి. పారిశుద్ధ్య నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించినా ప్రజలు అనారోగ్యానికి గురవుతారు. ప్రభుత్వం, ప్రత్యేకాధికారులు గ్రామాలను పట్టించుకొని తగిన చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

**సమస్యలు ఇవి..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక చిన్న పంచాయతీల్లో గతంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్ల రుణ వాయిదాలు చెల్లించడం కష్టంగా మారింది.

పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు నిర్వహణ కొరవడ్డాయి.

గతంలో పల్లెలకు పంపిణీ చేసిన చెత్త డబ్బాలు చెడిపోయి కొత్తవి కొనలేక పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది.

కొన్ని పంచాయతీల్లో డీజిల్‌కు డబ్బులు వెచ్చించలేక చెత్త ట్రాక్టర తిరగకపోవడంతో రహదారులపై చెత్త దర్శనమిస్తోంది. కొన్ని చోట్ల కార్యదర్శులు డీజిల్ కోసం అప్పులు చేస్తున్నారు.

వీధి దీపాలు మరమ్మతుకు గురైనా వాటి స్థానంలో కొత్తవి బిగించలేని పరిస్థితి.గ్రామాలకు భగీరథ నీరు చేరక పాత తాగునీటి పథకాల నిర్వహణ, విద్యుత్తు బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది.

క్రీడా ప్రాంగణాల్లో అమర్చిన పరికరాలు తుప్పు పడుతున్నా సరిదిద్ద లేని పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు 1215
మండల పరిషత్తులు 58
జిల్లా పరిషత్తులు 04

# తడారి..నెర్రెలు బారి!



ఎల్లారెడ్డిపేట : జిల్లాలో వరికి సాగునీటి వినియోగం భారీగా పెరుగుతోంది. పైరు పొట్టదశ, ఈనే దశకు చేరుతుండగా భూగర్భజలాలను అధికంగా వాడుతున్నారు. ఓ వైపు ఎండలు ముదిరిపోతుండడం, మరోవైపు సాగునీటిని ఎక్కువగా పారించడం వల్ల చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఈ ప్రభావం భూగర్భజల మట్టాలపై పడుతోంది.

**గణనీయంగా సాగు**

మెట్ట ప్రాంతమైన జిల్లాలో జనవరిలో జిల్లా సగటున 7.98 మీటర్ల మేర భూగర్భజల మట్టాలున్నాయి. రైతులు యాసంగిలో ఇప్పటి వరకు ప్రధానంగా 169,675 ఎకరాల్లో వరి, 50 ఎకరాల్లో గోధుమ, 1491 ఎకరాల్లో మొక్కజొన్న, 180 ఎకరాల్లో శనగ, 134 ఎకరాల్లో నువ్వులు, 25.2 ఎకరాల్లో వేరుసెనగ, 1021 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటలను సాగు చేశారు.

**మున్ముందు మరింత తీవ్రం**

జిల్లా దిగువ ప్రాంతాన జలం సమృద్ధిగా ఉండగా ఎగువన బోరుబావుల్లో నుంచి ఊట క్రమంగా తగ్గిపోతోంది. కొన్నిచోట్ల పూర్తిగా వట్టిపోతుండగా పైర్లు ఎండిపోతున్నాయి.

ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, దేవునిగుట్టతండా, తిమ్మాపూర్ తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, వీర్నపల్లి, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, వేములవాడ అర్బన్ మండలాల్లో భూగర్భ జలమట్టాలు లోతులోకి వెళ్లడంతో సీజనల్ గొట్టపుబావులు మొండికేస్తున్నాయి.

జిల్లాలో నెల వ్యవధిలోనే భూగర్భ జల మట్టాలు 0.96 మీటర్ల లోతుకు పడిపోవడం తీవ్రతకు అద్దం పడుతోంది.

ఎల్లారెడ్డిపేట మండలంలో అత్యధికంగా 13.82 మీటర్ల లోతుతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

డిసెంబరు మాసంలో జిల్లా సగటు భూగర్భజల మట్టాలు 7.02 మీటర్లుండగా ఈ ఏడాది జనవరి మాసంలో 7.98 మీటర్ల లోతుకు చేరుకున్నాయి. అతికొద్దిలోతు 3.97 మీటర్లలో చందుర్తి మండలంలో భూగర్భజల మట్టాలుండగా ఎక్కువలోతు 13.82 మీటర్లలో ఎల్లారెడ్డిపేట మండలంలో జలాలు లభిస్తున్నాయి.

గతేడాది మేతో పోల్చితే ఈ జనవరిలో 2.63 మీటర్ల మేరకు పెరుగగా గతేడాది జనవరితో పోల్చితే ఈ సంవత్సరం జనవరిలో 0.72 మీటర్ల మేర పెరిగాయి. భూగర్భజల మట్టాల్లో తరుగుదల రానున్న ఫిబ్రవరి, మార్చి మాసాల్లో మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉండగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

# సింగరేణి సంచాలకుల నియామకం

గోదావరిఖని : ఎట్టకేలకు సింగరేణి సంచాలకులను నియమించారు. రాత్రికి రాత్రే అర్హులైన పది మంది జీఎంలను ముఖాముఖి పరీక్షలకు ఆహ్వానించారు. ఒక స్థానానికి అయిదుగురు చొప్పున అధికారులను పిలిచారు. సింగరేణి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖాముఖిలో శ్రీరాంపూర్ జీఎంగా పనిచేస్తున్న ఎల్.వి.సూర్యనారాయణను ఆపరేషన్ డైరెక్టర్‌గా, రామగుండం అడ్రియాల జీఎంగా పనిచేస్తున్న కొప్పుల వెంకటేశ్వర్లును ప్రాజెక్టు ప్లానింగ్ సంచాలకులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నెల రోజులుగా సంచాలకుల నియామకం కోసం జరుగుతున్న ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. ఒకదశలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సంచాలకుల ఎంపిక పరీక్షలు ఇప్పట్లో నిర్వహించే అవకాశం లేదనే ప్రచారం జరిగింది. పది రోజుల క్రితం ఎంపిక పరీక్షలకు అధికారులను ఆహ్వానించినా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అందుబాటులో లేరని వాయిదా వేశారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో సంచాలకుల ఎంపిక వాయిదా పడుతుందని భావించారు. కాగా 11 గంటల ప్రాంతంలో అర్హులైన పది మంది జీఎం స్థాయి అధికారులకు ఆహ్వానం పంపడంతో వరకు సింగరేణి భవన్‌కు చేరుకున్నారు. ఒక్కో డైరెక్టర్ స్థానానికి అయిదుగురు చొప్పున ఆహ్వానించి ఎంపిక పరీక్షలు నిర్వహించారు.

**కొనసాగిన ఆనవాయితీ**సంచాలకుల స్థానం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో పనిచేసిన అధికారులను వరిస్తోంది. తాజాగా ఇదే ప్రాజెక్టు జీఎంగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వర్లు ప్రాజెక్టు ప్లానింగ్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన జీఎంలు సింగరేణి డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. అదే ఒరవడి మరోసారి కొనసాగింది. గతంలో సైతం ఇదే ప్రాజెక్టు జీఎంలుగా పనిచేసిన నలుగురు అధికారులు సంచాలకులుగా ఎంపికయ్యారు. తాజాగా ఏఎల్‌పీ జీఎంగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వర్లుకు డైరెక్టర్ పదవి వరించింది. గతంలో ఇదే ప్రాజెక్టులో బి.భాస్కర్‌రావు 2010 నుంచి 2015 వరకు జీఎంగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన ప్రాజెక్టు ప్లానింగ్ సంచాలకులుగా ఎంపికయ్యారు. ఇక్కడ జీఎంగా పనిచేసిన ఎస్.చంద్రశేఖర్ ఆపరేషన్ సంచాలకులుగా ఎంపికయ్యారు. ఆయన ఏఎల్‌పీలో 2015 నుంచి 2017 వరకు జీఎంగా పనిచేశారు. 2017 నుంచి 2019 వరకు జీఎంగా పనిచేసిన వీరారెడ్డి సైతం ప్రాజెక్టు ప్లానింగ్ సంచాలకునిగా ఎంపికయ్యారు. 2023 వరకు ఏఎల్‌పీ జీఎంగా పనిచేసిన ఎన్.వి.కె.శ్రీనివాస్ ఆపరేషన్ సంచాలకులుగా విధులు నిర్వహించారు. తాజాగా ఎంపిక కావడంతో స్థానికంగా హర్షం వ్యక్తమైంది.

# మహా శివరాత్రికి ఏర్పాట్లు

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు అత్యంత వైభవంగా జరిగే మహా శివరాత్రి జాతరకు ఏర్పాట్లు మొదలయ్యాయి. వేడుకలకు దాదాపు 4 లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం దాదాపు రూ.1.75 కోట్లను వెచ్చిస్తున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాకారాలు, గోపురాలను అగ్నిమాపక యంత్రాలతో శుభ్రం చేసి రంగులు వేసే పనులు మొదలు పెట్టారు. మరోవైపు కోడెల క్యూలైన్ ప్రాంతంలో రంగులు వేసే పనులు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన ద్వారం, ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాల్లో భక్తులు సేదతీరేందుకు, జాగరం చేసేందుకు అవసరమైన చలువ పందిళ్లను వేస్తున్నారు. పనులు వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇప్పటికే క్యూలైన్లలోని జాలీలకు అక్కడక్కడ వెల్డింగ్ పనులు పూర్తి చేశారు.

**వారం రోజుల ముందే...** మహా శివరాత్రి జాతర ఏర్పాట్లు గతంలో మాదిరిగా కాకుండా వారం రోజుల ముందే పూర్తి చేసేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ నెల 8న ఆలయ ఓపెన్ స్లాబ్ వేదికలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ అధికారులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రభుత్వ విప్ ఆది



శ్రీనివాస్ మహా శివరాత్రి జాతర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపట్టాల్సిన పనులపై విప్, కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. జాతరకు వచ్చే ఏ ఒక్క భక్తుడికి ఇబ్బంది కలగకుండా స్వామివారి దర్శనం సులువుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు విప్ సూచించారు. దీంతో ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. అనుకున్న సమయానికి ముందే పూర్తి చేసేలా అధికార యంత్రాంగం కార్యాచరణను సిద్ధం చేసింది.

**చేపడుతున్నవి ఇవే...**

రాజన్న ఆలయం, ఆలయ పరిసరాల్లో రూ.37 లక్షలతో తాత్కాలిక పెండాళ్లు నిర్మిస్తున్నారు. దాదాపు రూ.20 లక్షలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. రూ.34 లక్షలతో తాత్కాలిక పనులు, రూ.7.40 లక్షలతో రాజన్న ప్రధాన ఆలయానికి రంగులు, మరో రూ.7.30 లక్షలతో అనుబంధ ఆలయాలకు రంగులు, రూ.8 లక్షలతో ఆర్టీసీ ఆర్చ్ గేట్లు, ఆలయ ధర్మగుండానికి రంగులు, రూ.4.50 లక్షలతో పెండాళ్లకు తెల్లని వస్త్రం, రూ.10 లక్షలతో గుడి చెరువులో భక్తులు సేదతీరేందుకు పెండాళ్లు ఏర్పాటు చేయనున్నారు. రూ.3.80 లక్షలతో మూలవాగులోని బతుకమ్మ తెప్ప నుంచి తిప్పాపూర్ వైపు అత్యవసర రోడ్డు నిర్మాణం, రూ.4.50 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాట్లు, రూ. 4.70 లక్షలతో భక్తులకు శుద్ధ జలం సరఫరా, రూ.8.20 లక్షలతో కోడెల క్యూలైన్, క్యూ కాంప్లెక్స్‌కు రంగులు, రూ.5 లక్షలతో ఆలయ పార్కింగ్ స్థలంలో బారికేడ్ల ఏర్పాటు, రూ.9.50 లక్షలతో ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నాయి. రూ.4.80 లక్షల వ్యయంతో బస్టాండ్ నుంచి పార్కింగ్ స్థలం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నారు. రూ.2 లక్షలతో సౌండ్ సిస్టమ్, రూ.4 లక్షలతో అదనపు సీసీ కెమెరాల ఏర్పాటు వంటివి చేయనున్నారు.కొనసాగుతున్నాయి మహా శివరాత్రి జాతర పనులు కొనసాగుతున్నాయి. ఇప్పుడిప్పుడే పనుల్లో వేగం పుంజుకుంది. ముందుగానే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.రఘునందన్, డీఈ, రాజన్న ఆలయం

# భారం తగ్గేలా.. వేగం పెరిగేలా..

మెదక్ : రెండేళ్ల కిందట రెండు జిల్లాలకు నూతన రైలు మార్గం ఏర్పాటైంది. గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు, రిజర్వేషన్ సౌకర్యంతో ఇరు జిల్లాలకు ప్రయాణం సులువైంది. ఆయా మార్గాల్లో డీజిల్‌తో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ భారాన్ని తగ్గించేందుకు, కాలుష్య నివారణకు ఆ రూట్లలో విద్యుదీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మార్గంలో పనులు పూర్తయ్యాయి. మరో వైపు చేపట్టేందుకు నిధులు కేటాయించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ఉన్న సమయంలో జహీరాబాద్‌కు రైలు మార్గం ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక మెదక్, సిద్దిపేట జిల్లాలకు రైల్వేలైన్ ఏర్పాటైంది. గతంలో మెదక్ జిల్లాలో మనోహరాబాద్ నుంచి రామాయంపేట మండలం అక్కన్నపేట వరకు 38 కిలోమీటర్లు ఉండగా, అక్కన్నపేట నుంచి మెదక్ వరకు 17.2 కి.మీ.ల మార్గం 2022 ఆగస్టులో ఏర్పాటైంది. సిద్దిపేట జిల్లాకు రెండేళ్ల కిందట లైన్ అందుబాటులోకి వచ్చింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా పెద్దపల్లి జిల్లా కొత్తపల్లి వరకు రైలు మార్గం మంజూరు కాగా, సిద్దిపేట వరకు 76 కి.మీ.ల లైన్ ఏర్పాటై ప్యాసింజర్ రైలును నడిపిస్తున్నారు.

**మెదక్‌లో 38 కిలోమీటర్ల మేర డబ్లింగ్..**

సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ల నుంచి మేడ్చల్ వరకు డబ్లింగ్ రైలు మార్గం ఉంది. అక్కడి నుంచి జిల్లాకు వచ్చే మార్గంలో సింగిల్ లైన్ ఉండడంతో మేడ్చల్ –ముద్కేడ్ మార్గంలో నడిచేరైళ్లను ఆయా స్టేషన్లలో ఆపాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఈ లైన్‌ను డబుల్‌గా మార్చనున్నారు. మనోహరాబాద్ నుంచి అక్కన్నపేట వరకు 38 కిలోమీటర్ల మార్గం కూడా డబుల్ లైన్ కానుంది. దీంతో రైళ్లు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంది. క్రాసింగ్‌కు వేచి ఉండే పరిస్థితి తప్పనుంది.

**మనోహరాబాద్ -సిద్దిపేట మార్గంలో..**

మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు రైలు మార్గం 2023లో అందుబాటులోకి వచ్చింది. ఈ లైన్ సిరిసిల్ల మీదుగా కొత్తపల్లి వరకు నిర్మించనున్నారు. ప్రస్తుతం గజ్వేల్ మీదుగా సిద్దిపేట పట్టణం వరకు రైలు నడుస్తోంది. ఈ మార్గాన్ని విద్యుదీకరణ చేయాలని అధికారులు నిర్ణయించి, రూ.105 కోట్లు కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

**38 కి.మీ. పూర్తి..**మెదక్ జిల్లాలో ఇది వరకు 38 కిలోమీటర్ల రైలు మార్గం విద్యుదీకరణ పూర్తయింది. రెండేళ్ల కిందట అక్కన్నపేట నుంచి మెదక్ వరకు రైలు మార్గం అందుబాటులోకి వచ్చింది. జిల్లాలో మనోహరాబాద్ నుంచి అక్కన్నపేట వరకు ఉన్న లైన్ గతంలోనే విద్యుదీకరణ పూర్తయింది. అక్కన్నపేట నుంచి మెదక్ వరకు నడిచే రైళ్లు డీజిల్‌తో నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఈ మార్గాన్ని విద్యుదీకరణ చేయాలని నిర్ణయించారు. గతేడాది ఆగస్టులో పనులు ప్రారంభమై ఇటీవల పూర్తయ్యాయి. ఇందుకు రూ.15.49 కోట్ల వ్యయం అయ్యింది. అక్కన్నపేట–మెదక్ లైన్ మార్గం ఏర్పాటుతో రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో శతశాతం విద్యుదీకరణ పూర్తయింది. ట్రయల్ రన్ విజయవంతమైంది.

చురకలు



## మార్చిలోగా డబ్లింగ్, విద్యుదీకరణ పనులు

హైదరాబాద్ : రైల్వే ప్రయాణాల్లో కీలకంగా మారనున్న లాలాగూడ – సీతాఫల్‌మండి 'కార్డ్‌లైన్', సీతాఫల్‌మండి – మౌలాలి 'డబ్లింగ్, విద్యుద్దీకరణ' పనులు మార్చి నెలాఖరుకల్లా పూర్తికానున్నాయి. ఏడాది క్రితం ఈ పనులు చేపట్టగా 40 రోజుల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్టు ద.మ.రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ ట్రాక్‌లు అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ స్టేషన్‌తో అనుసంధానమైన ఉన్న మెయిన్‌లైన్లపై ఒత్తిడి తగ్గుతుంది. సీతాఫల్ మండి, మల్కాజ్‌గిరి స్టేషన్లను బైపాస్ చేస్తూ కాచిగూడకు రైళ్లను మళ్లించొచ్చు. సింగిల్‌ట్రైన్‌లైన్ల ద్వారా మల్కాజ్‌గిరి మార్గంలో మరిన్ని ఎంఎంటీఎస్ రైళ్లను నడిపేందుకు ఆస్కారం ఏర్పడనుంది.

**కార్డ్‌లైన్‌తో నేరుగా కాచిగూడకు..**

సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్, ఎంఎంటీఎస్ రైళ్ల ట్రాఫిక్‌తో స్టేషన్‌పై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. దీంతో దక్షిణ మధ్య రైల్వే 4 కిలోమీటర్ల మేర లాలాగూడ – సీతాఫల్‌మండి 'కార్డ్‌లైన్', 10 కిలోమీటర్ల మేర సీతాఫల్‌మండి – మౌలాలి 'డబ్లింగ్, విద్యుద్దీకరణ'



పనులను చేపట్టింది. ఈ కొత్త మార్గాల ద్వారా పలు గూడ్స్, ఎక్స్‌ప్రెస్‌రైళ్లతో పాటు కొన్ని రైళ్లను కాచిగూడకు నేరుగా మళ్లించడంతో పాటు మరికొన్నింటిని ఇతర స్టేషన్లలో నిలిపి, ఎంఎంటీఎస్ ప్రయాణాలను మెరుగుపరచవచ్చు. కాజీపేట–చర్లపల్లి– మౌలాలీ మీదుగా ప్రయాణించే రైళ్లన్నీ మల్కాజిగిరి – సీతాఫల్‌మండి స్టేషన్లను బైపాస్ చేస్తూ కాచిగూడ – బెంగళూరు లైన్ మీదుగా కాచిగూడకు చేరుకునేలా వెసులుబాటు కల్పించింది. దీంతో ప్రయాణ సమయం 30 నిముషాలు ఆదా అవుతుంది.

**గంట సమయం ఆదా..**

గతంలో గుంటూరు, విజయవాడ మీదుగా వచ్చే రైళ్లను నిజామాబాద్, నాందేడ్ వైపు వెళ్లే రైళ్లను మళ్లించేందుకు సికింద్రాబాద్ స్టేషన్‌లో హాల్టింగ్, ఇంజిన్ మార్పుకోసం పడే ప్రయాసలు అన్నీ ఇన్నీ కావు. అందుబాటులోకి రానున్న కార్డ్‌లైన్ ద్వారా సికింద్రాబాద్‌కు వెళ్లకుండా.. ఇంజిన్ మార్చుకొనే అవసరం లేకుండా నేరుగా దయానంద్‌నగర్ చేరుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందుకోసమే దయానంద్‌నగర్‌లో 24 కోచ్‌లకు సరిపడా ప్లాట్‌ఫామ్‌ను నిర్మిస్తున్నారు. తాజా మార్గాలు అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఖాళీ లేక బయటే రైళ్లను నిలిపే ప్రయాస తప్పుతుంది.

## స్వయం ఉపాధి శిక్షణలో సెట్‌విన్

హైదరాబాద్: ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థికంగా అండ లేని యువతకు.. సాంకేతిక విద్యను అభ్యసించినా నైపుణ్యంలేని విద్యార్థులకు.. వివాహాపై ఏదో ఒక పనిచేసి కుటుంబానికి ఆసరాగా ఉండాలని పరితపించే అతివలకు.. డిమాండ్ ఉన్న రంగాల్లో పట్టు సాధించాలనుకునే యువకులకు అండగా నిలుస్తోంది ప్రభుత్వరంగ సంస్థ'సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ ట్విన్ సిటీస్(సెట్విన్)'. నామమాత్రపు ఫీజులతో, సుశిక్షితులైన ఫ్యాకల్టీతో ఏటా సుమారు 20వేల మందికి శిక్షణ ఇస్తోంది. 1978లో ప్రారంభమైన ఈ సంస్థకు నగరంలో ప్రస్తుతం 19 కేంద్రాలు ఉన్నాయి. కోర్సులు, ఫీజుల వివరాలుమార్కెట్‌లో డిమాండ్ ఉన్న కంప్యూటర్ బేసిక్స్, పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్, డీటీపీ, సీ లాంగ్వేజ్, మొబైల్ రిపేరింగ్, డీజిల్ మెకానిక్, సీసీటీవీ ఇన్‌స్టలేషన్, సోలార్ టెక్నీషియన్ కోర్సుల్లో యువతకు శిక్షణ ఇస్తున్నారు. మహిళలు, విద్యార్థినులకు ప్రత్యేకంగా బ్యూటీషియన్, డిప్లొమా ఇన్ ఫ్యాషన్



డిజైనింగ్, మెహిందీ డిజైన్, టెక్స్‌టైల్ డిజైనింగ్, కుట్టు మిషన్ తదితర అంశాల్లో తర్ఫీదు ఇస్తోంది. ప్రీప్రైమరీ టీచర్ ట్రైనింగ్, క్రాఫ్ట్, కాలిగ్రఫీ, స్పోకెన్ ఇంగ్లిష్, హోటల్ మేనేజ్‌మెంట్.. ఇలా సుమారు 60 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైనవారు కేంద్రాలను నేరుగా సంప్రదించాలి.

**సంస్థలే వచ్చి నేరుగా ఎంపిక..**

వేణుగోపాలరావు, ఎండీ, సెట్విన్

కోర్సులు పూర్తి చేసినవారికి ఉపాధి కల్పించడానికి ఓ ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటుచేసి అధికారిని నియమించాం. పలు కంపెనీలు మావద్దకే వచ్చి అభ్యర్థుల్ని ఎంపిక చేసుకుంటున్నాయి. ఇక్కడ శిక్షణ పూర్తిచేసుకున్నవారు భవిష్యత్తులో తమ కాళ్లపై తాము నిలబడగలమనే భరోసా కల్పిస్తున్నాం'.

## ఏడాదిలో 744 ఆక్రమణల తొలగింపు




హైదరాబాద్: ట్రాఫిక్ సమస్యకు తీవ్ర ఇబ్బందిగా మారిన ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్‌ఎంసీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఆపరేషన్ రోప్ లో భాగంగా సోమవారం ట్రాఫిక్ పోలీసులతో కలిసి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి తొలగింపు ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి దోహదపడుతుంది. 2024 డిసెంబరు నుంచి 2025 జనవరి వరకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో కలిపి మొత్తం 744 ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఈ డ్రైవ్‌లో పట్టణ ప్రణాళిక, పోలీస్, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో జీహెచ్‌ఎంసీ వెల్లడించింది. ట్రాఫిక్ సమస్య తీర్చడానికి ఇలాంటి స్పెషల్ డ్రైవ్ లు ఇకపై తరచుగా నిర్వహిస్తామని పేర్కొంది.

# కూడళ్లు.. వీడుతున్న చిక్కుముళ్లు



హైదరాబాద్ : నగర ట్రాఫిక్ సమస్యలో నిత్యం వినిపించే కేబీఆర్ పార్కు కూడళ్ల అభివృద్ధి ప్రాజెక్టు మళ్లీ చర్చల్లోకి వచ్చింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెం.92లో తన ఇంటికి భూసేకరణ కోసం చేసిన మార్కింగ్ తప్పని సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో.. ప్రాజెక్టులో పురోగతి లేకపోవడంపై శనివారం సీఎం రేవంత్‌రెడ్డి బల్దియా అధికారులకు చేసిన హెచ్చరికల నేపథ్యంలో బల్దియా భూసేకరణలో వేగం పెంచింది. ఈ క్రమంలో.. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి రక్త నిధి కేంద్రం ప్రహరీని స్వల్పంగా తొలగించాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. జూబ్లీ చెక్‌పోస్టు కూడలిపై నిర్మించాల్సిన రెండోస్థాయి పైవంతెన కోసం రోడ్డు నెం.1ని కూడలికి ఇరువైపులా 145అడుగుల మేర విస్తరిస్తామని, అందులో భాగంగానే చిరంజీవి రక్త నిధి కేంద్రం వద్ద భూసేకరణ చేపడుతున్నట్లు జీహెచ్‌ఎంసీ వెల్లడించింది.

**ఇప్పటికే పలువురు ప్రముఖుల అంగీకారం..**

జూబ్లీహిల్స్ రోడ్డు నెం.92లో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఇల్లు, అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి ఇల్లు, రోడ్డు నెం.45 కూడలిలోని నందమూరి బాలకృష్ణ ఇల్లు, రోడ్డు నెం.1లోని అల్లు అర్జున్ భవనం, పలు మీడియా సంస్థల భవనాలు, ఇతర ప్రముఖులు, వ్యాపార వేత్తల ఆస్తులను సేకరించేందుకు బల్దియా కార్యాచరణను సిద్ధం చేసింది. మిగిలిన సర్వేని పూర్తి చేయడంతో.. తాజాగా రక్తనిధి కేంద్రం, మరిన్ని భవనాలు కూడా జాబితాలో చేరాయని అధికారులు చెబుతున్నారు. చాలా మంది భూసేకరణకు అంగీకరించారని స్పష్టం చేస్తున్నారు.

**రూ.1,200 కోట్ల సర్కారు నిధులతో..**

జూబ్లీచెక్‌పోస్టు కూడలితోపాటు ముగ్ధ చౌరస్తా, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, మహారాజ అగ్రసేన్ కూడలి, ఫిల్మ్‌నగర్ చౌరస్తా, రోడ్డు నెం.45కూడళ్లలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ పైవంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. రూ.1,200 కోట్ల నిధులతో ప్రాజెక్టుకు పరిపాలన అనుమతి కూడా ఇచ్చింది.

**పురోగతిలో మార్కింగ్ పనులు**

రోడ్డు నెం.45 కూడలిలో 40, అగ్రసేన్ కూడలిలో 45, ఫిల్మ్‌నగర్ కూడలిలో 43 ఆస్తుల సేకరణకు మార్కింగ్ పూర్తయిందని, కేంద్ర కార్యాలయానికి వివరాలు అందజేశామని అధికారులు చెబుతున్నారు. జూబ్లీచెక్‌పోస్టు వద్ద 47, ముగ్ధ చౌరస్తాలో 40, క్యాన్సర్ ఆస్పత్రి వద్ద 18 ఆస్తులను సేకరించాల్సి ఉందని, వాటి మార్కింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొంటున్నారు.

**చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదుపై..**

చంద్రశేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరుపుతామని అదనపు కమిషనర్ శివకుమార్ నాయుడు తెలిపారు.అధికారులు మాత్రం.. ఆయన ఇల్లు మలుపు వద్ద ఉండటంతో ఓ వైపున ఎక్కువగా, మరో వైపున తక్కువగా తొలగించాల్సిన అవసరం తలెత్తిందని చెబుతున్నారు.

# పొదుపు.. చేనేత కార్మికుడి మదుపు



కరీంనగర్ : చేనేత వస్త్ర ఉత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, అనుబంధ కార్మికులకు ప్రభుత్వం చేయూతనిచ్చే కార్యక్రమాలు అమలు చేయడమే కాకుండా ప్రత్యేకంగా నిధులు కూడా విడుదల చేసింది. ప్రతి కార్మికుడు తాము తయారు చేసే వస్త్ర ఉత్పత్తి ద్వారా పొందుతున్న వేతనంలో కొంత డబ్బును పొదుపు చేస్తే దానికి రెట్టింపుగా ప్రభుత్వం ఆ కార్మికుల కుటుంబానికి అందజేస్తోంది. గతంలోనూ ఈ కార్యక్రమం అమలైనా తాజాగా మళ్లీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పొదుపు విధానానికి మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిని థ్రిఫ్ట్ పథకం అంటారు.

**రెండేళ్లకు అమలు..**

గత ప్రభుత్వంలో 2017లో చేనేత రంగానికి, కార్మికులకు చేయూతనిచ్చేందుకు కార్మికుడు పొదుపు చేసిన మొత్తానికి రెట్టింపు ఇచ్చేందుకు అమలు చేసింది. మూడేళ్లపాటు జమ చేసిన డబ్బుకు రెండింతలు ప్రభుత్వం కలిపి వారి అవసరాల కోసం కాలపరిమితి తీరగానే విడుదల చేసింది. ఈ ప్రభుత్వం కూడా రెండేళ్లకు అమలు చేయనుంది. ప్రతి కార్మికుడు నెలనెలా పొందే వేతనంలో 8 శాతం డబ్బు చెల్లిస్తే ప్రభుత్వం 16 శాతం కలిపి పొదుపు చేస్తోంది.

మార్చి ఒకటి నుంచి అమలుకానున్న ఈ కార్యక్రమానికి క్షేత్రస్థాయి అధికారులు జిల్లాలోని చేనేత సహకార సంఘాల్లో పని చేసే కార్మికులకు ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో కార్మికులు జమ చేసిన తర్వాత నిర్లక్ష్యం చేశారనే విమర్శలు చేశారనే అపవాదు ఉంది. అందుకోసం ప్రభుత్వం చెల్లించే సహాయాన్ని పూర్తిస్థాయిలో పొందేందుకు వీలుగా కార్మికులకు అవగాహన కల్పించి ఈ పథకం వైపు ఆసక్తి చూపుతున్నారు.

గతంలో కార్మికులు ఈ పథకాన్ని పొందినప్పటికి కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 15వ తేదీ వరకు గడువు విధించారు.

**అర్హతలు ఇవి..**

కార్మికులకు తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలు ఉండాలి.

18 ఏళ్లుపైబడి జియోట్యాగింగ్ కలిగి ఉండాలి.

ప్రతినెలా 15వ తేదీలోగా చేనేత కార్మికుడు రూ.1200, అనుబంధ కార్మికులు రూ.600 రెండేళ్లపాటు జమ చేయాలి.

కార్మికుడు అర్ధాంతరంగా చనిపోతే ఆ డబ్బు కార్మికుడు సూచించే నామినికి లభిస్తుంది.

కార్మికులు వినియోగించుకోవాలి

జిల్లాలో పొదుపు పథకంపై చేనేత కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. వీరందరికి మార్చిలో ఈ పథకం వర్తిస్తుంది. జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ ఉండటంతో మార్చి మూడు తర్వాత అమల్లోకి వస్తుంది. ఆలోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.విద్యాసాగర్, సహాయ సంచాలకులు, చేనేత జౌళి శాఖ

జిల్లాలో చేనేత సంఘాలు : 21

కార్మికులు : 844

అనుబంధ కార్మికులు : 536

గతంలో లబ్ధి పొందిన మొత్తం: రూ.5.30 కోట్లు

# ఉగాది నాటికి కార్మికుడే యజమాని



సిరిసిల్ల : జిల్లాలో నేత కార్మికులను యజమానులుగా చేసే ప్రక్రియకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీనికోసం దరఖాస్తుల స్వీకరణ.. అర్హుల ఎంపికకు చేనేత, జౌళిశాఖ సీఎఫ్ (కమ్యూనిటీ ఫెసిలిటేటర్)లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. మరోవైపు మరమగ్గాల కొనుగోలు.. అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. తొలివిడత వెయ్యి మంది అర్హుల ఎంపిక చేయనున్నారు. ఉగాది నాటికి పథకానికి తుదిరూపు తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**వందశాతం రాయితీ.. కొత్త శకం**

లబ్ధిదారులుగా ఎంపికైన వారు పదిశాతం తమ వాటా చెల్లించాలని తొలుత నిర్ణయించారు. కానీ ఇక్కడ పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. సిరిసిల్లలోని కార్మికులు నివాసం ఉండే ప్రాంతాలు పూర్తిగా ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాల్లో ఉన్నాయి. కనీసం వీరి నివాస గృహాలపై బ్యాంకులు రుణాలు ఇచ్చే పరిస్థితిలేదు. దీనికోసం జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేస్తోంది.

కార్మికులకు వంద శాతం రాయితీపై ఈ పథకానికి ఎంపిక చేయనున్నారు. పథకంలో మరమగ్గాలు పొందిన లబ్ధిదారులకు నూలు రాయితీతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లు ఇవ్వనున్నారు. ప్రైవేటు ఉత్పత్తుల విక్రయాలకు జిల్లాలోనే ప్రత్యేకంగా మార్కెటింగ్ వసతిని కల్పించేందుకు ప్రముఖ వస్త్రోత్పత్తుల సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లా వస్త్రోత్పత్తుల్లో కొత్తశకం ప్రారంభం కానుంది.

**ఆధునిక సదుపాయాలు** సిరిసిల్ల పట్టణం పెద్దూరులో 'వర్కర్ టూ ఓనర్' పథకానికి 83 ఎకరాల్లో టీజీఐఐసీ 42 వీవింగ్, నాలుగు వార్పిన్ షెడ్లను నిర్మించింది. కాగా ప్రభుత్వం రూ.386.88 కోట్లతో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రెండేళ్ల క్రితం పనులు పూర్తయినా చేనేత, జౌళిశాఖ స్వాధీనం చేసుకోవడంలో జాప్యం జరుగుతోంది.రెండు వేల మంది కార్మికులను యజమానులుగా చేయడం ఈ పథకం ఉద్దేశం. తొలివిడత వెయ్యిమందిని ఎంపిక చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో కార్మికుడికి రూ.16.52 లక్షల విలువైన ఆధునిక ర్యాపియర్ మరమగ్గాలను అందించనున్నారు. వీటిపై చేతి రుమాలు మొదలు పట్టు వస్త్రాల వరకు ఉత్పత్తి చేసేలా ఆధునిక సదుపాయాలు అమర్చి ఉంటాయి.వీటి కొనుగోలుకు ప్రభుత్వం మరమగ్గాలు తయారు చేసే కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోంది. టెండర్ల ద్వారా కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయనున్నారు.

## ఎన్టీపీసీ రెండో దశ పనులకు అడుగులు

ఖని : ఎట్టకేలకు తెలంగాణ ఎన్టీపీసీ రెండో దశ పనులకు అడుగు పడుతోంది. మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించగా రెండో దశ పనులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదరకపోవడంతో రెండో దశలో చేపట్టాల్సిన 2400 మెగావాట్ల మూడు యూనిట్ల ఏర్పాటుపై సందిగ్ధం నెలకొంది. చివరికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో రెండో దశ పనులకు ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈ మేరకు బోర్డు ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణంపై మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే రెండు దఫాలుగా వాయిదా పడిన ప్రజాభిప్రాయ సేకరణను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు నిర్మించిన మొదటి దశ ప్రాంతంలోనే రెండో దశలో నిర్మించే 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లను నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి పరిసర



గ్రామాలు, రామగుండం ప్రాంత ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేశారు.

**పూర్తిస్థాయిలో అందుబాటులోకి..**

రాష్ట్ర విభజన చట్టంలో రూపొందించిన విధంగా తెలంగాణకు ఎన్టీపీసీ ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అందులో భాగంగానే మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు నిర్మించి ఉత్పత్తిని ప్రారంభించారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తును తెలంగాణ గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. కొత్తగా మరో 2400 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను కూడా నిర్మించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతోంది. ఏటా 11.7 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేసే విధంగా సింగరేణితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. నిర్మాణం మొదలు పెట్టిన తర్వాత నాలుగేళ్లలో 2400 మెగావాట్ల మూడు యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. మొదటి దశలో చేపట్టిన 1600 మెగావాట్ల రెండు యూనిట్లు గత ఏడాది నుంచి అందుబాటులోకి వచ్చాయి. 2016లో మొదటి దశ విద్యుత్తు కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. 2023, 2024లో రెండు యూనిట్ల పనులు పూర్తిగా వాణిజ్య ఉత్పత్తిలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం రెండో దశలో చేపట్టే 2400 మెగావాట్ల మూడు యూనిట్లను 2030 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఎన్టీపీసీ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

**పర్యావరణవేత్తల ఆందోళన**


రామగుండంలో నిర్మించనున్న రెండో దశ విద్యుత్తు కేంద్రాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన స్థానికంగా వ్యక్తమవుతోంది. పారిశ్రామిక ప్రాంతంలో గాలి నాణ్యత దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు. సల్ఫర్ డయాక్సైడ్ గాలిలో కలిసి ప్రాణవాయువు ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 4,200 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలున్న రామగుండంలో మరో 2400 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు నెలకొల్పడం ద్వారా పూర్తి ఉత్పత్తి 6,600 మెగావాట్లకు చేరుకుంటుంది. దీనికోసం రోజుకు సుమారు 80 వేల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుందని, దీని వల్ల సల్ఫర్‌డయాక్సైడ్ ఉద్గారాలు భారీగా వెలువడుతాయని స్థానికులు చెబుతున్నారు. వీటితో పాటు పరిసర ప్రాంతంలో ఆర్‌ఎఫ్‌సీఎల్, రామగుండం బి–థర్మల్ కేంద్రం, కేశోరాం సిమెంటు కార్మాగారాలు ఉన్నాయని .. వీటి నుంచి సైతం కాలుష్య కారకాలు వెలువడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధి అవకాశాలపై పరిసర గ్రామాల ప్రజల నిరసన**

ఎన్టీపీసీ ప్రాజెక్టు కోసం భూములు సేకరించిన యాజమాన్యం పరిసర గ్రామాల యువతకు ఉపాధిని విస్మరించిందన్న ఆరోపణలున్నాయి. ప్లాంటు నిర్మాణం కోసం ఎన్టీపీసీ యాజమాన్యం చుట్టు పక్కల గ్రామాలైన లక్ష్మీపురం, ఎల్కలపల్లి, కుందనపల్లి, రాజాపూర్, రాణాపూర్, మొగల్‌పహాడ్, రామగుండం ప్రాంతాల నుంచి గతంలో భూములు సేకరించింది. ఈ ప్రాంతాలకు చెందిన వారికి ఉపాధి కల్పించకపోవడంతో పాటు కనీసం ఆయా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు సామాజిక బాధ్యతను కూడా సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

## సింహభాగం.. సాగుకు యోగ్యమే!

కరీంనగర్ : జిల్లాలో సింహభాగం సారవంతమైన సాగు భూమి విస్తీర్ణమే ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సర్వే జరిపారు. అనంతరం గ్రామసభల ద్వారా రైతుల అభిప్రాయాలు తీసుకొని, జిల్లాలో సాగుకు యోగ్యమైన



భూవివరాలను వెల్లడించారు.

**డివిజన్ల వారీగా వివరాలు..**

జిల్లాలో నాలుగు వ్యవసాయ డివిజన్లు, 207 రెవెన్యూ గ్రామాలున్నాయి. డివిజన్ల వారీగా కరీంనగర్‌లో అత్యధికంగా 1830, మానకొండూర్‌లో 1568, హుజూరాబాద్‌లో 994, చొప్పదండిలో 962 ఎకరాలను సాగుకు యోగ్యం కానివిగా గుర్తించారు. ఈ భూమికి భవిష్యత్తులో రైతుభరోసా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఆర్థిక వెసులుబాటు మేరకు..**


సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో సర్వే అనంతరం సాగు యోగ్యమైన భూవివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటును బట్టి విడతల వారీగా రైతు భరోసా ఖాతాల్లో జమ అవుతాయి.
భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి

చురకలు



# ధరణి వినతుల పరిష్కారంపై దృష్టి..!

ఎనిమిదేళ్లుగా భూ సమస్యలతో సతమతమవుతున్న రైతుల ఇబ్బందులు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపడుతోంది. కొత్తగా భూభారతి చట్టం(ఆర్వోఆర్)–24కు రూపకల్పన చేసింది. గతంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల అధికార, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గతంలో ధరణి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు వెలుగు చూశాయి. కొత్త చట్టం రూపకల్పన నేపథ్యంలో రైతులు తమ పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయనే ఉద్దేశంతో ఇటీవల అర్జీలు సమర్పించడం లేదు. గతంలో రోజుకు 100 వరకు దరఖాస్తులు వస్తే కొత్త చట్టం రూపకల్పన ప్రకటన తర్వాత పదుల సంఖ్యలోనే వస్తున్నాయి. కలెక్టర్ నుంచి తహసీల్దార్ వరకు ప్రత్యేక దృష్టి ధరణి పోర్టల్‌లో తహసీల్దార్, ఆర్డీవో, అదనపు పాలనాధికారి(రెవెన్యూ), కలెక్టర్‌లకు లాగిన్ సౌకర్యం కల్పించి సమస్యలు పరిష్కరించే బాధ్యతలు



అప్పగించారు. మరో వారంలో ధరణి పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలనే లక్ష్యంతో రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. డిజిటల్ పట్టాదారు పాస్‌పుస్తకాల్లో పేరు మార్పిడితో పాటు తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో సమస్యలను ఒకట్రెండు రోజుల్లోనే పరిష్కరిస్తున్నారు. గతంలో వీటికి నెల నుంచి రెండు నెలల సమయం పట్టేది. ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని మూడు జిల్లాల పాలనాధికారులు చెబుతున్నారు. గురువారం నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,064 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకరోజులో మొత్తం 130 దరఖాస్తులు రాగా ఇందులో 96 దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# పల్లెల్లో పనుల జాతర

చేగుంట: రైతులకు సంబంధించిన పనులు చేపట్టేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సన్నద్ధమైంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేయనున్నారు. 'పనుల జాతర' పేరిట ప్రణాళిక సిద్ధం చేశారు. మార్చి చివరిలోగా వీటిని పూర్తిచేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందుకు జిల్లాకు రూ.50 కోట్లు మంజూరు చేశారు. వీటిలో రైతులకు జల సంరక్షణ పనులతో పాటు కర్షకుల పొలాలకు వెళ్లేందుకు ఉన్న కాలిబాటలను బాగు చేసేందుకు నిర్ణయించారు.

**అన్ని మండలాల్లో..**జిల్లాలోని 21 మండలాల్లో 493 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలతో పాటు దుబ్బాక, గజ్వేల్, నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాలకు చెందిన పలు మండలాలు ఉన్నాయి. అన్నింటికీ జాతీయ గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఎట్టి పరిస్థితుల్లో మార్చి 31లోగా పనులు పూర్తి అయ్యేలా చేపడుతున్నారు.

**రైతులకు ఎంతో మేలు - శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో**

పనుల జాతర వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. మూడు నెలల్లో పూర్తిచేసి వినియోగించే విధంగా చూస్తున్నాం. ఇందుకోసం గ్రామాల్లో పనులు కూడా గుర్తించాం. పెద్ద ఎత్తున నిధులు ఉండటంతో పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగే ఆస్కారం ఉంది.

**ఉపయోగపడే పనులు**

రైతులకు ఉపయోగపడే పనులు ఇందులో చేపడుతున్నారు. ముఖ్యంగా పశువుల షెడ్లు, కోళ్ల ఫారాలు, వర్మీ కంపోస్టు తయారీ పనులు, నాడెపు కంపోస్టు పిట్, అజోల తయారీ యూనిట్, ఇంకుడు గుంతలు, జలనిధి ద్వారా చెక్‌డ్యాంల నిర్మాణం, వ్యవసాయ బావులు, వర్షం నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనాలు, సీసీదారులు, గతంలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన రోడ్లపై మట్టిని వేయటం వంటివి చేపట్టనున్నారు. అంతేకాకుండా ప్రత్యేకంగా పొలాల వద్దకు ఉన్న కాలిబాటలను అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల రైతులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. చేపట్టే ప్రతి పని కూడా పూర్తిగా రైతులకు ఉపయోగపడే విధంగా ఉండటంవల్ల వారు సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో పనులు గుర్తించే విధంగా అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. నిధులు పుష్కలంగా ఉండటంతో త్వరితగతిన పూర్తిచేసి మేలు చేసే విధంగా చూస్తున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే ఒక్కో పనిని పూర్తిచేశారు.

# నవీన విద్యకు నవోదయ దారి

కాగజ్‌నగర్: మేటి సంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో చదవాలనుందా.. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదా.. అయితే ఆరు నుంచి ప్లస్ టూ వరకు ఉచితంగా చదువుకునే అవకాశం జవహర్ నవోదయ విద్యాలయాలు కల్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు కలిపి కాగజ్‌నగర్‌లో నవోదయ విద్యాలయం ఉంది. 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో 80 సీట్లలో చేరేందుకు ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 24 పరీక్ష కేంద్రాల్లో 5,191 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరగనుంది.

**ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు**

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో నవోదయ అధికారిక వెబ్‌సైట్‌లో పొందవచ్చు. నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీ నమోదు చేసి హాల్‌టికెట్ పొందవచ్చు. పరీక్షకు సంబంధించిన మెటీరియల్, పాత ప్రశ్నపత్రాలు సైతం అందుబాటులో ఉంటాయి.

చదవాల్సినవి.. ఆబ్జెక్టివ్ విధానంలో రెండు గంటల పాటు పరీక్ష ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, లాంగ్వేజ్ విభాగాల నుంచి 100 మార్కులకు గానూ 80 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ టెస్ట్‌లో 40 ప్రశ్నలు అడుగుతారు. వీటికి 50 మార్కులు. అర్థమెటిక్ టెస్ట్, లాంగ్వేజ్ టెస్టుల్లో ఒక్కో దానికి 20 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో విభాగానికి 25 మార్కులు కేటాయించారు. మెంటల్ ఎబిలిటీ టెస్టుకు గంట సమయం. అర్థమెటిక్, లాంగ్వేజ్ టెస్టుకు అరగంట చొప్పున సమయం కేటాయించారు.

చదువుతోపాటు ఇతర అంశాల్లోనూ విద్యాలయంలో చదువుతోపాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగా, కరాటే వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవాటు పడేలా స్కౌట్స్, ఎన్‌సీసీ నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది

# అభయం.. లక్ష్యం దిశగా పయనం



వికారాబాద్ : ఇంటర్ పరీక్షల సమయం దగ్గర పడుతోంది. కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. పరీక్షలంటే విద్యార్థుల్లో ఒక రకమైన భయం నెలకొంటుంది. దాన్ని అధిగమించాలంటే ప్రణాళికతో ముందుకు సాగాలి. మానసిక, శారీరకంగా దృఢంగా ఉండాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు 81 ఉన్నాయి. వాటిలో 13,200 మంది విద్యార్థులు చదువుతున్నారు.సీనియర్ అధ్యాపకులు, మానసిక నిపుణుల సూచనలు..: పాఠాలు ఎప్పటికప్పుడు చదివితే ఆందోళన అవసరం లేదు. ఏడాదంతా సరదాగా గడిపి పరీక్షల వేళ తొందరపడి అన్ని పాఠ్యాంశాలు చదివితే ఉపయోగం ఉండదు. సమయపాలన, ప్రణాళిక చాలా అవసరం. ఇప్పట్నుంచే పాఠ్యాంశాల్లోని ముఖ్య విషయాలు, ప్రశ్నల సరళి, మార్కుల కేటాయింపుపై అవగాహన పెంచుకోవాలి. గత ప్రశ్నాపత్రాలను సాధన చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక వేసుకోవాలి. రోజుకు ఎన్ని పాఠ్యాంశాలు చదవాలి.. వారంలో ఎన్నింటిని పూర్తి చేయలన్నది నిర్దేశించుకోవాలి. దైనందిన అవసరాలకు సమయం కుదించి ఏకాగ్రతతో చదువుకోవాలి. పాఠ్యాంశాలను చదివేందుకు పునశ్చరణకు సమయాలను వేర్వేరుగా నిర్ధారించుకోవాలి. సందేహాలను అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకోవాలి. ఏకధాటిగా చదవకుండా ప్రతి గంటకు 5–10 నిమిషాలు విరామం తీసుకోవాలి. పరీక్షల వేళ విద్యార్థులకు సమతుల ఆహారం అవసరం. ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ ఉండే ఆహారం తీసుకోవాలి. తగినంత నీరు తాగాలి. ఆహారంలో పండ్లు భాగం చేసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యే వరకు మాంసాహారం, కొవ్వు పదార్థాలు, మసాలాలు, జంక్‌ఫుడ్, బయటి ఆహారానికి దూరంగా ఉండడం మేలు. నిత్యం కనీసం 6– 8 గంటల నిద్ర అవసరం. ఉదయం, సాయంత్రం కాసేపు ధ్యానం, ప్రాణాయామం సాధన చేయాలి. చరవాణుల వినియోగాన్ని తగ్గించాలి. భావోద్వేగాలను కలిగించే సీరియళ్లు, సినిమాలు చూడొద్దు. విందులు, వేడుకలకు దూరంగా ఉండడం మంచిది.

కళాశాలల సమాచారం..

జిల్లాలో జూనియర్ కళాశాలలు: 81

ప్రభుత్వ: 13

ప్రైవేటు: 23

యాజమాన్యం: 45

తల్లిదండ్రుల పాత్ర ముఖ్యం..

పరీక్షల వేళ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. పరీక్షల వేళ విద్యార్థుల్లో ఒత్తిడి సహజం. దాన్ని జయించాలి. చదువుకునే గది ప్రశాంతంగా ఉండాలి. ధైర్యం కోల్పోకుండా నమ్మకంతో ఉండాలి.డా.ఎం.సాయిప్రశాంతి, మానసిక నిపుణురాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వికారాబాద్.

# మెలకువలు నేర్పించి.. సాగు విస్తీర్ణం పెంచి



ధారూర్: వనరులను సద్వినియోగం చేసుకొని మంచి దిగుబడులు సాదించేలా కృషి చేస్తోంది భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ. 2017లో ఫార్మర్ ఫస్ట్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గట్టెపల్లి, గురుదోట్ల, రాంపూర్, అంపల్లిని దత్తత తీసుకున్నారు. అన్ని గ్రామాల్లో కలిపి 787 మంది రైతులను గుర్తించి సంఘాలుగా ఏర్పాటు చేశారు.


**అన్నదాతలకు అవగాహన..**

వ్యవసాయశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రైతులకు వివిధ రకాల పంటల సాగుపై అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, నేల స్వభావాన్నిబట్టి సకాలంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవడంతో పెట్టుబడులు తక్కువ కావడమే కాకుండా మంచి దిగుబడులు సాధించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించారు. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రారంభంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించారు. అందిపుచ్చుకున్న రైతులు గతంలో కంటే ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగ, కంది, పెసర, మినుము వంటి పంటలు సాగు చేస్తున్నారు. కొందరు వారి పొలంలో పండించిన పంటనుంచే నాణ్యమైన విత్తనాలను సేకరించి సాగుచేస్తున్నారు. మరి కొందరు విపణుల్లో లభించే మేలైన విత్తనాలను తెచ్చుకొని పండిస్తున్నారు. సకాలంలో ఎరువులు, సస్యరక్షణ చర్యలు, క్రిమి సంహారక మందులను పిచికారీ చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

**ప్రస్తుతం సాగు ఇలా..**

రాంపూర్‌లో వానాకాలంలో 250 ఎకరాల్లో వరి, 270 ఎకరాల్లో పెసర, 100 ఎకరాల్లో కంది పంట, యాసంగిలో 300 ఎకరాల్లో వేరుశనగ పంట సాగుచేశారు. గట్టెపల్లిలో 500 ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో పెసర, 50 ఎకరాల్లో కంది, 120 ఎకరాల్లో వేరుశనగ వేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. అంపల్లి, గురుదోట్లలో 550 ఎకరాల్లో వరి, 110 ఎకరాల్లో పెసర, 100 ఎకరాల్లో కంది, 120 ఎకరాల్లో వేరుశనగ సాగైనట్లు అధికారులు తెలిపారు.

# పాఠ్యపుస్తకం.. కంప్యూటర్ శిక్షణ



హైదరాబాద్: కంప్యూటర్లు.. ల్యాప్‌టాప్‌లు... డిజిటల్ తెరలపై పాఠాలు చెబుతున్న ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. 'కోడింగ్' నేర్పిస్తున్నారు. కళాశాల స్థాయిలో నేర్చుకునే కోడింగ్‌ను ఐదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నేర్పుతున్నారు. కామిక్ సిరీస్‌లు, కార్టూన్ నెట్‌వర్క్‌లలోని పాత్రలను వారితోనే తయారు చేయిస్తున్నారు. ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు సహకారం అందిస్తున్నాయి. ఆయా సంస్థలు ఎంపిక చేసిన పాఠశాలలకు డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్‌లను ఉచితంగా ఇస్తుండగా... ఐటీ సంస్థల ఉద్యోగులు, యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చి విద్యార్థులకు ఉచితంగా పాఠాలు చెబుతున్నారు..

**సులువుగా అర్థం చేసుకునేలా...**

డెస్క్‌టాప్ కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఐప్యాడ్‌లను సులువుగా వినియోగించేలా... అందులోని సాంకేతిక పదాలు, భాషను అర్థం చేసుకునేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రోగ్రామ్‌లు ఎలా రూపొందించాలో ప్రయోగాత్మంగా వివరిస్తున్నారు. సర్కారు బడుల విద్యార్థుల ఇళ్లల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు ఉండవు. అందుకే విద్యార్థులకు చరవాణితో గేమ్‌లు రూపొందిస్తున్నారు. కొద్దిరోజులు వారిని గేమ్స్ ఆడించాక... మీరే సొంతంగా గేమ్స్ రూపొందించండి అంటూ విద్యార్థులకు చెబుతున్నారు. దీంతో చాలామంది విద్యార్థులు తమకు నచ్చిన గేమ్‌ను తయారు చేసేందుకు కోడింగ్ ఉపయోగిస్తున్నారు. తొంభైశాతం మంది విద్యార్థులు కోడింగ్‌ను ఆడుతూపాడుతూ నేర్చుకుంటున్నారని కూకట్‌పల్లి, మహబూబియా ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతోపాటు కంప్యూటర్లు లేని పాఠశాలల్లో 'సింక్రోనీ' సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన కిట్ ద్వారా చార్టులతోనే కోడింగ్ నేర్పిస్తోంది.

సొంతంగా పేర్లు..కంప్యూటర్ గేమ్‌లో పాత్రధారులకు విద్యార్థులు సొంతంగా పేర్లు పెడుతున్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లభాషలకు సరిపోయేలా పేర్లను తయారు చేస్తున్నారు. శిక్షణతో పాటు వీరికి సమాచార నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. కోడింగ్ నేర్చుకుంటున్నకొద్దీ విద్యార్థుల్లో వారికి తెలియకుండానే తార్కికజ్ఞానం పెరుగుతుంది. ఆటలు రూపొందించేటప్పుడు వారి ఆలోచన పరిధి విస్తృతమవుతోంది.

## పర్యవేక్షణ లేమి.. రేషన్ పక్కదారి

హైదరాబాద్: నగరంలో 6.39 లక్షల కార్డు దారులకు నిత్యావసర సరకులను నెల నెలా అందించే నగర పౌర సరఫరాల శాఖలో కీలక పోస్టులు భర్తీ చేయకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. నగరంలో 66 డీలర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రేషనింగ్ అధికారి (సీఆర్ఓ) పరిధిలో 18 మంది డిప్యూటీ తహసీల్దార్‌ల పోస్టులు ఉండగా ప్రస్తుతం తొమ్మిది మంది మాత్రమే విధుల్లో ఉన్నారు.60 మంది సీనియర్ చెకింగ్ ఇన్స్‌పెక్టర్లు ఉండాల్సి ఉండగా.. 28 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.జూనియర్ ఎంక్వయిరీ ఇన్స్‌పెక్టర్లు 41 మంది ఉండాల్సి ఉండగా.. 22 మంది మాత్రమే ఉన్నారు.కీలకమైన పోస్టులతో పాటు పరిపాలనా పరంగా విధులు నిర్వహించే పలు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. సీఆర్వో పరిధిలో గతంలో ఎప్పుడో నిర్ణయించిన ఉద్యోగుల సంఖ్యలోనూ భారీగా ఖాళీలు ఉన్నాయి.

# విలీన గ్రామాల ఆశలు ఆవిరి

గజ్వేల్ : గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటి పరిధిలోని విలీన గ్రామాల్లో ఫేజ్–2 కింద చేపట్టాల్సిన యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు ఇప్పట్లో అయ్యేలా కనిపించటం లేదు. పాలకమండలి ప్రతిపాదించిన దాదాపు రూ.49 కోట్ల నిధులకు సబంధించి ఇప్పటిదాకా ఎలాంటి పురోగతి లేదు. ఈనెల 26 తో ప్రస్తుత మున్సిపాలిటీ పాలక మండలి పదవీకాలం ముగిసిపోతుండటంతో ఇక నిధుల కృషి , పనుల విషయం మరుగునపడినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం 40 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మించాలని ప్రతిపాదించారు. పనులు చేపట్ట లేదు.

2020లో పనుల ప్రారంభం

దోమలు, మురుగు వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటిలో ఫేజ్–1 కింద 138 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయటంతో పాటు నాలుగు చోట్ల మురుగునీటి శుద్ధిప్లాంట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.99 కోట్ల అంచనా వ్యయంతో 2020లో పనులు ప్రారంభించారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పట్టణాల పరిధిలో పనులు చేపట్టారు. కరోనా కారణంగా పనుల్లో జాప్యం నెలకొని పైపులైన్ల ఏర్పాటు పూర్తికాకపోవటం, చాలా చోట్ల ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వకపోటంతో సమస్యకు కారణమైంది.



**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..- రాజమౌళి, మున్సిపాలిటీ ఛైర్మన్**

బల్దియా బాగు కోసం గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించటంతో అభివృద్ధి చేశాం. మిగిలిన పనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. నిధులు మంజూరు అవుతాయని ఆశించాం. మరో రూ.50 కోట్లు కేటాయిస్తే పూర్తిస్థాయిలో యూజీడీ పనులు పూర్తవనున్నాయి.

**మురుగు తొలగించే యంత్రాలు కరవు**

చేసేదేమీలేక కొందరు ఇంటి యజమానులు సొంత ఖర్చుతో కనెక్షన్లు ఇచ్చుకుంటున్నారు. పట్టణంలో వైద్యుడు కుమారస్వామి రూ.10 వేలకుపైగా ఖర్చు చేసుకుని ఇంటికి యూజీడీ కనెక్షన్ ఇప్పించుకోవాల్సి వచ్చింది. కొన్ని చోట్ల పైపులైన్ల నిర్మాణం ఎత్తుపల్లాల్లో ఉందని చెబుతున్నారు. విలీన గ్రామాలైన ముట్రాజ్‌పల్లి, గుండన్నపల్లి, క్యాసారం తదితర చోట్ల ఇంకా పనులు చేపట్టలేదు. మురుగు నిలిచినపుడు తొలగించే యంత్రాలు సైతం లేవు. మున్సిపాలిటీకి అన్నిరకాల పన్నులు చెల్లిస్తున్నా.. కాలనీల్లో సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.గజ్వేల్–ప్రజ్ఞాపూర్ బల్దియాలో జనాభా – 55000 నివాసాలు – 13500

అవసరమయ్యే యూజీడీ లైను – 180 కి.మీ.

చేపట్టింది – 130 కి.మీ.

# అతివలకు ఆర్థిక వెలుగులు

సంగారెడ్డి : విద్యుత్తు వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ఇలా వినియోగిస్తూ పోతే భవిష్యత్తు తరాలకు మిగిలేది అంధకారమే. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా సౌర విద్యుత్తు ఉత్పత్తి దిశగా సాగుతోంది. 'సౌర' యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. తాజాగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద పొదుపు సంఘాల సభ్యులకు సౌర యూనిట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**సాగుకు యోగ్యం కాని భూముల్లో..**

గ్రామాల్లో సాగుకు యోగ్యంకాని భూములు జిల్లాలో వందలాది ఎకరాలు ఉంటాయి. అలాంటి స్థలాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ భూములు ఖాళీగా ఉంటే అక్కడా యూనిట్లు నెలకొల్పాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ భూమి రక్షించినట్లు అవుతుంది. ముందుకు వచ్చే మహిళా సంఘాల సభ్యులకు పీఎం కుసుమ్ యోజన కింద యూనిట్ నెలకొల్పేందుకు తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీ సదుపాయం ఉంటుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఎంపిక చేసిన మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించనున్నారు. స్త్రీనిధి, సెర్ప్, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. గ్రామైక్య సంఘం, మండల, జిల్లా సమాఖ్యల్లో నిధులు ఉంటే వాటి నుంచి కూడా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పిస్తారు. ఒక మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు రూ.4 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇందులో 10శాతం వాటాధనం పొదుపు సంఘం సభ్యులు చెల్లించాల్సి ఉంటుంది.

**విద్యుత్తు విక్రయంతో ఆదాయం**

సౌర విద్యుత్తు ప్లాంటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును సమీపంలోని ఉప కేంద్రానికి అనుసంధానం చేస్తారు. మెగావాట్ విద్యుత్తు యూనిట్ ఏర్పాటుతో నెలకు రూ.2.16లక్షల వరకు ఆదాయం సంపాదించేందుకు వీలుంటుంది. 25 సంవత్సరాల వరకు ఇది ఆదాయ వనరుగా ఉంటుంది. సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు మహిళా సంఘాలు ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు సౌర విద్యుత్తు ప్లాంట్లపై కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామని డీఆర్‌డీవో జంగారెడ్డి తెలిపారు.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695

మహిళా సంఘాలు: 18,213

వాటిలో సభ్యులు: 1.90లక్షలు

మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు అవసరమయ్యే భూమి: 4 ఎకరాలు

పెట్టుబడి వ్యయం: రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు

ఒక యూనిట్ ద్వారా నిత్యం విద్యుత్తు ఉత్పత్తి: 4వేల యూనిట్లు

నెలకు వచ్చే ఆదాయం: రూ.2.16 లక్షలు

చురకలు



## అభిమాన సంఘాల 'నీడ'

అనకాపల్లి : తమ అభిమాన నాయకుడి సినిమా విడుదల సమయంలో తోరణాలు కట్టి.. ఫ్లెక్సీలు నెలకొల్పి పాలాభిషేకాలు చేయడమే కాదు.. సేవా కార్యక్రమాల్లోనూ సంఘాలు ముందుంటున్నాయి. అనకాపల్లి జిల్లా కేంద్రంలో వివిధ కూడళ్లలో బస్ షెల్టర్లు నిర్మించి ప్రయాణికులకు నీడ కల్పిస్తున్నాయి. పట్టణానికి వివిధ పనులపై రోజూ వేలాది మంది వస్తుంటారు. వీరు తమ పనులు ముగించుకుని గమ్యస్థానాలకు బస్సులు, ఆటోల్లో వెళ్తుంటారు. వీరికోసం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో బస్ షెల్టర్లను సినీ అభిమాన సంఘాల సభ్యులు ఏర్పాటు చేశారు. చోడవరం రహదారిలో బాలకృష్ణ, ఎన్టీఆర్ అభిమానులు నందమూరి తారక రామారావు, బసవతారకం పేరుతో షెల్టర్ నిర్మించారు. ఇటీవల దీనిపై ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారు. గవరపాలెంలో ప్రధాన రహదారి వద్ద నందమూరి తారకరామ పేరుతో బాలకృష్ణ అభిమానులు షెల్టర్ నిర్మించారు. విశాఖ, సబ్బవరం,



పెందుర్తి వెళ్లడానికి బాలకృష్ణ బస్‌షెల్టర్ మీదుగా ప్రయాణిస్తారు. ఈ సెంటర్‌కు బాలకృష్ణ బస్‌షెల్టర్ పేరు కూడా వచ్చింది. పూడిమడక రహదారిలో చిరంజీవి అభిమానుల సంఘం చిరునీడ పేరుతో బస్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు సేదతీరేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి.

**ప్రభుత్వ పరంగా...**

నిత్యం ఎంతో రద్దీగా ఉండే నెహ్రూచౌక్ సమీపాన చంద్రన్న నీడ పేరుతో ప్రభుత్వ పరంగా షెల్టర్ ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ దీనికి రూ.15 లక్షలు మంజురు చేశారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే జాతీయ రహదారిలో నూకాలమ్మ ఆర్చి వద్ద రూ.5 లక్షలతో మరో షెల్టరు నిర్మించారు. దాదాపు పూర్తైన దశలో ప్రభుత్వం మారిపోయింది. వైకాపా ప్రభుత్వ కనీసం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం దీన్ని పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు.

## గాజువాక వాసుల నిరీక్షణ ఫలించిన వేళ..!

అమరావతి : సుమారు 25 ఏళ్ల నుంచి గాజువాక, మధురవాడ, అరిలోవ, మాధవధార, ఇతర చోట్ల కలిపి వేలాది మంది అభ్యంతంలేని ప్రభుత్వ భూములు ఆక్రమించి నివాసం ఉంటున్నారు. అక్కడి ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు వీరికి న్యాయం చేయాలని గత తెదేపా ప్రభుత్వం చొరవ చూపింది. 301జీఓ ద్వారా 12,452 బాధితులకు లబ్ధి చేకూర్చేలా 2016లో ఉత్తర్వులిచ్చింది. వీరిలో 7,602 మంది గతంలో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా 6,349 మంది



సంబంధిత రుసుమూ చెల్లించారు. వీరిలో 5,198 మందికి కన్వేయన్స్ డీడ్ ఇచ్చారు. అయితే గత వైకాపా ప్రభుత్వం వారికి అనుభవించేందుకు తప్ప...క్రయవిక్రయాలకు అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అతి త్వరలోనే ఉత్తర్వులు ఇవ్వనుంది.

**ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం..**

1 నుంచి 100 గజాల వరకు రిజిస్ట్రేషన్ కింద రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. అంతకంటే ఎక్కువ గజాలు కలిగిన వారు సాధారణ స్థాయిలో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి.

ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు మీసేవా/గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. 400 చదరపు గజాలలోపు క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను ఆర్డీఓ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ, 401 నుంచి 1,000 గజాలలోపు ఉన్న దరఖాస్తులను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ పరిశీలన చేస్తుంది.

## నిధులు భూగర్భంలో కలిశాయ్

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణంలో భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ కోసం 2008లో అప్పటి ప్రభుత్వం రూ.44.07 కోట్లు మంజూరు చేసింది. పట్టణంలో పైపులైన్లు వేయడం.. మ్యాన్‌హోల్స్ తదితర పనులు రెండేళ్లలో పూర్తి చేయాలన్నది లక్ష్యం. 2009లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కొంతమేర చేసి మధ్యలో వదిలేశారు. 2014లో తెదేపా ప్రభుత్వం రాగా కేటాయించిన నిధుల్లో మరో రూ.6 కోట్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో దాదాపు 95 శాతం పనులు పూర్తి చేశారు. అనంతరం 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులను పట్టించుకోలేదు. ఐదేళ్లలో పైసా కూడా విదల్చలేదు.

**అధ్వానంగా చేసి..**పట్టణ పరిధిలో ప్రతిరోజూ 50 లక్షల మిల్లీలీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుంది. ఈ నేపథ్యంలో భూగర్భ మురుగు పారుదల వ్యవస్థలో భాగంగా పట్టణంలోని సోగనూరు రోడ్డులో 48 ఎకరాల్లో భారీగా ట్యాంకు నిర్మించారు. కట్ట చుట్టూ బండ పరుపు పేర్చారు. పనులు అధ్వానంగా చేయడం.. అధికారులు పట్టించుకోకపోవడంతో రాతి పరుపు పూర్తిగా కదిలిపోయింది. ఐదు ట్యాంకుల చుట్టూ ఇదే పరిస్థితి ఉంది. మ్యాన్‌హోల్స్ వద్ద పగుళ్లిచ్చాయి. వీధుల్లో పైపులైన్లు ఏర్పాటు సమయంలో ఇసుక సక్రమంగా వేయకపోవడంతో కొన్నిచోట్ల పైపులు కదిలిపోయాయి.నివేదికలు ఇచ్చాం : గంగిరెడ్డి, కమిషనర్, ఎమ్మిగనూరుఇంటింటికి మ్యాన్‌హోల్స్ వేయాల్సి ఉంది. ఇవి పెండింగ్‌లో ఉన్నాయి. వీటి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. రూ.12 కోట్లు అవసరమని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరైతే పనులు పూర్తి చేస్తాం. పైపులైను పొడవు : 134 కి.మీ. పూర్తి చేసింది : 129 కి.మీ. నిధులు : రూ.44.07 కోట్లుఇప్పటి వరకు ఖర్చు : రూ.39.04 కోట్లు గడువు పెంచింది: 6 సార్లు

# ఉచితమనే ఊసే లేదు!



విశాఖపట్నం : మెరుగైన వైద్యం అందుతుందనే ఆశతో వెళ్తున్న రోగులను కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు దోచుకుంటున్నాయి. శస్త్రచికిత్స చేయించుకుంటే వివిధ రుసుముల పేరిట జేబులు గుల్ల చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఆరిలోవ హెల్త్‌సిటీలోని కొన్ని ఆసుపత్రుల్లో పరిస్థితి మరీ అధ్వానం. ఏపీఐఐసీ తక్కువ ధరకే స్థలాలు కేటాయించినా.. నిబంధనలు పాటించట్లేదు. అనవసర ఖర్చుల భారం మోపుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని చెల్లించాల్సి వస్తుందనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.

**2006లో ఏర్పాటు..** ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలందించేందుకు 2006లో చినగదిలిలో హెల్త్‌సిటీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) దాదాపు 100 ఎకరాలు కేటాయించింది. ప్రైవేటు ఆసుపత్రులు నెలకొల్పడానికి మార్కెట్ ధర కంటే తక్కువకే స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఎకరాకు రూ.2.4 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు తీసుకున్నారు. ప్రస్తుతం అక్కడ 18 ప్రైవేటు ఆసుపత్రులుండగా.. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రోగులు వస్తుంటారు.

**48 గంటలకు రూ.32 వేలు**

'ఆరిలోవలోని ఓ ఆసుపత్రిలో శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న మా కుమార్తెకు చికిత్స చేయించాం. 48 గంటలకు రూ.32 వేల బిల్లు వేశారు. అందులో అధిక శాతం ఔషధాలు, ఇంజెక్షన్లే. ఆరోగ్య బీమా పోగా రూ.12 వేలు తీసుకున్నారు. అక్కడ భోజనం తీసుకోకపోయినా ఫుడ్ ఛార్జీలు వేశార'ని ఇటీవల ఓ వ్యక్తి ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

**వారిని పట్టించుకునేవారేరీ?**

హెల్త్‌సిటీలోని ఆసుపత్రులకు ఒడిశా నుంచి నిత్యం వందల సంఖ్యలో రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. వారంతా రోడ్లపై, చెట్ల నీడలో వేచి ఉండాలే తప్ప వారి గురించి ఎవరూ పట్టించుకోరు. ఆసుపత్రుల యజమానులందరూ కలసి ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) సహకారంతో మరికొంత స్థలం తీసుకుని షెడ్లు నిర్మించుకుంటే రోగులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు జరగట్లేదు.

ఆసుపత్రుల్లో పాటించాల్సిన నిబంధనలను స్థలం కేటాయించే సమయంలోనే ఏపీఐఐసీ వివరిస్తుంది.

ఆయా ఆసుపత్రులో మొత్తం ఓపీ సేవల్లో 10 శాతం పేద, దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజలకు ఉచితంగా సేవలందించాలి.

15 శాతం పడకలు ఉచితంగా పేదలకు చికిత్స అందించేందుకు కేటాయించాలి.

ప్రభుత్వ గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఉచిత చికిత్స అందించాలి. కొన్ని ఆసుపత్రుల్లో వీటిని పట్టించుకోకపోగా.. రోగుల నుంచి భారీగా బిల్లులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

# రూ.120 కోట్ల పన్ను హుష్‌కాకి!!



విశాఖపట్నం : మహా విశాఖ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికాధికారులు వీఎల్టీ (ఖాళీ స్థలాల పన్ను) లేకుండా ప్లాన్లు మంజూరు చేసి, భవనాలు నిర్మించడానికి సహకరిస్తున్న ఉదంతాలు ఉన్నాయి. తాజాగా నాలా పన్ను చెల్లించకుండానే ఓసీ (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) జారీ చేసిన లీలలు వెలుగు చూస్తున్నాయి. నాలా చెల్లించకుండా నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలు గాజువాక, పెందుర్తి, భీమిలి, చినగదిలి రూరల్ మండలాల పరిధిలో ఉన్నాయి. ఫలితంగా రూ.120 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. దీనిపై ప్రస్తుతం విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. విచిత్రమేమంటే అక్రమాలకు పాల్పడిన ప్రణాళికా, రెవెన్యూ అధికారులు కీలకమైన పోస్టింగ్‌లో ప్రస్తుతం కొనసాగుతున్నారు.

**మాజీ ఎంపీ ప్రాజెక్టులోనూ...:** కూర్మన్నపాలెంలో వైకాపా మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిర్మించిన ఎంవీవీ అండ్ ఎంకే హౌసింగ్ ప్రాజెక్టులోనూ పన్ను చెల్లించలేదు. సర్వే నెంబరు 58/3, 59, 52/5సి, 59/1బి, 60/1, 60/6 మొత్తం 9.50 ఎకరాల విస్తీర్ణంలో స్టిల్ట్, గ్రౌండ్ ప్లస్-9 భారీ అపార్టుమెంట్లు నిర్మించారు. ప్లాను కోసం 2018లో దరఖాస్తు చేశారు. అప్పటి కమిషనర్ హరినారాయణన్, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ఆర్ విద్యుల్లత, నగర ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ ప్లాను మంజూరు చేస్తూ, నాలా (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్స్ అసెస్‌మెంట్) పన్ను నిధులు (భూమి విలువలో 2 శాతం నిధులు) చెల్లించాలని షార్ట్ ఫాల్స్‌లో పేర్కొన్నారు. సుమారు రూ.5 కోట్లు నాలా పన్ను ప్రభుత్వానికి చెల్లించి, ఆ రసీదును ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు పైసా కూడా చెల్లించకుండానే ఆ ప్రాజెక్టు పూర్తి చేయడం, జీవీఎంసీ అధికారులు ఓసీ విడుదల చేయడం గమనార్హం. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, తెదేపా 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం కౌన్సిల్ సమావేశంలో మేయరు, గత కలెక్టర్ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. అధికారం అండతో ఎంవీవీ ఆయా ఫిర్యాదులను తొక్కిపట్టారు.

**మరికొన్నింటిలోనూ ఇదే తంతు:** అగనంపూడి సర్వే నెంబరు 101/1, 101/9, 101/10లో కావ్య ఎవెన్యూస్ 150 ఫ్లాట్స్ నిర్మాణం చేపట్టారు. ఆయా నిర్మాణాలకు నాలా చట్టం ప్రకారం నిధులు రూ.2 కోట్ల వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. నిర్మాణదారు పైసా చెల్లించకుండానే భవనాలు పూర్తి చేయగా, జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు ఓసీ (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) జారీ చేశారు. జీవీఎంసీ ఇచ్చిన ప్లాను ప్రకారం ఎలాంటి లోపాల్లేకుండా చేపట్టిన నిర్మాణాలకు జీవీఎంసీ ఓసీ మంజూరు చేస్తే, దానిని బట్టి జీవీఎంసీ రెవెన్యూ సిబ్బంది ఆస్తి పన్ను విధిస్తారు. ఓసీలో ఏవైనా లోపాలుంటే వాటిని బట్టి 10శాతం నుంచి 100 శాతం వరకు ప్రతిఏటా అదనంగా ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇవేవీ విధించకుండా పట్టణ ప్రణాళికాధికారులు సహకరించారు.

శ్రీరామ్ ప్రాపర్టీస్, ఎన్‌సీసీ, రేడియంట్ వంటి భారీ ప్రాజెక్టులతోపాటు, మాతృశ్రీ లే అవుట్లూ నాలా నిధులు చెల్లించలేదన్న విమర్శలున్నాయి. వైకాపా హయాంలో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి రావడంతోపాటు, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

# గ్రాసం లేక.. గ్రామం విడిచి..!

పాలసముద్రం : గొర్రెలకు మేత మేపేందుకు మందలతో పోషక కాపరులు జిల్లా దాటి సరిహద్దు తమిళనాడు ప్రాంతాలకు వెళ్తున్నారు. పాలసముద్రం ప్రాంతంలో జీవాలకు బాగా మేత దొరుకుతుందని పేరు. ప్రస్తుతం బాగా వర్షం కురిసి బావులు, చెరువు నిండటంతో సాగు బాగా పెరిగింది. దీంతోపాటు మండలంలోని కొండల్లో గొర్రెలను మేతకు వదులుదామని అనుకుంటే.. కొందరు కొండలను ఆక్రమించటం, మరికొందరు క్వారీలు, గ్రావెల్ పేరుతో కొండలను పిండి చేయటంతో మూగజీవాలకు మేత దొరక్క సమస్యలు మొదలయ్యాయి. పచ్చిక బయళ్లు మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో వారి సొంత ప్రాంతాల్లో మేతకు స్థలం లేక.. ఊరుగాని ఊరెళ్లి గొర్రెలను మేపుతూ రాత్రింబవళ్లు వాటి వెంటే ఉంటున్నారు. మండలంలోని నరసింహాపురం, టీవీఎన్ఆర్ పురం, ఆముదాల, పుల్లయ్యగుంట, వనదుర్గాపురం గ్రామాలకు చెందిన 1,500 గొర్రెలను వంద కిలోమీటరు దూరంలోని తమిళనాడు రాష్ట్రం పొన్నేరి పరిసర ప్రాంతాలకు తరలించారు. మండలంలో మూగజీవాల మేతకు ఉ



ంచిన కొండలపై అక్రమార్కులు కన్ను పడటంతోనే గ్రాసం కొరవడిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి కొండలను కాపాడి, మూగజీవాలకు గ్రాసం ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## శివయ్యా..చెత్త ముంచెత్తుతోంది చూడయ్యా

కర్నూలు : శ్రీశైలంలో ఘన వ్యర్థాల నిర్వహణ అధ్వానంగా ఉంది. వేలాది మంది భక్తులు వచ్చే ఈ పవిత్ర స్థలంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. తెదేపా హయాంలో శాస్త్రీయ విధానాలు అవలంబించగా.. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటన్నింటికీ మంగళం పాడింది. టన్నుల్లో పోగవుతున్న వ్యర్థాలను శాస్త్రీయంగా నాశనం చేయాలన్న స్పృహ అధికారుల్లో కొరవడుతుండటంతో పర్యావరణానికి హాని జరుగుతోంది. శ్రీశైలానికి సాధారణ రోజుల్లో 30 వేల మంది, సెలవు రోజుల్లో 60 వేల మంది భక్తులు వస్తుంటారు. వారికి టిఫిన్లు, భోజనాలకు వంటలు చేస్తుండటంతో ఎక్కువగా వ్యర్థాలు పోగవుతున్నాయి. రోజూ ఇలాంటి వాటిని 20 ట్రాక్టర్లలో పదెకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

**నిబంధనల ఉల్లంఘన ఇలా..**

తడి, పొడి చెత్తను వేరు చేయడం లేదు. అన్ని వ్యర్థాలను గంపగుత్తగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేస్తున్నారు. దీనికితోడు వ్యర్థాలను కాలుస్తుండటంతో పొగ వ్యాపిస్తోంది. పర్యావరణం కలుషితమ



వుతోంది. శ్రీశైలం పరిసరాల్లోని ఆవులు డంపింగ్ యార్డులోని ఆహార పదార్థాలతో పాటు ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను తిని రోగాలపాలవుతున్నాయి. శ్రీశైలం, సున్నిపెంట పరిసరాల్లో 2023లో ఆఫ్రికన్ స్వైన్‌ఫ్లూ వచ్చి సుమారు 65 పందులు చనిపోయాయి. వాటికి పరీక్షలు నిర్వహించగా స్వైన్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో పాటు వాటి కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలను గుర్తించారు.వర్షాలు పడిన సమయంలో డంపింగ్ యార్డులోని చెత్తంతా కృష్ణా నదిలో పెద్దఎత్తున కలుస్తోంది.శ్రీశైలం చుట్టూ నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్.ఎస్.టి.ఆర్.) ఉండటంతో వ్యర్థాల కారణంగా వన్యప్రాణుల ఆరోగ్యం దెబ్బతింటోంది.గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

గత తెదేపా హయాంలో చెత్త నుంచి సంపద సృష్టించడానికి వీలుగా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరే చేసే యంత్రాలను ఏర్పాటు చేశారు. మిగిలిన ఘన వ్యర్థాలతో ఎరువు తయారుచేసేలా యూనిట్ నెలకొల్పారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ కేంద్రం మూతపడటంతో యంత్రాలన్నీ పాడయ్యాయి. దేవస్థానానికి రావాల్సిన ఆదాయానికి గండి పడింది.

## నిబంధనలు దాటి.. ఇసుక దోపిడీ

నంద్యాల : నంద్యాలలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక నిల్వ కేంద్రం నిర్వాహకుడు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకన్నా అదనంగా వసూలు చేస్తున్నాడు. క్రయవిక్రయాల్లో ఎక్కడా ఆన్‌లైన్ బిల్లులు కనిపించడం లేదు. చెప్పినంత చెల్లిస్తేనే ఇసుక ఇస్తారు. అవసరమైన వారు గత్యంతరం లేక ఇక్కడే కొనాల్సి వస్తోంది.

**టన్నుకు రూ.1,150 వసూలు**

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా నంద్యాల సమీపంలోని అయ్యలూరుమెట్ట వద్ద కొన్ని నెలల కిందట స్టాక్ యార్డ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఇచ్చిన అనుమతి ప్రకారం లైసెన్సుదారుడు అధికారికంగా ఇక్కడ డిపో ఏర్పాటుచేసి ఇసుక విక్రయాలు సాగిస్తున్నాడు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కర్నూలు జిల్లాలోని రీచ్‌ల నుంచి వచ్చే ఇసుక టన్ను రూ.884, వైఎస్సార్ జిల్లా నుంచి వస్తే టన్నుకు రూ.894 ధర నిర్ణయించారు. నంద్యాలలో ఇది అమలు కావడం లేదు. టన్ను రూ.1,150కు అంటగడుతున్నారు. పట్టణం వరకైతే నేరుగా కోరుకున్న ప్రాంతానికి ఇసుక సరఫరా చేస్తామంటూ



ఈ మొత్తం వసూలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకైతే దూరాన్ని బట్టి మరికొంత మొత్తం వసూలు చేస్తున్నారు. భారీ వాహనాల్లో సరఫరా చేసే ఇసుకకు లిఫ్టింగ్ ఛార్జీల పేరుతో అదనంగా రూ.2 వేలు వసూలు చేస్తున్నారు.

**బిల్లులన్నీ చేతితో రాసిచ్చినవే..**

ఇసుక డిపోలో ఆన్‌లైన్ పద్ధతిలో బిల్లులు ఇవ్వడం లేదు. చేతితో రాసిన బిల్లులే ఇస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కాకుండా ఎక్కువకు విక్రయిస్తుండటంతో ఆన్‌లైన్ బిల్లులు ఇవ్వడం లేదు. మరోవైపు ఇసుక విక్రయాలపై అధికారుల తనిఖీలు కానరావడం లేదు. లారీలు, టిప్పర్లలో అధిక లోడు వేసి ఇసుక సరఫరా చేస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు.

**ప్రైవేటు సైన్యంతో పహారా**

ఇసుక డిపో నిర్వాహకుడు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లోని రీచ్‌ల నుంచి నంద్యాలకు నేరుగా ఇసుక రాకుండా చూస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. పొరుగు జిల్లాలకు ఇతర సరకులతో వెళ్లిన లారీలు, ఇతర వాహనాల నిర్వాహకులు తిరిగొచ్చే సమయంలో ఖాళీగా రాలేక ఇసుక లోడుతో వస్తున్నారు. వారిని అడ్డుకుని వాహనాలను బలవంతంగా డిపోకు తీసుకెళ్లి ఇసుక డంప్ చేసుకుంటున్నారు. లేదంటే తాము ఒప్పందం చేసుకున్న వినియోగదారుల వద్దకు లారీలను పంపుతున్నారు.

తమ అవసరాల కోసం ఇసుకను నేరుగా రీచ్‌ల నుంచి తెచ్చుకుంటున్న వినియోగదారులను కూడా వీరు వదలడం లేదు. ఇసుక కావాలంటే తమ డిపోలోనే తీసుకోవాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో నిర్ణీత మొత్తం చెల్లించి ఇసుక తెచ్చుకున్నా సరే.. తమకు టన్నుపై రూ.1150 చెల్లించాల్సిందేనని పట్టుపడుతున్నారు.

చురకలు



# రైల్వే విచారణ కేంద్రం.. సమాచార లోపం

అనంతపురం : రైలు రాకపోకలకు సంబంధించిన సమాచారాన్ని ప్రయాణికులకు చేరవేయడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. రైల్వే విచారణను రైల్వేశాఖ ప్రైవేటుకు అప్పగించింది. ప్రధాన రైల్వేస్టేషన్లలోని విచారణ కేంద్రాల్లో 2019 నుంచి పొరుగు సేవల సిబ్బందిని నియమించారు. వీరి బాధ్యతలను గుత్తేదారుకు అప్పగించారు. దీంతో తరచూ సమస్య ఉత్పన్నమవుతోంది. గతంలో విచారణలో టీటీఈలను నియమించేవారు. వారికి రైళ్ల రాకపోకలపై అవగాహన ఉండటంతో ప్రయాణికులకు సరైన సమాధానం ఇచ్చేవారు. అంతేకాకుండా రైలు వచ్చే సమయంలో సకాలంలో కచ్చితత్వంతో ప్రకటనలు చేసేవారు. రైల్వేశాఖ పొదుపు మంత్రంలో భాగంగా వీటిని పొరుగు సేవల సిబ్బందికి అప్పగించింది. వీరు టీటీఈలు పాటించే జాగ్రత్తలు, బాధ్యత తీసుకోవడం లేదు. కుర్చీలో కూర్చోవడం కంటే బయటనే ఎక్కువ కనిపిస్తున్నారు.



**అరకొరా సేవలు**

ఒక్కోసారి రైలు వచ్చే సమయంలో ప్రకటన కూడా చేయకుండా వదిలేస్తున్నారు. కొన్నిసార్లు రైళ్ల నంబర్లు తప్పు చెబుతున్నారు. ఈ విషయంపై ప్రయాణికులు అధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు అనేకం. సిబ్బందికి అవగాహన లేదని అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో రైలు వచ్చే సమయంలో ఫలానా రైలు వస్తోందని మైకుల్లో చెప్పేవారు. రైలు బయలు దేరే సమయం లోనూ ఫలానా ప్లాట్‌ఫారం నుంచి రైలు బయలు దేరడానికి సిద్ధంగా ఉందని చెప్పేవారు. కానీ, ప్రస్తుతం ఒకసారి చెప్పడమే గగనంగా మారింది. విచారణ సిబ్బంది కేంద్రంలో 24 గంటలూ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైలు వచ్చే సమయంలో ప్రకటనలు, కోచ్‌లు ఎక్కడ వస్తాయో మైకుల్లో ప్రకటన చేయాలని విన్నవిస్తున్నారు. ఈ విషయంపై రైల్వే అధికారులను వివరణ కోరగా.. సిబ్బంది పనితీరును విచారించి ప్రయాణికులకు సేవల్లో లోపం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# 'అమృత్'ధార..అందనుంది

శ్రీకాళహస్తి : నగరాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రవేశపెట్టిన అమృత్ పథకం 2.0 పునరుజ్జీవానికి ప్రభుత్వం చొరవచూపుతోంది. వైకాపా పాలనలో రాష్ట్రవాటా నిధులు సమకూర్చడంలో వైఫల్యం కారణంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలోని పట్టణ, నగరవాసులకు నాలుగేళ్లుగా కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితి ఎదురైంది. 2021 అక్టోబర్ 1న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ పథకం పనులు 2025–26లోపు పూర్తిచేయాల్సి ఉండగా గత ప్రభుత్వ తీరుతో పలుచోట్ల టెండరు దశ దాటని దుస్థితి నెలకొంది.

**చేపట్టనున్న పనులివే..**

నగరాలు, పట్టణాల్లో మురుగునీటి వ్యవస్థ, తాగునీటి సౌకర్యాల కల్పన కోసం నిధులు కేటాయించారు. ప్రధానంగా వెంకటగిరి పట్టణానికి రూ.92 కోట్ల అంచనాలతో తెలుగుగంగ నీటి సరఫరా పనులకు టెండర్లు ఆహ్వానించారు. ప్రస్తుతం వాటి అంచనాలు రూ. 102 కోట్లకు పెరగడంతో పాత పనులు రద్దుచేసి కొత్తగా ఆహ్వానించాలని నిర్ణయించారు. కుప్పంలో ఇప్పటికే రూ. 9.21 కోట్ల విలువైన తాగునీటి సరఫరా పనులు కొనసాగుతున్నాయి. శ్రీకాళహస్తిలో 12.07 కి.మీ. మురుగునీటి పైప్ నిర్మాణం, చిత్తూరులో రూ.23.64 కోట్లతో మురుగునీటి వ్యవస్థను అందుబాటులోకి తేనున్నారు. పుంగనూరులో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వరకు పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు.

**వాటాలు ఇలా...** పూర్తిగా కేంద్ర నిధులతోనేకాకుండా స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం, 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించనున్నారు. ఆర్థికసంఘం నిధుల లభ్యతను బట్టి, స్థానిక సంస్థలు సైతం నిధులు కేటాయించి పనులు పూర్తిచేసేలా ప్రజారోగ్య విభాగం అధికారులు రూ. 339 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలో టెండర్లు ఆహ్వానించి అమృత్ 2.0 పనులు చేపట్టనున్నట్లు ప్రజారోగ్య విభాగం ఎస్ఈ టి.మోహన్ తెలిపారు.

# పారిశుద్ధ్యం పేరుతో...నిధుల స్వాహా..!

సూళ్లూరుపేట: వైకాపా హయాంలో పంచాయతీల నిధులు పారిశుద్ధ్య పనులు చేయకుండానే దస్త్రాల్లో చూపి హారతి కర్పూరంలా కరిగించారు. బ్లీచింగ్, సున్నం చల్లకుండానే నకిలీ బిల్లులు జోడించి నిధులు కాజేశారు. కొన్ని మండలాల్లో వైకాపా నేతలు, ఎంపీడీవోల సమన్వయంతో వివిధ ఖర్చుల పేరుతో మంచినీళ్లలా నిధులు ఖర్చు చేశారని ఫిర్యాదులు అందినా అధికారులు విచారణ జరిపిన దాఖలాలు లేవు. **కొన్నింటిని పరిశీలిస్తే..** బి.ఎన్.కండ్రిగ మండలంలో సర్పంచులకు తెలియకుండానే ఎంపీడీవోలు బ్లీచింగ్, సున్నం నరఫరా చేశారు. గూడూరు డివిజన్‌లో 2022లో సర్పంచులకు తెలియకుండానే కడివేడు, ఓడూరు, తిమ్మనగారిపాళెం, తీపనూరు, చెడిమాల, ఎగువరాజుపాళెం, ముత్యాలపాడు, తిక్కవరం పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేసినట్లు దస్త్రాల్లో నమోదు చేసి రూ. 19 లక్షలు, ఏర్పేడు మండలంలో రూ. 1.50 కోట్లు కాజేశారు. సూళ్లూరుపేట మండలం కోటపోలూరులో 2020–21లో బ్లీచింగ్ చల్లిన కూలీలకు రూ. 92,300 చెల్లించినట్లు దస్త్రాల్లో చూపారు. శానిటేషన్ గార్బేజీకు రూ. 40వేలు ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో లెక్కలకు పొంతన లేదు. చర్యలు తీసుకుంటున్నాం.. నిధుల దుర్వినియోగంపై దక్కిలి, చిల్లకూరు, నరదయ్యపాళెం మండలాల్లో పలువురు సర్పంచుల చెక్‌పవర్ రద్దు చేశాం. కార్యదర్శులపైనా చర్యలు తీసుకుంటున్నాం .సుశీల, డీపీవో

# ఖాద్రీశా.. కోనేటి స్నానం సాకారమయ్యేనా?



కదిరి : కదిరిలోని ప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరు పనులు పూర్తి కావాలంటే సాక్షాత్తూ ఖాద్రీశుడే కదిలి రావాలా.. అని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రద్ధపెట్టి చేస్తే ఆర్నెల్లలో పూర్తయ్యే పనులు ఆరేళ్లైనా అసంపూర్తిగానే మిగిలాయని వాపోతున్నారు. నారసింహుని దర్శనానికి దక్షిణాది రాష్ట్రాల ప్రజలు వేలాదిగా తరలి వస్తుంటారు. పవిత్రత, ముక్తి మార్గంగా భావించే భృగుతీర్థం (కోనేరు)లో స్నానం చేయలేకపోవడంతో సర్వత్రా ఆందోళన కనిపిస్తోంది వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో కోనేరు పునరుద్ధరణ ముందుకు సాగలేదు. కేవలం పనులు లాభాలకే అన్నట్లు మార్చేశారు. భక్తులు కలుషిత నీటినే చల్లుకుని ఖాద్రీశా.. ఈ ఖర్మ తీరే మార్గం చూపవాంటూ వేడుకుంటున్నారు.

**నిధులు ఉన్నా...** కోనేరు పునరుద్ధరణ పనులకు 2019లో 2.17 కోట్లు కేటాయించారు. అదే ఏడాది నవంబరులో పనులు ప్రారంభించారు. తరువాత వరదలొచ్చి కొద్దిపాటి నిర్మాణాలు కొట్టుకుపోయాయి. భృగుతీర్థం మరింత అధ్వానంగా మారింది. వరద కారణంగా మద్దిలేరు ప్రవహించటంతో మురుగుతో కలుషితమైంది. దీంతో 2022, ఆగస్టులో ఇంజినీరింగ్ నిపుణులతో కోనేరు కలుషితం కాకుండా ఊటనీరు ఆపేలా అధ్యయనం చేయించారు. దేవాదాయశాఖ స్థపతితోనూ ప్రణాళికలు వేయించారు. కలుషిత నీటిని అడ్డుకునేందుకు ప్రహరీ నిర్మాణానికి రూపకల్పన చేశారు. ఇందుకు 2023లో రూ. 4 కోట్ల కేటాయించారు. పనులను మళ్లీ మొదలు పెట్టారు. ఏడాది దాటినా నిర్మాణ పనులు గోడకే పరిమితమయ్యాయి. ఇందుకు రూ. 2.87 కోట్లు ఖర్చు చేశారు. చుట్టూ తీసిన గోతుల్లో మట్టి నింపటం, బండల పరుపుతో పాటు సుందరీకరణ పనులను చేయాల్సి ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి.. మార్చి 9న మొదలయ్యే బ్రహ్మోత్సవాల నాటికి కోనేటిని సిద్ధం చేయాలని భక్తులు కోరుకుంటున్నారు.

**రెండు రోజుల్లో పనులు పునఃప్రారంభిస్తాం - శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో**

ఆగిన ఆలయ కోనేరు పనులను రెండు రోజుల్లో తిరిగి మొదలు పెడుతున్నాం. ప్రధానమైన పని పూర్తయింది. మిగిలిన పనులకు రెండు వారాలు సరిపోతాయి. బ్రహ్మోత్సవాల నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం.

# దడ పుట్టిస్తున్న 'ధార్' దొంగలు



అనంతపురం : 'ధార్' అనేది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతం. అక్కడక్కడ విసిరేసినట్లు చిన్న గ్రామాలు ఉంటాయి. వీరు విద్యకు చాలా దూరం. చోరీలనే ప్రవృత్తిగా చేసుకుంటున్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారే సభ్యులుగా ఉంటారు. వాస్తవానికి వీరు ప్రధానంగా వ్యవసాయ కూలీలైనా, ప్రవృత్తి మాత్రం దొంగతనాలు చేయడం. అనంతపురం బంగారు నగల చోరీ కేసులో పట్టుబడిన నిందితులతోపాటు సుమారు 60 మంది వరకు ముఠా సభ్యులు ధార్ ప్రాంతంలో నివసిస్తున్నారు. చోరీకి వెళ్లిన సమయంలో ఎవరైనా అడ్డగిస్తే ప్రాణాలు తీయడానికైనా వెనుకాడరు. విపరీతమైన నేరప్రవృత్తి కలిగినవారు. గ్యాంగులుగా ఏర్పడి చోరీలు చేయడం వీరికి రివాజు. దూర ప్రాంతాలను ఎంచుకుని రైలు, బస్సులు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తూ ఘటనలకు పాల్పడుతుంటారు. ప్రధానంగా తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటారు. పగలు రెక్కీ నిర్వహించి, రాత్రివేళల్లో చోరీలు చేయడం ఈ ముఠాలకు అలవాటు. చిన్న వయసులోనే వివాహాలు చేసుకోవడం, వ్యసనాలకు బానిసలుగా మారడం వల్ల వాటిని తీర్చుకోవడానికి డబ్బు సులువుగా సంపాదించడానికి చోరీలు ఎంచుకుంటున్నారు.

**దక్షిణ రాష్ట్రాల పైనే దృష్టి**

'ధార్' ముఠాలు ప్రత్యేకమైన లక్ష్యాన్ని కలిగి ఉంటాయి. వారు చోరీలకు కేవలం దక్షిణ భారత రాష్ట్రాలనే ఎన్నుకుంటారు. కారణం.. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ, గుజరాత్ రాష్ట్రాల్లో ప్రజలు బంగారు ఆభరణాలను ఎక్కువ ఇష్టపడతారు. పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తారని ముఠాల ఆలోచన. అంతేగాకుండా ఆభరణాలు ఒంటి పైనా, లేదా ఇంట్లో భద్రపరిచి ఉంటారు. దీంతో ఇళ్లనే లక్ష్యంగా చేసుకుంటారు. అందులోనూ జాతీయ రహదారులకు ఆనుకుని ఉన్న, నగర శివారు ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, వెంచర్లు, అపార్టుమెంట్లను ఎన్నుకుంటారు. పగటి సమయాల్లో ద్విచక్ర వాహనం, ఆటోల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటారు. రాత్రివేళల్లో ప్రధాన ద్వారం నుంచి కాకుండా ప్రహరీ దూకి లోపలికి ప్రవేశిస్తారు. ఇళ్లకున్న మెయిన్ డోర్ పగులగొట్టి లోపలికెళ్లి వస్తువులను దొంగిలిస్తారు.

**ఆభరణాల విలువ, ధరలు తెలియవు**

సాధారణంగా బంగారు వస్తువులు క్రయ, విక్రయాలు గ్రాముల, తులాలు, క్యారెట్లలో కొలుస్తారు. అయితే ఇక్కడ మాత్రం విచిత్రం. దొంగ సొమ్మును కొనుగోలు చేసే క్రమంలో ఎలాంటి తూకం (బరువు తూచకుండా) లేకుండా అందాజుగా చేతితో బరువు తూచి లెక్కగడతారు. కొనుగోలు చేసేవారు తోచినంత చెల్లిస్తారు. ఆ డబ్బునే తలాదించి తీసుకుని వాడుకోవడమే 'ధార్' ముఠాల పని.

**చాకచక్యంగా...**

ఈ ముఠా సభ్యులు చరవాణి వినియోగించరు. సిగ్నల్ దొరకనివ్వరు. తమ ముఖాలు కనబడనివ్వరు. పగలు వీరిని చూస్తే వీళ్లు దొంగలా? అన్నట్లు ఉంటారు. రాత్రి అయ్యిందంటే ప్రత్యేక ముసుగులు ధరించి ఇళ్లమీద పడిపోతారు. సైలెంటుగా వచ్చి, వైలెంటుగా పని పూర్తి చేసుకుని వెళ్తారు. వీరి నేరచరిత్ర వింటే ఒళ్లు గగుర్పాటు కలుగుతుంది. మనిషిని మనిషిగా లెక్కించని మనస్తత్వం వీరిది. పోలీసులు వారి ప్రాంతాలకు వెళితే గ్రామాలు ఏకమై దాడులు చేయడానికే వెనుకాడరు. అందుకే అక్కడి దొంగలను పట్టుకోవాలంటే పోలీసులు వెనుకడుగు వేస్తుంటారు. బృందాలుగా ఏర్పడిన ముఠాలకు నాయకుడు ఉంటారు. ఆ నాయకుడు ఏది చెబితే అదే చేస్తారు. మధ్యప్రదేశ్ నుంచి బయలుదేరి దేశంలోని అనేక ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తుంటారు. 'ధార్', బచావో, భూరియా, చంబా, పార్థీ పేర్లతో గ్యాంగులు ఉంటాయి. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పేరు. చోరీల్లో ఒక్కో శైలి. కానీ అందరూ చేసేది లూటీనే.

# బొడ్డుతాడు భద్రం..! అది ఓ అమూల్య కణాల గని


అక్కిరెడ్డిపాలెం : బ్యాంకుల్లో డబ్బులు దాచుకోవడం చూశాం.. సేకరించిన రక్తాన్ని అవసరమైనప్పుడు వాడుకోవడానికి బ్లడ్ బ్యాంకులను కూడా చూశాం.. ఇప్పుడు మూలకణాలు (స్టెమ్ సెల్స్) భద్రపర్చుకునే బ్యాంకులు కూడా వస్తున్నాయి. ప్రస్తుతానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఈ భద్రత తప్పనిసరి కాబోతుంది. పాశ్చాత్య దేశాల్లో ఈ విధానం విస్తృతంగా అమలు అవుతుండగా.. మనదేశం లో.. మన నగరాల్లోనూ కొన్ని ఏజెన్సీలు మూలకణాల భద్రతకు ముందుకు వస్తున్నాయి.

**విదేశాల్లో మూలకణాలపై విస్తృత అవగాహన**

వైద్యపరంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లో బొడ్డుతాడును భద్రపర్చుకుంటున్నారు. సమీప రక్తసంబంధీకులు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే భద్రపర్చిన మూలకణాల నుంచి అవసరమైన శరీర భాగాలను అభివృద్ధి చెందించి అవసరమైన చికిత్స అందిస్తారు. ప్రస్తుతం విదేశాల్లో స్టెమ్‌సెల్స్ బ్యాంకుల ప్రాచుర్యం ఎక్కువగా ఉంది. మన దేశంలో ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతోంది. ఇప్పటికే ప్రముఖులు కొందరు తమ కుటుంబంలో పుట్టే బిడ్డల బొడ్డుతాడును భద్రపర్చడం ప్రారంభించారు. ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ మూలకణాల బ్యాంకుకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ నటుడు మహేష్‌బాబు సైతం బొడ్డుతాడు ప్రాధాన్యతను వివరించి భద్రపర్చుకునేలా సూచనలు చేస్తున్నారు.

**అమూల్య కణాల గని**

స్టెమ్‌సెల్స్ భద్రతపై విస్తృత ప్రచారం జరుగుతుండగా.. బొడ్డుతాడులో పుష్కలమైన మూలకణాలు ఉన్నాయని గుర్తించారు. ప్రసవ సమయంలో బిడ్డతో పాటు తల్లి గర్భంలోంచి బొడ్డుతాడు బయటకు వస్తుంది.



ఇది నిరుపయోగమని భావించి కత్తిరించేసేవారు. ఇటీవల శాస్త్రవేత్తలు బొడ్డుతాడును అమూల్య కణాల గనిగా గుర్తించారు. దీనిని అధునాతన రీతిలో భద్రపరిస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలుసుకున్నారు. ముఖ్యంగా అంతర్గత అవయవాలు(కాలేయం, మూత్రపిండాలు) వంటివి దెబ్బతిన్నప్పుడు వారికి, వారి కుటుంబ సభ్యులకు ఆ మూలకణాల ద్వారా అవయవాలు అభివృద్ధి చెందించేలా కృషిచేయవచ్చంటున్నారు.

**విశాఖలోనూ..**

విశాఖలో పలు ఏజెన్సీ సంస్థలు పేర్లు నమోదు చేయించి ప్రసవం అయిన ఐదు నిమిషాల్లో బొడ్డుతాడు భద్రపరిచి ప్రధాన నగరాల్లో కేంద్రాలకు తరలించి బాధ్యత తీసుకుంటున్నాయి. కొద్దిగా ధర ఎక్కువగా ఉన్నప్పటికీ ముందు చూపుతో కొందరు నమోదు చేయించుకోవడం విశేషం.

# తక్కువ ఖర్చుకే ఖరీదైన దంత వైద్యం

విశాఖపట్నం : ప్రభుత్వాసుపత్రుల్లో దంత వ్యాధులకు పూర్తిస్థాయిలో చికిత్స అందుబాటులో ఉండడం లేదు. పుచ్చుపళ్లను తొలగించడం, నొప్పి తగ్గడానికి మాత్రలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తున్నారు. ఆధునిక చికిత్స అవసరమైతే ప్రయివేటు ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అక్కడ చిన్న దంత సమస్యకు కూడా రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. ఈ తరుణంలో విమ్స్ ఆసుపత్రిలో ఆధునిక దంత వైద్య సేవలు అందుబాటులోకి రావడం సామాన్యులకు ఊరట కలిగిస్తోంది.

**పేద, మధ్యతరగతి ప్రజలకు వరం**

విమ్స్‌లో గతంలోనే దంత విభాగం ఉన్నా ఆధునిక వైద్య పరికరాలు లేవు. దీంతో పేద వైద్యులకు ఆధునిక చికిత్స అందని పరిస్థితి. ఇటీవల విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సేవా సంస్థ రూ.6 లక్షల దంతవైద్య పరికరాలు ఆసుపత్రికి వితరణగా ఇచ్చింది. తద్వారా పేదలకు తక్కువ ఖర్చులో ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చింది. ప్రయివేటు ఆసుపత్రుల్లో అయ్యే దాంట్లో పావువంతు కూడా వ్యయం కాదని వైద్యులు తెలిపారు. వివిధ సంస్థల ఆరోగ్య బీమా కలిగి ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నామని, ఒక విధంగా మధ్యతరగతి, పేదలకు ఇది వరమని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు చెప్పారు.

**అందిస్తున్న సేవలు ఇలా..**

దంతాల క్లీనింగ్
రూట్ కెనాల్ ట్రీట్మెంట్
కృత్రిమ దంతాలు అమర్చడం
చిన్నారులు, వృద్ధుల దంత సంరక్షణ



జ్ఞానదంతాలకు చికిత్స
వంకర సరిచేయడానికి క్లిప్పింగ్
ప్రమాదాలలో దెబ్బతింటే మెటల్, సిరామిక్స్ దంతాల అమరిక
పుచ్చు, విరిగిన పళ్ల సంరక్షణ

80 శాతం ప్రజల్లో దంత సమస్యలు

ప్రస్తుతం నూటికి 80 శాతం ప్రజల్లో దంత సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. పౌష్టికాహారం, కాల్షియం లోపంతో ఎముకలు, దంతాలలోని కాల్షియం శరీరం వాడుకుంటున్నందున పుచ్చుపళ్లు, దంత క్షయం ఏర్పడుతోంది. ఈ సమస్యకు విమ్స్‌లో అధునాతన రూట్‌కెనాల్ ట్రీట్మెంట్ అందుబాటులో ఉంది. పోయిన దంతాల స్థానంలో కృత్రిమ పళ్లు పెడితే ఆహారం తీసుకునేందుకు సులభమవుతుంది. పుచ్చిన పళ్లతో నేత్ర సమస్యలు వస్తాయి. చిగుళ్ల ఇన్ఫెక్షన్ ఇతర ఆరోగ్య సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది. డాక్టర్ సుధ, దంత వైద్య నిపుణురాలు, విమ్స్

వైద్య సిబ్బంది ఇలా..
ఎండీఎస్ వైద్యులు 2
బీడీఎస్ వైద్యులు 3
సహాయ సిబ్బంది 5
ప్రస్తుతం ఓపీ సంఖ్య: 50 నుంచి 60
ఆధునికీకరణ కారణంగా వచ్చే రోగులు: 70 నుంచి 85 (అంచనా)

# మరోమారు చేయాలి భూయజ్ఞం..

అనకాపల్లి : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన భూములన్నీ ఇప్పటికే పలు కంపెనీలకు కేటాయించేశారు. అచ్యుతాపురం సెజ్ పరిధిలో కొద్ది భూములు తప్ప మిగతా ల్యాండ్ బ్యాంకు అంతా దాదాపు ఖాళీ అయిపోయింది. త్వరలో కార్యరూపంలోకి రాబోతున్న రెండు భారీ ప్రాజెక్టులతో పాటు, కొత్తగా వచ్చే పరిశ్రమల కోసం పెద్దఎత్తున భూములు సేకరించాల్సి ఉంది. దీని కోసం జిల్లా అధికారులు అన్వేషణ మొదలుపెట్టారు. ఇప్పటికే ప్రాంతాన్ని పారిశ్రామిక కారిడర్‌గా అభివృద్ధి చేసిన రాంబిల్లి, నక్కపల్లి ప్రాంతాలతో పాటు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో సుమారు నాలుగైదు వేల ఎకరాల భూసేకరణ చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**ప్రస్తుత పరిస్థితి ఇదీ**

నక్కపల్లి పారిశ్రామికవాడ కోసం దశాబ్దం క్రితం సుమారు 4,315 ఎకరాలు సేకరించారు. వాటిలో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ప్లాంట్ తొలిదశ కేటాయింపులకు కూడా సరిపోలేదు. రెండోదశ విస్తరణకు భారీగా ల్యాండ్‌బ్యాంకు సిద్ధం చేయాల్సి ఉంది. ఇందులో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రెండోదశకే 3,800 ఎకరాలుపైగా అవసరం అవుతుంది. తొలిదశ ప్రాజెక్టుకు కేటాయించిన భూములకు సమీపంలోనే వీటిని అందుబాటులోకి తేవాలి. ఈ మేరకు సమీప గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్డ్, పట్టా భూముల వివరాలను సేకరిస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు గ్రామాలను ఖాళీ చేయాల్సి వస్తే వారికి పునరావాసం కల్పించడానికి అవసరమైన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయనే విషయమై ఆరా తీస్తున్నారు. బల్క్‌డ్రగ్ పార్క్‌కి మరో 700 ఎకరాలు పైగా కేటాయించాల్సి ఉంది. నక్కపల్లి వీసీఐసీ నోడ్ పరిధిలో సుమారు 5 వేల ఎకరాలు అదనంగా సేకరించాల్సిన అవసరం కనిపిస్తోందని ఏపీఐఐసీకి చెందిన ఓ అధికారి చెప్పారు. మరోవైపు చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోను పరిశ్రమల ఏర్పాటుకు భూములు సేకరించి సిద్ధం చేసుకోవాలనే ఆలోచనతో ఉన్నారు. చోడవరం క్లస్టర్ పేరుతో 3,018 ఎకరాలు సేకరించాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.

**పెరిగిన డిమాండ్..** వైకాపా హయాంలో పరిశ్రమలు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. భారీ పరిశ్రమలతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో ముందుకు వస్తున్నారు. అచ్యుతాపురం సెజ్‌లో ఖాళీగా ఉన్న 1500 ఎకరాల భూముల్లో సుమారు 800 ఎకరాలు ఈ ఏడు నెలల కాలంలోనే కంపెనీలకు కేటాయించేందుకు ప్రతిపాదించడం భూముల డిమాండ్‌కు అద్దం పడుతోంది.

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

మద్దిపాడు : పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలన్న మహాత్ముని పలుకులను గత పాలకులు పెడచెవిన పెట్టారు. ఫలితంగా గుంతల రహదారులు..దెబ్బతిన్న మురుగు కాలువలు..అపరిశుభ్రతతో నిండిన పరిసరాలతో పరిస్థితి దుర్భరంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీలో భాగంగా రూ.కోట్లు వెచ్చించి కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ఇవన్నీ నందనవనాల్లా మారుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పల్లె పండగ మొదలైంది. ఉపాధి హామీ నిధులతో ప్రతి గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇందుకోసం జిల్లాకు దాదాపు రూ.150 కోట్లు వెచ్చించి 1143 రోడ్ల నిర్మాణానికి సంకల్పించారు. దాదాపు 80 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి.

**తప్పిన అవస్థలు:** గతంలో ఏమాత్రం చిన్న వాన పడినా మోకాళ్ల లోతు నీళ్లలో వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడేవారు. పాఠశాలలకు వెళ్లాలంటే దాదాపు అసాధ్యమే! ఈ నేపథ్యంలో పల్లె పండగలో భాగంగా పనులు చేపట్టి సంక్రాంతి నాటికి




వాటి దశ మార్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. జిల్లాకేంద్రానికి ఆనుకుని ఉన్న మండలాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మద్దిపాడు మండలంలో 29 పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 7.3 కి మీ మేర సీసీ బాటల నిర్మాణానికి రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాల కిందట ఏర్పడిన మద్దిపాడు బీసీ కాలనీకి ఇప్పటికీ రోడ్డు లేదు. ఇప్పుడు వారు హాయిగా జాతీయ రహదారిని చేరుకునే అవకాశం దక్కింది. మద్దిపాడు, దొడ్డవరం, పెద కొత్తపల్లి, నాగన్నపాలెం, కొలచనకోటలో ఇప్పటికే ఏర్పాటయ్యాయి. బసవన్నపాలెం, ఇనమన మెళ్లూరు, రాచవారిపాలెం తదితర గ్రామాల్లోనూ పనులు పూర్తయ్యాయి. మిగిలినవి సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సంతనూతలపాడు మండలంలో మొత్తం 30 రోడ్లు మంజూరు కాగా, వీటికి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 25 పనులు పూర్తవ్వగా, మిగిలినవి జరుగుతున్నాయి.

# రూ.60 కోట్లు... బూడిదలో పోసిన పన్నీరు!

కడప: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో సైతం అభివృద్ధి పనులు పూర్తి చేసుకోలేకపోయారు. చాలా వరకు పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలనే ధ్యాస లేకుండా పోయిందనే విమర్శలు మూటగట్టుకున్నారు. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించినా ప్రయోజనం లేకుండా బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ కోవకు చెందినదే సూక్ష్మసేద్యం ప్రాజెక్టు. సూక్ష్మసేద్యం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే లక్ష్యాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. గతంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో పెండింగ్‌లో ఉన్న సూక్ష్మసేద్యం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో 2021, మార్చిలో అప్పటి సీఎం జగన్ మరోసారి శిలాఫలకం ఆవిష్కరించారు.


క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగలిలా అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాలెం, లింగాల కుడి కాలువ, పీబీఆర్ జలాశయాల పరిధిలోని మొత్తం 1,22,480 ఎకరాలకు సూక్ష్మసేద్యం ద్వారా సాగునీరందించే దిశగా ప్రయత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలో వాటి నిర్మాణపనులు పూర్తిచేసేందుకు రూ.1,256 కోట్ల అంచనాలతో పనులను మెగా కంపెనీకి వైకాపా ప్రభుత్వం కట్టబెట్టింది. 2021,



మార్చిలో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2024, మార్చి ఆఖరి నాటికి వాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి 10.50 శాతం పనులు పూర్తి చేసి రూ.60 కోట్ల బిల్లులు గుత్తేదారుకు చెల్లించేశారు. సూక్ష్మసేద్యం పనులు పూర్తయితే కరవు నేలలో పచ్చని పైర్లతో కళకళలాడుతుంది.

**రెండేళ్లుగా ముందుకు సాగని పనులు :** ఆకృతుల మేరకు ఒక సంపు నుంచి సూక్ష్మసేద్యం పద్ధతిలో 100 నుంచి 120 ఎకరాలకు సాగునీరందేలా వాటి నిర్మాణాలు రూపుదిద్దాల్సి ఉంది. ఈ విధంగా 1,22,480 ఎకరాలకు సాగునీరు సరఫరా చేసేందుకు 1,275 సంపులు నిర్మించాల్సి ఉండగా, 60 సంపులు పూర్తి కాగా, మరో 10 వరకు నిర్మాణ దశలో నిలిచిపోయాయి. మిగతా సంపుల నిర్మాణాలు చేపట్టేందుకు కావాల్సిన భూసేకరణ కార్యక్రమం ఆగిపోయింది. ఒక్కో సంపు నిర్మాణానికి 60 సెంట్ల స్థలం కావాల్సి ఉంది. ఈ మేరకు స్థలాన్ని వదులుకునేందుకు చాలామంది రైతులు ముందుకు రాలేదు. ఎక్కువ విస్తీర్ణం భూమి ఉన్న రైతులు మాత్రమే ముందుకొచ్చారు. ఎకరా లేదా రెండు ఎకరాలు భూములు ఉన్న కర్షకులు ఆ మేరకు భూమి కోల్పోయేందుకు ససేమిరా అన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు ముందుకు సాగలేదు. చేపట్టిన పనుల మేరకు సంపుల నుంచి నీటిని తోడేందుకు మోటార్లు, పొలాల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చాల్సి ఉంది. గుత్తేదారు క్షేత్ర స్థాయి నుంచి వెళ్లిపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో వెచ్చించిన రూ.60 కోట్లు వృథాగా పోయాయి.

# చెత్తగుట్టల్లో 'వెలుగు' రేఖలు



ఆదోని : గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా 'చెత్త' నిర్ణయాలతో పట్టణ ప్రజలు అవస్థలు పడ్డారు.. ఇంటింటా చెత్త పన్నుతో జనాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యర్థాలను తొలగించకపోగా క్లాప్ పేరుతో పుర నిధులను కొందిరికి దోచి పెట్టారు. ప్రజా విన్నపాల మేరకు 'కూటమి' ప్రభుత్వం చెత్త పన్ను విధానానికి స్వస్తి పలికింది.. అక్టోబరు 2వ తేదీ నాటికి స్వచ్ఛ పట్టణాలు, నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వ్యర్థాలతో విద్యుత్తు ఉత్పత్తికి ప్రణాళిక రచించారు. ఇలాంటి ప్లాంట్లు విశాఖపట్నం, గుంటూరు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయి.. ఇదే స్ఫూర్తితో త్వరలో కర్నూలులో ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పట్టణాల్లో పోగయ్యే చెత్తను రీసైక్లింగ్‌కుపోగా మిగిలిన వ్యర్థాలు ప్లాంట్‌కు తరలించనున్నారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యాలకు రక్షణతోపాటు భూ, వాయు, నీటి కాలుష్య సమస్యలు దూరమవుతాయని అధికారుల అంచనా.

**శుద్ధికి బిల్లులు ఇవ్వని వైకాపా**

డంపింగ్ యార్డుల్లో పోగైన చెత్తను శుద్ధి చేసేందుకు నిధుల్లేవని గత వైకాపా ప్రభుత్వం చేతులెత్తేసింది. స్పందించిన కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని సూచించింది.

టన్ను చెత్త శుద్ధికి రూ.650 చొప్పున చెల్లిస్తామని టెండర్లు పిలిచారు. నంద్యాల, ఆదోనిలో పనులు ప్రారంభించినా... సకాలంలో బిల్లులు ఇవ్వలేదు.. గుత్తేదారులు చేతులెత్తేశారు. కర్నూలు నగర పాలక సంస్థలో శుద్ధి అనే మాటే లేదు.

క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో ఆటోలు తెచ్చి ఇంటింటి చెత్త సేకరణ పేరుతో ప్రజలపై రుసుం భారాన్ని మోపడంతో చివరికి ప్రజలు వార్డులకు వచ్చిన ఆటోలను అడ్డగించి, ఇచ్చిన చెత్త బుట్టలను అందులోకే విసిరేసి నిరసన వ్యక్తం చేశారు. తెదేపా హయాం (2014-19)లో ఆదోని పట్టణంలో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంట్ విజయవంతంగా నడుస్తోంది. పురపాలికలో పోగైన తడి చెత్తను ఇక్కడికి తరలించి గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు.

**గతంలో ఎన్జీటీ బృందం ఆగ్రహం**

గతంలో ఎన్జీటీ బృంద సభ్యులు పురపాలికల్లో పర్యటించారు. ప్రజల ఆరోగ్యానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు.. డంపింగ్ యార్డుల నిర్వహణను పరిశీలించారు. ఎక్కడా శుద్ధి చేయడం లేదని గుర్తించారు. తక్షణం డంపింగ్ యార్డులను స్వచ్ఛ ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి.. లేదంటే భారీ ఎత్తున జరిమానా విధించాల్సి ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పేరుకుపోయిన చెత్త గుట్టలు**


ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగర పాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలికలు, నగర పంచాయతీలున్నాయి. ఆయా పట్టణాల్లో నిత్యం సగటున 500-600 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది.

కర్నూలు నగరంలో సేకరించిన చెత్తను గార్గేయపురం, నంద్యాలలో పీవీ నగర్, ఆదోనిలో శిరుగుప్ప, ఎమ్మిగనూరులో సోగనూరులోని డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు.

చెత్తను యార్డులకు తరలించి గుట్టలుగా పేరుస్తున్నారు తప్ప శుద్ధి చేయడం లేదు. నిధుల లేమి, సిబ్బంది కొరత, ప్రజారోగ్య విభాగం బాధ్యతారాహిత్యంతో ముందుకు సాగడం లేదు.

ఏళ్ల తరబడి చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో స్థానికంగా భూ, వాయు, నీటి కాలుష్యం తలెత్తుతోంది. అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు చర్మ వ్యాధులు, శ్వాసకోశ సంబంధ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు బారిన పడుతున్నారు.

# పుర పేదలకు గూడు




కర్నూలు : ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామని వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు మాయ చేసింది. జగనన్న కాలనీల పేరుతో ఆ పార్టీ నేతలు దందా చేశారు.. ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకొచ్చిన వారికీ సకాలంలో బిల్లులు ఇవ్వలేదు.. సొంతిళ్ల కోసం పేదలు కళ్లు కాయలు కాసేలా నిరీక్షిస్తున్నారు.. పేదల ఇబ్బందులు గమనించి 'కూటమి' ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. రాష్ట్రంలో పరిస్థితిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.. పీఎంఏవై అర్బన్- 2.0 పథకం కింద ఇళ్ల మంజూరు అంగీకరించింది. మొదటి విడత కర్నూలు మున్సిపాలిటీకి 1,615, మిగిలిన మున్సిపాలిటీలకు కలిపి 4,035 ఇళ్ల మంజూరుకు ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించి మార్చిలో ఉత్తర్వులు రానున్నాయి. ఆయా పట్టణాల్లో 2011 జనాభాను అనుసరించి ఇళ్లు మంజూరు చేసినట్లు తెలుస్తోంది..

**మొదటి విడత పట్టణాలకు**

కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో 55 మండలాలు ఉన్నాయి.. వాటినీ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-2.0 పథకానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారందరూ అర్హులవుతారని మొదట అంచనా వేశారు. కేంద్రం మొదటి విడత కేవలం కర్నూలు కార్పొరేషన్‌తోపాటు మిగిలిన పురపాలికలను పరిగణనలోకి తీసుకొంది.

సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకొనేవారు ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. స్థలాలకు సంబంధించిన పత్రాలు, భార్య, భర్త ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు తదితర పత్రాలు జత చేయాలి. ఇదివరకెన్నడూ తమ పేర్లతో గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు కాకుంటేనే అర్హులవుతారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని హౌసింగ్ ఏఈకి అందించాలి.

**ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు**

గత ప్రభుత్వ హయాంలో ఒక ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చేవారు.. డబ్బులు సరిపోక నిర్మాణానికి చాలా మంది ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీఎంఏవై అర్బన్-2.0 పథకం కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలకు పెంచింది. సొంతిళ్లు లేని వారి వివరాల కోసం సచివాలయ ఉద్యోగులతో నెల రోజుల నుంచి డిమాండ్ సర్వే చేయిస్తోంది. " సొంత స్థలాలున్నాయి.. ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ 2024 డిసెంబరు నాటికి కర్నూలు జిల్లాలో 12,102, నంద్యాలలో 6,420 మంది అర్జీ పెట్టుకొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఇంకా గడువు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

# జనానికి గరళ జలం


నంద్యాల : మంచినీరు అందించేందుకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా జిల్లా వాసులకు కలుషిత నీరే దిక్కవుతోంది. గలగల సేలయేర్లు పారుతున్నా ప్ర'జల'కు మంచినీరు దక్కడం లేదు.. ఇప్పటికీ చాలామంది చేతిపంపులు, చెరువుల నీటిపైనే ఆధారపడుతున్నారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన 'భూగర్భ జల నాణ్యత నివేదిక-2024' పలు ప్రాంతాల్లో నీటి నాణ్యత సరిగా లేదన్న విషయం తేలింది. గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ముందు, అవి వచ్చిన తర్వాత వర్షాలు కురిసిన అనంతరం నమూనాలు సేకరించి పరీక్షలకు పంపితే కొన్నిచోట్ల లోపాలు వెలుగులోకి వచ్చాయి.

**పరీక్షలో ఏం తేలిందంటే**

బేతంచెర్ల, ప్యాపిలి, కొలిమిగుండ్ల, అవుకు, కొత్తపల్లి, జూపాడుబంగ్లా మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఫ్లోరైడ్ స్థాయి లీటరు నీటిలో 1.5 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా ఉంది.

భూగర్భ జలాల్లో ఇనుము 1.0 కి.గ్రా/లీ ఉండాలి. నంద్యాల మండలం మిట్నాల, గుంతనాల, ఉడుమాల్పురం ప్రాంతాల్లో ఇంతకంటే ఎక్కువగా ఉంది. కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లో కుందూనది పరివాహకంలో నీళ్లు రంగుమారి కనిపిస్తున్నాయి. ఆ నీటిని తాగుతున్న వారు విరేచనాలు, వాంతులతో ఆస్పత్రుల పాలవుతున్నారు.

నంద్యాల, ఆళ్లగడ్డ దొర్నిపాడు, రుద్రవరం, శిరివెళ్ల, బండిఆత్మకూరు, వెలుగోడు, చాగలమర్రి మండలాల్లో భూగర్భ జలాల్లో నైట్రేట్ 45 మిల్లీ గ్రాములు/లీ కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వరి సాగు ఎక్కువ. సాగుదారులు అధిక నైట్రోజన్ కలిగిన ఎరువులు వినియోగిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. జల్ జీవం తీశారు రూ.450 కోట్లతో పట్టాలెక్కాల్సిన జల్ జీవన్ మిషన్ వైకాపా



ప్రభుత్వ నిర్వాకంతో అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగా వివిధ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం ప్రతిపాదించినా ఆచరణలో అమలు కాలేదు. దీంతో ఇప్పటికీ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కలుషిత నీటితో ప్రజలు అతిసారం, వివిధ రకాల వ్యాధుల బారినపడుతున్నారు. ప్రత్యేకించి నాపరాళ్ల గనులు అధికంగా ఉన్న ఎర్రమల కొండ ప్రాంతాలతో పాటు వరి సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వాడుతున్న రసాయనాల వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న జిల్లా కేంద్రాల్లో సైతం నీటి నాణ్యత సరిగా లేదని నాణ్యతా పరీక్షల్లో తేలింది.

నేరుగా నదుల్లోకి వదిలేస్తున్నారు నంద్యాల పట్టణంలో చామకాల్వ, మద్దిలేరు, పాలేరు వాగులు కలుషితమవుతున్నాయి. ఆ మురుగంతా నేరుగా కుందూనదిలో కలుస్తోంది. నంద్యాల పట్టణ శివార్లలోని విత్తన శుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్రమాదకర రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలు నేరుగా కేసీ కాల్వలోకి వదులుతున్నారు. జిల్లాలో చాలా చోట్ల సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాలు, మురుగునీటిని నేరుగా సాగునీటి కాలువల్లో కలిపేస్తున్నారు. ఇవన్నీ కాలుష్యానికి కారణమవుతున్నాయి.

# 'ఓపి'కలేని వైద్యులు!

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్యులు రోగులకు నాలుగు గంటలపాటు ఓపీ సేవలందించాల్సి ఉండగా, కేవలం రెండు గంటల్లోనే మమ అనిపిస్తున్నారు. ఫలితంగా పూర్తిస్థాయిలో వైద్యసేవలందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ఓపీ సేవలందించాల్సి ఉండగా, ఇందుకు భిన్నంగా జరుగుతోంది. పలువురు వైద్యులు 10 గంటలకు వచ్చి 12 గంటలు కాగానే ఓపీ చీటీలివ్వడం ఆపేస్తున్నారు. రోగులకు అందే సేవల్లో రెండు గంటలు కోత పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రోగులు వాపోతున్నారు. వైద్యులు తాము చెప్పింది పూర్తిగా వినకుండానే పరీక్షించి మందులు రాసి పంపేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వైద్యులు సరైన సమయానికి హాజరై పూర్తిస్థాయిలో పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో పూర్తిగా నాలుగు గంటలపాటు ఓపీ సేవలు అందించాల్సిందేనని, వెంటనే విచారించి వైద్యులు సరైన సమయానికి వచ్చి ఒంటిగంట వరకు ఓపీ సేవలందించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# కార్పొరేషన్లకు మోక్షం!

కడప: గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వివిధ కార్పొరేషన్లు కళకళలాడబోతున్నాయి. అయిదేళ్ల అనంతరం లబ్ధిదారులకు రాయితీపై రుణాలు మంజూరు చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాయితీ రుణాలకు జిల్లాలోని లబ్ధిదారులైన బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు వర్గాలు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. జిల్లాలో వివిధ రూపాల్లో 2 వేల యూనిట్ల స్థాపనకు రాయితీ రుణాలు అందించడానికి చర్యలు చేపట్టింది. యూనిట్ల కింద రూ.43.50 కోట్ల మేర రుణాలు ఇవ్వనుండగా, ఈ మొత్తంలో 50 శాతం లబ్ధిదారులకు రాయితీ లభించనుంది. కాపు వర్గానికి చెందినవారు ఎంఎస్ఎంఈ యూనిట్ల స్థాపనకు సహకారం అందించనుంది. వీటితోపాటు రూ.8 లక్షల యూనిట్ విలువతో జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించనుంది. ఇందులో రూ.4 లక్షలు రాయితీ లభించనుంది. ఇలా 57 మంది బీ ఫార్మసీ చేసిన నిరుద్యోగులకు జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటుకు రుణాలు అందజేయనున్నారు. గత అయిదేళ్లుగా వైకాపా సర్కారు రూపాయి కూడా కార్పొరేషన్ల కింద రుణాలు ఇవ్వలేదు. పైగా గత తెదేపా ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన రుణాలను లబ్ధిదారుల మెడపై కత్తిపెట్టి మరీ వసూలు చేసింది. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి కార్పొరేషన్లకు పూర్వ వైభవం వచ్చింది. రుణాలను విడుదల చేసి ఫిబ్రవరిలో యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. బీసీ, ఈబీసీ, కాపు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) కులాల కింద లబ్ధిపొందడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నా



రు. అర్హత గల లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డులు, ఆదాయ ధ్రువీకరణ, కుల పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో %apobmm% (వెబ్‌సైట్ ద్వారా ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**వీటికి ప్రాధాన్యం:** చేతి వృత్తులు, పాడి, చిన్న తరహా కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, డెయిరీ యూనిట్లకు రుణాలు ఇవ్వనున్నారు. వీటితో పాటు జనరిక్ దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తున్నారు. రాయితీ మొత్తం ప్రభుత్వం ఇవ్వనుండగా.. మిగిలిన 50 శాతం సాయాన్ని రుణంగా బ్యాంకుల నుంచి ఇప్పించనుంది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హౌస్ కీపింగ్, ఫుడ్ అండ్ బేవరేజస్ సర్వీస్, సెక్యూరిటీ గార్డులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇలా వేలాది మందికి లబ్ధి కలిగేలా కార్యాచరణ ప్రణాళిక జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సంఘం లిమిటెడ్ రూపొందించింది.

# చెత్త బిన్‌లతో ప్రమాదాలు!

రాయచోటి : జిల్లా కేంద్రమైన రాయచోటి పురపాలక సంఘం పరిధిలో వాణిజ్య, వ్యాపార సముదాయాలు, ప్రధాన రహదారులు వెంబడి చెత్త సేకరణకు పురపాలక సంఘం అధికారులు చెత్త బిన్‌లు ఏర్పాటు చేశారు. వీటి నుంచి చెత్తను సేకరించేందుకు మూడు వాహనాలు సైతం ఉన్నాయి. వీటి ద్వారా సిబ్బంది ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో విడతల వారీగా చెత్తనిల్వలు సేకరిస్తారు. చెత్తసేకరణ చేసిన అనంతరం వీటిని యథాస్థానంలో ఉంచకుండా నిర్లక్ష్యంగా రహదారుల మధ్యలో వదిలేస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా రెండు రోజుల కిందట రాయచోటి ఆర్టీసీ బస్టాండు మార్గంలో ప్రధాన రహదారి పక్కన ఉ



ంచిన చెత్త బిన్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. బస్సు మరమ్మతులకు రూ.20 వేల వరకు ఖర్చయిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. చెత్తకుండీల కారణంగా ప్రమాదాలు సంభవించి వాహనదారులకు గాయాలవుతున్నాయి.

పట్టణంలో వాణిజ్య, వ్యాపార సముదాయాలున్న గాంధీ బజారు, కంసల వీధి, బస్టాండు ప్రాంతం, గాలివీడు రోడ్డు మదనపల్లె రోడ్డు, చిత్తూరు రోడ్డు, జగదాంబ సెంటర్, కొత్తపేట, మార్కెట్ వీధి తదితర ప్రాంతాల్లో సుమారు 40 వరకు చెత్త బిన్‌లు ఉన్నాయి. వీటి నుంచి సిబ్బంది చెత్తను సేకరించిన తరువాత రోడ్ల మధ్యలో వదిలేస్తుండడంతో నిరంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ వాసుబాబు మాట్లాడుతూ పట్టణంలోని రహదారులకు అడ్డంగా ఉన్న చెత్త బిన్‌లను వెంటనే తొలగిస్తామన్నారు.

# సమరానికి సై.. తగ్గేదేలే!

నూజివీడు : సంక్రాంతి పండగ సమీపించిన నేపథ్యంలో కోడి పందేల నిర్వాహకులు బరులు సిద్ధం చేసుకుంటున్నారు. పందేలు నిర్వహించడానికి వీల్లేదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నాయి. పోలీసులు కూడా పందేలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. గతంలో నిందితులుగా ఉన్నవారిని బైండోవర్ చేశారు. కానీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చివరిలో చేతులెత్తేస్తున్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఏటా కోడి పందేలు జోరుగా సాగుతున్న విషయం బహిరంగ రహస్యమే. ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోని అనేక గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన, ఏడాది పొడవు పెంచిన కోడి పుంజులను పందేలకు సిద్ధం చేస్తున్నారు. పందేల్లో పాల్గొనడానికి నూజివీడు చుట్టుపక్కల నుంచే కాకుండా పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లా నుంచి కూడా వేలాది మంది వస్తారు. ముసునూరు మండలంలోని లోపూడి, గోపవరం, కాట్రేనిపాడు, చెక్కపల్లి, గుడిపాడు, చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల, చింతలవల్లి, ఆగిరిపల్లి మండలంలోని చిన్న ఆగిరిపల్లి, అడవి నెక్కలం, అమ్మవారిగూడెం,



ఈదర, నూజివీడు మండలంలోని హనుమంతుల గూడెం, తుక్కులూరు, పోతురెడ్డిపల్లి, సుంకొల్లు, చాట్రాయి మండలంలోని జనార్దనవరం, చిన్నంపేట తదితర ప్రాంతాల్లో కోడి పందేల బరులు సిద్ధమయ్యాయి.

**యథేచ్ఛగా జూదం**

ఒక్క కోడి పందేలే కాకుండా కోతముక్క, లోన.. బైట, గుండాట, పేకాట తదితర జూదాలు యథేచ్ఛగా నిర్వహిస్తుంటారు. ఆ సమయంలో మద్యం, నాటుసారా కూడా ఏరులై పారుతుంది. పండగ మూడు రోజులు లక్షలాది రూపాయలు చేతులు మారతాయి. కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్‌కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో ఎస్సై, తహసీల్దార్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బరులను ధ్వంసం చేశారు.

**చర్యలు తప్పవు...**నూజివీడు సబ్ డివిజన్‌లో కోడి పందేలు, జూదాలు నిర్వహించకుండా ఇప్పటికే చర్యలు చేపట్టాం. బరులు ధ్వంసం చేస్తున్నాం, బైండోవర్ కేసులు నమోదు చేశాం. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
కేవీవీఎన్‌వీ ప్రసాద్, డీఎస్పీ, నూజివీడు.

# వంతెనల ఊసే లేదు!

భీమవరం : భీమవరం పట్టణ పరిధిలో గోస్తనీ– వేల్పూరు కాలువపై 72 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన ఇది. 12 ఏళ్ల కిందట ఈ వంతెనకు ఇరువైపులా కొంత భాగం శిథిలం కావడంతో తాత్కాలికంగా ఇసుక బస్తాలు, సర్వీబాదులు, వెదురు తడికెలు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందట పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో మధ్య ఎర్ర కంకర వేసి వదిలేశారు. ప్రస్తుతం ఈ వంతెన పరిస్థితి దారుణంగా ఉంది. పశ్చిమలో సాగు, మురుగు కాలువలపై ఉన్న అనేక వంతెనలు శిథిలస్థితికి చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దశాబ్దాల కిందట నిర్మించిన వీటికి ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు కూడా లేవు. రహదారుల విస్తరణ, అభివృద్ధికి రూ. వందల కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వాలు వీటి ఊసైనా ఎత్తడం లేదు. గత అయిదేళ్లు వైకాపా పాలనలో వీటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు.

పెనుమంత్ర మండలం మాముదూరు వద్ద గోస్తనీ కాలువపై నిర్మించిన వంతెన శిథిలమైంది. కింది భాగం దెబ్బతినడంతో వాహనాల



రాకపోకల సమయంలో ప్రకంపనలు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆచంట– పెంటపాడు రహదారిలో గోస్తనీ– వేల్పూరు కాలువపై బ్రాహ్మణ చెర్వులో, నరసాపురం కాలువపై మార్టేరులో ఉన్న పాత వంతెనలు, వాటి రక్షణ గోడలు దెబ్బతిన్నాయి.

కలిదిండి మీదుగా భీమవరం నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన రహదారిలో కోపల్లె వద్ద బొండాడ డ్రెయిన్‌పై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన బాగా ఇరుకుగా మారడంతో పాటు శిథిలమైంది. దీనికి గతంలో నిధులు కేటాయించినా పనులు మాత్రం జరగలేదు.

**జిల్లాలో ఇలా..**

ప్రధాన వంతెనలు (సుమారు) 172
శిథిలస్థితికి చేరినవి 46
ప్రమాదకరంగా ఉన్నవి 21

పాలకొల్లు శివారులో నరసాపురం కెనాల్‌పై పాతికేళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన నిర్వహణను గత అయిదేళ్లుగా పట్టించుకోలేదు. రెయిలింగ్ దెబ్బతినడంతో పురపాలక అధికారులు ఇటీవల ఇలా కర్రలు కట్టించి వదిలేశారు. భీమవరం– తాడేపల్లిగూడెం ప్రధాన మార్గంలో గరగపర్రు వద్ద ఉండి కెనాల్‌పై 1933లో నిర్మించిన ఈ వంతెన క్రమంగా శిథిలమవుతోంది. దీనిపై అనేకసార్లు భారీ వాహనాలు ఇరుక్కుపోయి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిన ఘటనలు ఉన్నాయి. పలు సందర్భాల్లో ప్రమాదాలు జరిగాయి. యుద్ధ ప్రాతిపదికన ఇక్కడ నూతన వారధి నిర్మించాల్సిన అవసరం ఉంది.

**ప్రతిపాదనలు పంపాం**

పలు చోట్ల వంతెనలు అధ్వానంగా ఉన్నాయి. గతంలో కొన్ని వంతెనల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. నిధులు విడుదల చేస్తే శాఖాపరంగా పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. రామరాజు, ఆర్అండ్‌బీ ఇన్‌ఛార్జి ఈఈ

# చేనేతకు చేయూత..



పుత్తూరు : ఆదరణలేక నానాటికి కుదేలవుతున్న చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జవసత్వాలు నింపుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చేనేతల అభ్యున్నతికి చర్యలు చేపడుతోంది.. గత వైకాపా ప్రభుత్వం చేనేతలకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు.. ఏడాది రూ.24 వేలు ఇచ్చి కొందరికే ఇచ్చి చేతులు దులుపుకొంది.. పలుమార్లు అర్హులు తమకు రూ.24 వేలు వర్తింపజేయాలని వినతులు ఇచ్చినా వాటిని బుట్టదాఖలు చేశారు.. గతేడాది తుపాను కారణంగా పనుల్లేక పస్తులున్నా ఆదుకున్న పాపాన పోలేదు.. ఈ నేపథ్యంలో చేనేతల కుటుంబపోషణ కష్టసాధ్యంగా మారింది.. 2019లో అధికారంలోకి వస్తే చేనేతలకు ఉచిత విద్యుత్తు ఇస్తామన్న హామీ నెరవేరలేదు.. ఎన్నికల ప్రచారంలో చేనేతలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రకటించారు.. ఈ మేరకు చేనేత కార్మికులు వంద యూనిట్ల లోగా వినియోగించుకుంటే ఉచిత విద్యుత్తును వర్తింపజేస్తున్నారు. దీంతో చేనేత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5,500 చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఆ రంగంపై ఆధారపడి మరో 10వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో పెనుమూరు, నగరి మండలంలోని మాంగాడు, పలమనేరు తిరుపతి జిల్లాలో పుత్తూరు మండలం గొల్లపల్లి, నారాయణవనం మండలంలోని నారాయణవనం, పాలమంగళం, ఉత్తరం, దక్షిణం, వరదయ్యపాళెం, సత్యవేడు, వెంకటగిరి, పాపానాయుడుపేట, శ్రీకాళహస్తి, బీ.ఎన్ కండ్రిగ తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులున్నారు. ఈ కుటుంబాలు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పొందేందుకు అర్హులు. ఇప్పటికే చిత్తూరు జిల్లాలోని పెనుమూరు, నగరి ప్రాంతాల్లో పలు కుటుంబాలు ఉచిత విద్యుత్తుకు సంబంధించి సంబంధిత శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా పలు కుటుంబాలు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేనేత మగ్గాలకు మాత్రమే 100 యూనిట్లు లోగా వాడితే పూర్తిగా బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. చేనేత కార్మికులు దరఖాస్తుతో పాటు గుర్తింపుకార్డు జత చేసి ఇస్తే 100 యూనిట్ల లోగా వాడితే అతడికి ఆ పథకం కింద ఉచిత విద్యుత్తు వర్తిస్తుంది. 100 యూనిట్లు దాటితే మొత్తం బిల్లు చెల్లించాల్సిందే. ప్రభుత్వ ఇచ్చిన హామీతో చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించినట్లే.

**అవగాహన కల్పించాలి..**

జిల్లాలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం 100 యూనిట్లు ఉచితం అందిస్తున్నట్లు అవగాహన కల్పించాలి. తద్వారా ఆ కుటుంబాలన్ని కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్తు అందించడం ఎంతో సంతోషంగా ఉంది.
కుప్పయ్యశెట్టి, జిల్లా గౌరవాధ్యక్షుడు, చేనేత కార్మిక సంఘం

**సద్వినియోగం చేసుకోవాలి..**

2018లో తెదేపా హయాంలోనే 100 యూనిట్లులోపు విద్యుత్తు వినియోగించుకుంటే ఉచితం. అయితే 2019లో రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ జీవోను పక్కన పెట్టేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ అమలు చేస్తున్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వెంకటముని, జిల్లా ఉపాధ్యక్షుడు. చేనేత కార్మిక సంఘం

# నత్తనడకన ఎంఎస్‌ఎంఈల సర్వే



అనంతపురం : ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) ర్యాంపు సర్వే ఉమ్మడి అనంత జిల్లాలో నత్తతో పోటీ పడుతోంది. క్షేత్రస్థాయి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ల నిర్లక్ష్యం.. బాధ్యతారాహిత్యం మూలంగా ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. సందట్లో సడేమియాగా గ్రామవార్డు సచివాలయాల సిబ్బంది సైతం శ్రద్ధ చూపడం లేదు. కేవలం 20 రోజులే గడువు ఉండేది. ఈలోపు వంద శాతం పూర్తి చేస్తారా లేదా అన్నది అనుమానమే. ఎంఎస్‌ఎంఈలు తక్కువ సంఖ్యలో ఉన్న మండల ప్రాంతాల్లోనూ సర్వేలో వేగం పుంజుకోలేదు. పట్టణ ప్రాంతాల్లో ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఎంఎస్‌ఎంఈల సర్వే ద్వారా 'ఉద్యమ్' గుర్తింపు సంఖ్య వచ్చిన తర్వాత ఖయిలాపడినా, నష్టాల్లో పరిశ్రమలకు బహుళ ప్రయోజనాలు ఒనగూరుతాయి. అన్ని విధాల ఆదుకోడానికి ఈ సర్వే ఎంతో కీలకం. అయినా సరే.. ఎంఎస్‌ఎంఈల సర్వే పురోగతి దయనీయంగా మారడం గమనార్హం.


**47,651 పరిశ్రమలే పూర్తి**

ఉమ్మడి అనంత జిల్లాలో ఈ సర్వే నవంబరు 29న మొదలైనా డిసెంబరు 2 నుంచి పూర్తి స్థాయిలో ఆరంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ నాటికి సర్వే ప్రక్రియ ముగియనుంది. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో మొత్తం 1,51,220 ఎంఎస్‌ఎంఈలు ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. ఇప్పటి దాకా 47,651 ఎంఎస్‌ఎంఈలను సర్వే పూర్తి చేయగా.. 37,198 పరిశ్రమలకు ఉద్యమ్ గుర్తింపు సంఖ్య ఇచ్చారు. మిగతా 10,453 పరిశ్రమలు మూతపడ్డాయి.

**ఆ 'ఐదు' అధ్వానం**

అనంత జిల్లాలో మండల, పట్టణాలు 37 ఉంటే.. కేవలం ఐదు ప్రాంతాల్లో మాత్రమే కొద్దిమేర పర్వాలేదు. గుంతకల్లు పట్టణం, అనంత నగరం, గుత్తి, కంబదూరు, కళ్యాణదుర్గం పట్టణం.. వంటి ప్రాంతాల్లో మరీ అధ్వానంగా సర్వే నడుస్తోంది. గుంతకల్లు పట్టణంలో కేవలం 9.36 శాతమే పూర్తి కావడం గమనార్హం. అనంత నగరంలో 13.23, గుత్తిలో 20.38 శాతం ప్రకారమే సర్వే పూర్తి అయింది. కంబదూరు, కళ్యాణదుర్గం పట్టణం, యాడికి, బీకే సముద్రం, గుత్తి పట్టణం, ఉరవకొండ మండలాల్లో 30 శాతం మించలేదు. ఒక్క కుందుర్పిలో మాత్రమే 97.64 శాతం, పామిడిలో 91.55, పెద్దపప్పూరు విడపనకల్లు, రాయదుర్గం, వజ్రకరూరు, వంటి చోట్లా 75 శాతంపైగా సర్వే పూర్తి చేసినట్లు నమోదు అయింది. ఎంఎస్‌ఎంఈల సర్వే వేగం పుంజుకోడానికి కలెక్టర్ రోజూ సమీక్ష చేస్తున్నారని డీఐసీ జీఎం శ్రీధర్ తెలిపారు. రాష్ట్రంలో ఆశించిన స్థానంలో ఉన్నామన్నారు.

# పౌరుల లెక్క పక్కా




కర్నూలు : " పౌరుల వివరాలు పక్కాగా ఉండాలి.. వలసెళ్లిన వారు ఎక్కడున్నారో కచ్చితంగా తెలుసుకోవాలి.. మృతిచెందిన వారి వివరాలు నమోదు చేయాలి.. నమోదుకాని కుటుంబాల వివరాలు 'యాప్'లో చేర్చాలని అధికారులు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నవంబరు– డిసెంబరు మధ్య సచివాలయ సిబ్బందితో ఇంటింటి సర్వే చేయించారు. వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. వివరాలు తప్పులతడకగా ఉండటంలో పునఃపరిశీలనకు ప్రభుత్వం ఆదేశించింది.

**వివరాలు తప్పులమయం**

సచివాలయ సిబ్బంది నవంబరు 6 నుంచి 30 వరకు సర్వే చేశారు. ఇళ్లు, కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కర్నూలు జిల్లాలో 7,36,862, నంద్యాలలో 5,97,468 కుటుంబాల లెక్కను పంపించారు. ఇందులో 5,22,354 పౌరుల వివరాలు సరిగా లేవు పునః పరిశీలించాలని ఆదేశించారు. డిసెంబరు నాటికి 1,24,309 మంది వివరాలు నమోదు చేశారు. వీటిలో భారీగా లోపాలు ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించి 3.98 లక్షల మంది పౌరుల వివరాలు పునః పరిశీలన చేయాలని ఆదేశించారు.

**వలసెళ్లినవారు ఎక్కడున్నారు**

జిల్లాల్లోని కొన్ని ఇళ్ల వివరాలు తప్పుగా నమోదైనట్లు గుర్తించి ప్రభుత్వం వెనక్కి పంపించింది. వాటికి సవరణ చర్యలు చేపట్టారు. మృతుల వివరాలను వలసలు వెళ్లినట్లు కొన్నింటిని నమోదు చేయడంతో వారికి పింఛన్లు, తదితర ప్రభుత్వ పథకాలు అందే అవకాశాలున్నాయి. వాటిని సవరించాలి. వలసలు వెళ్లిన వారు ఏ జిల్లాలో ఉన్నారు ?, ఇతర రాష్ట్రాలకు వెళ్లారా..?, అనే వివరాలు సర్వేలో పొందుపర్చలేదు. ఆ వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.

**కదలని సచివాలయ ఉద్యోగులు**

ఉమ్మడి జిల్లాలో 9,566 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. అందులో నిత్యం 2,500 మంది గైర్హాజరు కావడంతో సర్వే నత్తను తలపిస్తోంది. పునఃపరిశీలన ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నారు. కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారులు సచివాలయ ఉద్యోగులను పురమాయిస్తున్నా.. పౌరుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం నెలకొంది.

**కొత్తగా కుటుంబాల నమోదు**

కొత్తగా కర్నూలు జిల్లాలో 8,094, నంద్యాలలో 3,981 కలిపి మొత్తం 12,075 కుటుంబాలను కొత్తగా కుటుంబ సర్వేలో నమోదు చేశారు. ప్రభుత్వం యునిక్ రికార్డు మిస్సింగ్ సిటిజన్స్‌ని మరో మారు పునఃపరిశీలించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. సచివాలయ ఉద్యోగులతో ఈ ప్రక్రియ చేపడుతున్నామని, పౌరుల గుర్తింపు పరిశీలన కొనసాగుతోందని జిల్లా అధికారులు చెబుతున్నారు.

# చేరువలో రక్తశుద్ధి సేవలు

ఆకివీడు : ఉండి నియోజకవర్గ, కొల్లేరు తీర ప్రాంతా గ్రామాల వాసులకు రక్తశుద్ధి (డయాలసిస్) సేవలు చేరువకానున్నాయి. మూత్రపిండాల రోగుల సంఖ్యకు తగ్గట్టుగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు లేవు. దీంతో బాధితులు దూర ప్రాంతాల్లో ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఉండి నియోజకవర్గ పరిధిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాయని గతంలో ఎమ్మెల్యే, ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు ప్రకటించారు. ఆయన చొరవ తీసుకొని దాతల సహకారంతో ఆకివీడు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయించారు. **రూ. 65 లక్షల వ్యయంతో..**ఈ కేంద్రాన్ని ఏర్పాటుకు ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన వైద్యుడు దాట్ల సత్యనారాయణరాజు ముందుకు వచ్చారు. ఆయన కుమారుడు దివంగత విశ్వనాథరాజు, కోడలు పద్మసుందరిల జ్ఞాపకార్థం రూ.65 లక్షల వ్యయంతో 4 పడకలతో ఈ కేంద్రాన్ని నెలకొల్పారు. ఒకే సారి నలుగురు రోగులకు డయాలసిస్ చేసేలా పరికరాలు సమకూర్చారు. ఈ కేంద్రానికి నిరాటంకంగా విద్యుత్తు సరఫరా అయ్యేలా సీపీయూ యూనిట్, నీటి శుద్ధికి ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దాత సత్యనారాయణరాజు గతం నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

# కొల్లేరులో కృత్రిమ సాగు

కైకలూరు : నిత్యం పక్షుల కిలకిలరావాలతో సందడిగా ఉండే కొల్లేరులో సంప్రదాయం ముసుగులో నిబంధనలను తుంగలో తొక్కి కృత్రిమ సాగుకు తెర తీస్తున్నారు. కొల్లేరు కాంటూర్ పరిధిలో 2006 ఆపరేషన్‌లో కొట్టేసిన భూముల్లో జీరో సైజు చేపపిల్లల సాగు చేస్తున్నారు. పక్షుల ఆవాసాలకు, ఆహార సేకరణకు విఘాతం కలిగించేలా చర్యలు చేపడుతున్నా పట్టించుకున్న నాథ%రి%్నడు కనిపించడం లేదు. కొట్టేసిన చెరువుల్లో గట్లు వేసి వాటిలో నీటిని నింపి చేపలు పెంచుతున్నారు. హాని కారకమైన రసాయనాలతో పాటు తవుడు, ఇతర మేత అందిస్తున్నారు. కొల్లేరులో మేత కర్రలు పెట్టి, పడవలపై మేతలు వేసుకుని మూటలు కడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో అక్రమాలకు అదుపు లేకుండా పోతోంది.

**సాగు ఇలా..** కైకలూరు మండలంలోని చెటాకాయ్‌లో 400 ఎకరాలు, నత్తగుల్లపాడు 200, పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప 250, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోటలో 200, శృంగవరప్పాడు 400, గుమ్మళ్లపాడు 200 ఎకరాల్లో, మండవల్లి మండలంలోని కొవ్వాడలంకలో 250, చింతపాడులో 300, పులపర్రులో 250, నుచ్చుమిల్లి 150, తక్కెళ్లపాడులో 150, పెనుమాకలంకలో 200, నందిగామల



ంకలో 250 ఎకరాల్లో కృత్రిమ సాగు చేస్తున్నారు.

**విలవిల్లాడుతున్న పక్షులు, పశువులు..**

కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న పక్షులకు, పశువులకు ప్రస్తుతం గడ్డుకాలం నడుస్తోంది. కొల్లేరులో ఉప్పు నీరు పెరిగిపోవడంతో చేపలు మృత్యువాత పడటంతోపాటు వృద్ధి తగ్గి పోతోంది. దీంతో ఖండాలు దాటి సంతానోత్పత్తికి వస్తున్న పక్షులు అర్ధాంతరంగానే వెనుతిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. విషతుల్యంగా మారిన నీటిలో పక్షులకు పూర్తి స్థాయిలో ఆహారం లభించక పోవడంతో అర్ధాకలితో బక్కచిక్కి పోతున్నాయి.

**జీవో 120కి విఘాతం**

జీవో 120 ప్రకారం కొల్లేరు పరివాహక ప్రాంతంలో కృత్రిమ సాగు చేయడం, భారీ యంత్రాలతో తవ్వకాలు, శబ్దాలు చేసే ఇంజిన్ల ఏర్పాటు నిషిద్ధం. కానీ మండవల్లి, కైకలూరు మండలాల్లోని చాలా గ్రామాల్లో కొల్లేరు మధ్యలో ఆయిల్ ఇంజిన్లు పెట్టి కొట్టేసిన చెరువుల్లో నీటిని బయటకు తోడుతున్నారు. ఆయా చెరువుల వద్దకు వస్తున్న పక్షులను బెదిరిస్తూ చేపల సాగు చేస్తున్నారు. దీనిపై అటవీ రేంజర్ రామలింగాచార్యులును వివరణ కోరగా నిఘాను పెంచి కొల్లేరు పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. డీఎఫ్‌వో విజయను సంప్రదించగా అక్రమసాగును అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జడ్పీలో 'లెక్క'లేనంత నిర్లక్ష్యం!

ఒంగోలు : ప్రజాధనాన్ని బాధ్యతాయుతంగా ఖర్చు చేయడం.. ప్రతి పైసాకు లెక్కలు చూపడం అధికారుల విధి. వైకాపా ప్రభుత్వంలో ఓ అధికారి ఈ విషయాన్ని విస్మరించారు. 'జాలి' గుండెతో నిధులు మళ్లించారు. నిబంధనలకు నీళ్లొదిలి ముందస్తు చెల్లింపులు చేశారు. అకారణంగా ఖర్చవుతున్నా చూస్తుండిపోయారు. తామెవరికీ ఏం చెప్పాల్సింది లేదంటూ 'లెక్క'లేనితనం ప్రదర్శించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పులు వెలుగు చూస్తున్నాయి. అప్పటి అధికారులేమో బదిలీ అయ్యారు. ఆ స్థానంలో వచ్చిన వారేమో చర్యలు తీసుకోకుండా 'చిరు'నవ్వులే సమాధానంగా అనిపిస్తు న్నారు.

**ఏం పనులు చేశారో తెలియదు:** బీపీసీఎల్ ఆధ్వర్యంలో కృష్ణపట్నం ఓడరేవుకు మల్టీ ప్రొడక్ట్ పెట్రోలియం పైపులైన్ నిర్మాణాన్ని రెండేళ్ల క్రితం చేపట్టారు. తవ్విన రహదారుల పూడ్చివేతకు సెక్యూరిటీ డిపాజిట్ కింద 2021లో జడ్పీ ఖాతాకు రూ.52 లక్షలు అందించారు. 2022లో అప్పటి జడ్పీ సీఈవో జాలిరెడ్డి వీటిని ఖర్చు పెట్టారు. ఆ నిధులతో ఏం పనులు చేశారని తెలిపే దస్త్రాలు లేవు. లెక్కలు చెప్పలేదు. అధికారులు మాత్రం అప్పటి జడ్పీ సీఈవో బదిలీపై వెళ్లారని, లేఖ రాశామంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

**బిల్లులు సమర్పించింది లేదు:** జడ్పీ జీపీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.2.81 కోట్లను వివిధ పనుల పేరిట పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు రెండేళ్ల క్రితం ముందుగానే చెల్లించారు. నిబంధనలు పాటించలేదు. ఇంజినీరింగ్ అధికారులేమో ఆ నిధులను ఏ పనులకు వెచ్చించారు.. ఎంబీ రికార్డులు, బిల్లులను జడ్పీ అధికారులకు సమర్పించలేదు. నిధుల ఖర్చు, పనుల వివరాలు, నోట్‌కామ్ చిత్రాలు, ఎవరికి, ఎప్పుడు డబ్బు చెల్లించారు, ప్రస్తుత పని స్థితిపై నివేదిక ఇవ్వాలని జడ్పీ సీఈవోనే గత నెల 31న పీఆర్ ఈఈకి లేఖ రాశారు. నేటికీ సమాధానం లేదు.

**ఇష్టారీతిన విధులు:** ఫారిన్ సర్వీస్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉద్యోగులు ఇతర శాఖలో పనిచేస్తుంటారు. ఇందుకు జడ్పీ సీఈవో, తర్వాత కమిషనర్ అనుమతి అవసరం. అయిదేళ్ల అనంతరం తిరిగొచ్చి ఆరు నెలలు పూర్వస్థానంలో పనిచేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు అమలు కావడం లేదు. సుమారు 15 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఈవోలు, సూపరింటెండెంట్లు, టైపిస్టులు ఫారిన్ సర్వీసులో భాగంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు, డ్వామా, మెప్మా, మైనార్టీ కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. వీరిలో అయిదేళ్లు దాటినా వారూ ఉన్నారు. అయినా చర్యలు లేవు.

**రెండుసార్లు రుణం చెల్లింపు:** రెండేళ్ల కిందట సుమారు పది మంది వరకు జీపీఎఫ్ రుణం తీసుకున్నారు. వీరికి రూ.99.50 లక్షలను రెండుసార్లు చెల్లించారు. ఇందులో ముగ్గురు ఉద్యోగుల పాత్ర ఉంది. తప్పును ఆలస్యంగా తెలుసుకొని.. పది మందిని బతిమిలాడుకొని మళ్లీ రాబట్టారు. ఆ మొత్తానికి జడ్పీ రెండు నెలలపాటు వడ్డీ కోల్పోవాల్సి వచ్చింది. ఏడాది కిందట ఈఎల్(యర్న్ లీవ్స్) పేరిట రూ.1.80 లక్షలను రెండు సార్లు చెల్లించారు. నేటికీ విషయం తెలియదు. ఇటీవల సీఎఫ్‌ఎంఎస్ అధికారులు గుర్తించి లేఖ ఇచ్చారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం:** చిరంజీవి, జడ్పీ సీఈవో

బీపీసీఎల్ నిధులు రూ.52 లక్షలకు సంబంధించి గత జడ్పీ సీఈవో నుంచి బిల్లులు ఇంకా అందలేదు. వచ్చిన వెంటనే పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం. పీఆర్ ఈఈకి ఇచ్చిన ముందస్తు చెల్లింపుల నివేదికపై మరోసారి నివేదిక కోరుతాం. ఫారిన్ సర్వీసు అధికారుల వివరాలు తెలుసుకుని వెనక్కి రప్పిస్తాం. గతంలో సాంకేతిక తప్పిదంతో రెండుసార్లు బిల్లులు చెల్లించడంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

చురకలు



## ఆరంజ్ అందాల మీనూ ని చూశారా!

2021లో 'ఇచట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలను ఈ అమ్మడు సొంతం చేసుకుంది. మొదటి సినిమా కమర్షియల్‌గా నిరాశ పరచినా ఆ తర్వాత ఖిలాడి, హిట్ 2 సినిమాల్లోనూ ఆఫర్లు దక్కించుకోవడం ద్వారా టాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకుంది. గత ఏడాది ఈ అమ్మడికి అత్యంత కీలకమైన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. 2024 ఆరంభంలో మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'గుంటూరు కారం' సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. గుంటూరు కారం సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచిన ఆ తర్వాత వచ్చిన సినిమాలతో మీనాక్షి చౌదరికి మంచి గుర్తింపు లభించింది. ముఖ్యంగా ఏడాది చివర్లో వచ్చిన 'లక్కీ భాస్కర్' సినిమా భారీ విజయాన్ని తెచ్చి పెట్టింది. ఆ తర్వాత వచ్చిన మట్కా, మెకానిక్ రాకీ సినిమాలు సైతం మీనాక్షి చౌదరిని ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. గత ఏడాది చేసిన సినిమాలన్నీ ఒక ఎత్తు అయితే 2025 సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా మరో ఎత్తు. వెంకటేష్ తో కలిసి నటించిన మీనాక్షి చౌదరికి కెరీర్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయం దక్కింది. రూ.300 కోట్ల వసూళ్లు సాధించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మీనాక్షి చౌదరి ఫుల్ బిజీ కాబోతుంది. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో మీనూ పాత్రలో పోలీస్



ఆఫీసర్‌గా కనిపించి మెప్పించింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. సోషల్ మీడియాలోనూ ఈ అమ్మడి క్రేజ్ విపరీతంగా పెరిగింది. తాజాగా మీనాక్షి చౌదరి షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆరంజ్ కలర్ ఔట్ ఫిట్‌లో మీనాక్షి చౌదరి నడుము ఒంపులు చూపిస్తూ నాభి అందాలతో మతి పోగొడుతోంది. ఈ రేంజ్ అందంగా ఉండటం వల్లే మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018లో కిరీటాన్ని సొంతం చేసుకుంది. సాధారణంగా ముద్దుగుమ్మలు అందాల కిరీటం దక్కించుకుంటే హీరోయిన్‌గా రాణించడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. మీనాక్షి చౌదరి ఆ అరుదైన జాబితాకి చెందుతుంది. ఫెమినా మిస్ ఇండియాలో నెగ్గిన తర్వాత సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి మెల్ల మెల్లగా నిలదొక్కుకుని వస్తుంది. ఈమధ్య కాలంలో ఈ అమ్మడు చేసిన సినిమాలు విజయాన్ని సొంతం చేసుకోవడంతో మరింత బిజీ కానుంది. ఈ ఏడాదిలో ఈమె ఖాతాలో స్టార్ హీరోల సినిమాలు పడే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతానికి నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న ఒక సినిమాలో నటిస్తోంది. తమిళ్‌లోనూ ఈ అమ్మడు ఒక సినిమాను చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఈ ఏడాదిలో మీనాక్షి చౌదరి నుంచి మూడు నాలుగు సినిమాలు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## నా వ్యాఖ్యలను ఎవరూ తప్పుగా అనుకోవద్దు: అనసూయ

జబర్దస్త్ షో ద్వారా అనసూయ బాగా పాపులరైన విషయం తెలిసిందే. ఆ షోలో తన యాంకరింగ్ తో పాటూ అందాలతో కూడా ఆకట్టుకుంది అనసూయ. ఓ వైపు యాంకర్ గా చేస్తూనే సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసిన అనసూయ రామ్ చరణ్ నటించిన రంగస్థలంలో రంగమ్మత్తగా నటించి మంచి గుర్తింపు అందుకుంది. ఆ సినిమా తర్వాత అనసూయ యాంకరింగ్ మానేసి పూర్తిగా సినిమాల వైపు మళ్లింది. రీసెంట్ గా వచ్చి సెన్సేషనల్ హిట్ గా నిలిచిన పుష్ప2లో కూడా అనసూయ నటించిన విషయం తెలిసిందే. సినిమాల్లో నటిస్తూనే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ రెగ్యులర్ గా తన ఫోటోలను,



అప్డేట్స్ ను షేర్ చేస్తూ ఉంటుంది అనసూయ. అప్పుడప్పుడు ఈమె వేసే ట్వీట్స్, అమ్మడు చేసే కామెంట్స్ వల్ల అనవసరమైన వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటుంది అనసూయ. తాజాగా అనసూయ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేసింది. నేను నాకు ఎదురైన అనుభవాన్ని, నేను చూసిన సంఘటనలను మాత్రమే షేర్ చేసుకున్నాను తప్పించి ఎవరినీ బ్లేమ్ చేయలేదని, కేవలం అందరికీ అవగాహన రావాలనే అలా మాట్లాడాన ని, నేను అనని వాటిని అన్నట్టు ఎవరూ ప్రొజెక్ట్ చేయొద్దని అనసూయ పోస్ట్ చేసింది. అంతేకాదు, ఎవరేమనుకున్నా అవేమీ తన క్యారెక్టర్ ను డిసైడ్ చేయలేవని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని, తనను అర్థం చేసుకునే వారికి మాత్రమే తన ప్రేమను అందిస్తానని అనసూయ ట్వీట్ లో పేర్కొంది. దీంతో అనసూయ ఈ ట్వీట్ ఎవరిని ఉద్దేశించి వేసిందనేది ఆసక్తికరంగా మారింది. అయితే రీసెంట్ గా అనసూయ ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఆ ఇంటర్వ్యూలో తన డ్రెస్సింగ్ గురించి, ఫ్యామిలీ గురించి, రిలేషన్‌షిప్ గురించి అనూ ఎన్నో చెప్పుకొచ్చింది. తన వ్యాఖ్యల వల్ల అందరూ అనసూయను నెట్టింట తెగ ట్రోల్ చేస్తున్నా రు. ఈ నేపథ్యంలోనే అనసూయ ఆ ట్వీట్ చేసిందని అర్థమవుతుంది. ప్రస్తుతం అనసూయ చేసిన ట్వీట్ నెట్టింట వైరల్ అవుతుంది. అయినా ఇలా వివాదాల్లో నిలవడం అనసూయకు కొత్తేమీ కాదు.





## ఏంజెల్స్ కథలో అంతుచిక్కని రహస్యం




ఈమధ్య కాలంలో మిస్టరీ హారర్ సినిమాలకు ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తున్న విషయం తెలిసిందే. యువ హీరోలు మాస్ లవ్ రెగ్యులర్ కమర్షియల్ సినిమాలను పక్కన పెట్టి అప్పుడప్పుడు హారర్ కథలను కూడా టచ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఇప్పుడు రంగం ఫేమ జీవా కూడా అదే ట్రాక్ లో బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తున్నాడు. అతను నటించిన అఘత్యా సినిమా, టీజర్ విడుదలైనప్పటి నుంచి మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. యాక్షన్ కింగ్ అర్జున్, రాశీ ఖన్నా కూడా ఇందులో భాగమవ్వడంతో సినిమాపై మరింత హైప్ పెరిగింది. ఫాంటసీ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా విభిన్నమైన కథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంది. ఇక మేకర్స్ తాజాగా విడుదల చేసిన ట్రైలర్ సినిమా స్థాయిని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఫిబ్రవరి 28న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతున్న ఈ చిత్రం ట్రైలర్ ఇప్పటికే ట్రెండ్ అవుతోంది. ట్రైలర్ కథాంశాన్ని చూస్తే, జీవా ఓ భయానకమైన ప్రదేశంలోకి ప్రవేశించడంతో.. ఆ ప్రదేశం దశాబ్దాలుగా ఆత్మల నివాసంగా ఉందన్న ప్రచారం ఉంటుంది. జీవా తన పాత్ర ద్వారా ఆ భవంతి గతాన్ని, వర్తమానాన్ని అన్వేషించడానికి ప్రయాణం చేస్తాడు. అతని అన్వేషణలో అర్జున్ పాత్రకు, అతనికి మధ్య కొన్ని సంబంధాలు ఉంటాయని తెలుస్తోంది. గతం, వర్తమానం కలిసిపోయేలా ఉండే ఈ కథ ఉత్కంఠను కలిగించేలా ఉంది. ఇప్పటి వరకు వచ్చిన అంచనాలను మించిపోయేలా ట్రైలర్‌లో విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అదిరిపోయాయి. కథలో ప్రధానమైన పోరాటం ఏంజెల్స్, ఆత్మల మధ్య జరిగేలా కనిపిస్తోంది. అయితే ఇందులో కీలకమైన అంశం సంగీతమనే పాయింట్ కావడం ఆసక్తికరంగా మారింది. మ్యూజిక్ నోట్స్ ఈ కథలో ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు. ట్రైలర్ ఎడిటింగ్ నుంచి తీసిన ప్రతి షాట్ వరకు అన్ని వివరాలను ఎంతో బాగా ప్రదర్శించారు. ఇందులో జీవా నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక అర్జున్ పాత్ర కూడా పూర్తి మిస్టీరియస్‌గా ఉండేలా డిజైన్ చేశారు. ప్రొడక్షన్ విలువలు హై స్టాండర్డ్‌లో ఉండేలా మేకర్స్ కష్టపడ్డారనిపిస్తోంది. భారీ స్థాయిలో ప్లాన్ చేసిన విజువల్ ఎఫెక్ట్స్ మరింత రిచ్‌గా కనిపించేలా చేశారు. యువన్ శంకర్ రాజా అందించిన సంగీతం సినిమాకు అసలు మేజిక్ పాయింట్‌గా నిలవనుంది. ఈ చిత్రాన్ని డాక్టర్ ఇషారి గణేష్, అనీష్ అర్జున్ దేవ్ సంయుక్తంగా నిర్మించగా, పా. విజయ్ దర్శకత్వం వహించారు. ప్రొడక్షన్ డిజైన్, విజువల్ టెక్నిక్స్ అన్ని కూడా హై రేంజ్ లో ఉన్నాయని ఇప్పటికే సినీ విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఈ సినిమా ఓ కొత్త జానర్‌కు తెర తీసేలా ఉ ందని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఇక ఫ్రిఫిబ్రవరి 28న రాబోతున్న అఘత్యా సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుందో చూడాలి.

## నితిన్ - రవితేజ.. బాక్సాఫీస్ కిరికిరి!






నితిన్.. బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ సక్సెస్ చూసి చాలా కాలమైంది. 2020లో వచ్చిన భీష్మ సినిమా బ్లాక్‌బస్టర్ అయ్యాక, ఆ తర్వాత వరుసగా చేసిన చెక్, మాస్ట్రో (%యు%), మాచర్ల నియోజకవర్గం, ఎక్స్ ట్రా చిత్రాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. కొన్ని సినిమాలు అయితే బాక్సాఫీస్ వద్ద నితిన్ మార్కెట్ ను గట్టిగానే డ్యామేజ్ చేశాయి. దీంతో నితిన్ మళ్ళీ తన కెరీర్‌ను ట్రాక్ లోకి తెచ్చుకునేలా కచ్చితమైన ప్రాజెక్టులు లైన్‌లో పెట్టాడు. ప్రస్తుతం నితిన్ హిట్ కాంబినేషన్స్‌ను మళ్ళీ ప్లాన్ చేస్తున్నాడు. భీష్మ తో తనకు బిగ్ హిట్ అందించిన వెంకీ కుడుముల దర్శకత్వంలో రాబిన్ హుడ్ సినిమాను చేస్తున్నాడు. ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. మొదట డిసెంబర్ 20న రిలీజ్ చేయాలని అనుకున్నారు కానీ వాయిదా వేసి శివరాత్రి రిలీజ్‌కు ప్లాన్ చేశారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా ఫుల్ కామెడీ, యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోంది. ఇక వకీల్ సాబ్ వంటి హిట్ సినిమా తీసిన వేణు శ్రీరామ్ దర్శకత్వంలో మరో సినిమా చేస్తున్నాడు నితిన్. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమ్ముడు అనే టైటిల్ ఖరారు చేశారు. కుటుంబ అనుబంధాలతో కూడిన మాస్, ఎమోషనల్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. గతంలో లయ టాప్ హీరోయిన్‌గా టాలీవుడ్‌ను ఏలింది. ఇప్పుడు ఆమె మళ్ళీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తూ నితిన్ అక్కగా నటిస్తోంది. మే 9న తమ్ముడు సినిమాను భారీ స్థాయిలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే తమ్ముడు సినిమా కేవలం సింగిల్ రిలీజ్ కాదు. అదే రోజున మాస్ మహారాజా రవితేజ నటించిన మాస్ జాతర సినిమా కూడా థియేటర్లలోకి రాబోతోంది. బాను బోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. ఇప్పటికే సితారా బ్యానర్ వరుస విజయాలతో మంచి ఫాంలో ఉంది. కానీ మాస్ రాజకు కూడా గత కొంతకాలంగా సక్సెస్ లేదు. 2020 ధమాకా అనంతరం హీరోగా చేసిన సినిమాలన్నీ డిజాస్టర్ అయ్యాయి. ముఖ్యంగా మిస్టర్ బచ్చన్, ఈగల్ దారుణమైన నష్టాలను కలుగజేశాయి. ఇక ఈసారి మాస్ ఫ్యాన్స్‌ను పూర్తిగా టార్గెట్ చేస్తూ మాస్ జాతరతో బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తున్నాడు. తమ్ముడు %జం% మాస్ జాతర.. ఈ రెండు సినిమాల పోటీ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సాలీడ్ హిట్ కోసం చూస్తున్న హీరోలకు పర్ఫెక్ట్ సమ్మర్ స్లాట్ అయితే దొరికింది. అయితే నితిన్ ఫ్యామిలీ ఆడియెన్స్ ను టార్గెట్ చేస్తే క్లిక్కయ్యే అవకాశం ఉంటుంది. ఇక మాస్ జాతర పక్కా మాస్ ఎంటర్టైనర్‌గా రూపొందుతోంది కాబట్టి రిస్క్ తో కూడుకున్న పని. నిర్మాతగా దిల్ రాజు ఉన్నందున తమ్ముడు సినిమాకు గ్రాండ్ రిలీజ్ కు ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ ఈ పోటీని తట్టుకొని హిట్ కావాలంటే కంటెంట్ బలంగా ఉండాల్సిందే. వేణు శ్రీరామ్ కథను ఎలాంటి ప్రెజెంటేషన్ లో తెరకెక్కించాడో, ఆ కంటెంట్ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి. మొత్తానికి మే 9న నితిన్, రవితేజ బాక్సాఫీస్ కిరికిరి ఇంట్రెస్టింగ్ గా మారింది. మరి ఈ క్లాష్ లో ఎవరు గెలుస్తారో వేచి చూడాలి.

## చోప్రా సిస్టర్స్ డిష్యుం డిష్యుం.. బద్ధ విరోధులేనా?

గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా, ఆమె సోదరి పరిణీతి చోప్రా మధ్య విభేధాలు నెలకొన్నాయా? ఇద్దరూ ఒకరితో ఒకరు ఘర్షణ పడుతున్నారా? అంటే అవుననే హిందీ మీడియాలో కథనాలొస్తున్నాయి. ఇటీవల ప్రియాంక చోప్రా సోదరుడు సిద్ధార్థ్ చోప్రా వివాహ వేడుక సాక్షిగా ఈ విభేధాలు మరోసారి బయటపడ్డాయని రెడ్డిటర్లు ఊహిస్తున్నారు. అక్కా చెల్లెళ్లు మునుపటిలా కలిసి లేరు. విడివిడిగా పెళ్లికి వచ్చి వెళ్లారు. ఆ సమయంలో కలిసి ఫోటో కూడా దిగలేదు. దీంతో ఆ ఇద్దరి నడుమా ఏదో వార్ నడుస్తోందని అభిమానులు ఊహిస్తున్నారు. సిద్ధార్థ్ చోప్రా పెళ్లి వేడుకలో పరిణీతి చోప్రా, రాఘవ్ చద్దా కూడా కొద్దిసేపు కనిపించారు. ఇది చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఇటీవల చోప్రా కుటుంబంలో సిస్టర్స్ నడుమ విభేదాల గురించి కొంత చర్చ సాగుతోంది. ఈ పుకార్ల సమయంలోనే పరిణీతి అనూహ్యంగా సోదరుడి వివాహానికి హాజరైంది. ప్రియాంక సెప్టెంబర్ 2023లో ఉదయపూర్‌లో జరిగిన తన సోదరి వివాహానికి దూరంగా ఉంది. ముంబైలో జరిగిన సిద్ధార్థ్ ప్రీవెడ్డింగ్ వేడుకలకు పరిణీతి కూడా హాజరు కాలేదు. ఈ గైర్హాజరు కుటుంబంలో వైరం ఉందనే ఊహాగానాలకు దారితీసింది. అయితే పారీ తన తల్లితో



పెళ్లికి మాత్రం అటెండయింది. కేవలం ఫార్మాల్టీ కోసం. ఈ మధ్య పరిణీతి తల్లి వివాహ వేడుక నుండి ప్రత్యేకమైన ఫోటోలను షేర్ చేయగా, విభేదాలున్నాయనే పుకార్లకు మరింత ఆజ్యం పోసింది. పరిణీతి తల్లి రీనా చోప్రా.. సిద్ధార్థ్ పెళ్లి వేడుకల నుండి ప్రత్యేకమైన ఫోటోలను ఇన్ స్టాలో షేర్ చేసింది. అయితే ఈ ఫోటోలలో ఎక్కడా చోప్రా సోదరీమణులు కలిసి లేరని అభిమానులు గమనించారు. ఇది వారి మధ్య వైరం గురించి పుకార్లను మరింత పెంచింది. ఈ ఫోటోలను షేర్ చేసిన రీనా నవదంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే పరిణీతి ఉన్న ఫోటోలలో ప్రియాంక కనిపించకపోవడం ఆశ్చర్యపరిచింది. ఆ ఇద్దరూ కలిసి పోజులివ్వలేదని పరిశీలకులు ఎత్తి చూపారు. ఈ ఊహాగానాలపై సోదరీమణులు లేదా ఇతర కుటుంబ సభ్యులు ఎవరూ స్పందించలేదు. ఒక నెటిజన్ వ్యాఖ్యానిస్తూ... పరిణీతి -ప్రియాంక కలిసి ఉన్న ఒక్క ఫోటో కూడా లేదా? వారు లాంఛనప్రాయంగా వచ్చారు.. అని రాసాడు. మరొకరు.. "ప్రియాంక చోప్రా.. నరేంద్ర మోదీతో మంచి సంబంధాలను కొనసాగించడానికి ఈ జంటను విస్మరిస్తున్నారా?" అని ప్రశ్నించారు. ప్రియాంక చోప్రా కూడా పెళ్లి ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ– "జీవితాంతం ప్రేమ, ఆనందంతో నిండి ఇలానే కొనసాగాలి చసిద్నీ కి షాదీ!" అని క్యాప్షన్ ఇచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన పెళ్లికి సంబంధించిన మరో వీడియోలో వధువు నీలం ఉ పాధ్యాయకు సన్నిహితంగా ప్రియాంక చోప్రా కనిపించింది. ఒక వీడియోలో తన సోదరుడు సిద్ధార్థ్‌ను మండపానికి తీసుకెళుతూ కనిపించింది. పెళ్లిలో పీసీ డ్యాన్సులు చేస్తూ కూడా అలరించింది.

## సమంత ఏం మాట్లాడినా.. చైతూ గురించేనా?

సమంత రూత్ ప్రభు ఇప్పుడు తన కెరీర్‌పై మరింత ఫోకస్ పెట్టింది. విడాకుల అనంతరం ఆమె జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సినిమాల్లో కొత్త ఛాలెంజ్‌లు తీసుకోవడం, ఆరోగ్యంపై దృష్టి పెట్టడం, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్టులు ఎంపిక చేసుకోవడం వంటి వాటితో ముందుకు సాగుతోంది. అయితే, ఆమె సోషల్ మీడియాలో ఏదైనా పోస్ట్ చేస్తే అది గట్టిగానే ట్రెండ్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆమె చేసిన ఓ పోస్ట్ మళ్లీ చర్చనీయాంశమైంది. "మనుషులు ఒక స్థితిలో ఉండిపోరు.. వారు మారిపోతూనే ఉంటారు" అనే సందేశాన్ని షేర్ చేసింది. దీంతో సోషల్ మీడియాలో దీన్ని నాగచైతన్య – శోభిత విషయానికి లింక్ చేసేస్తున్నారు. సామ్ నెగిటివ్ గా చేయకపోయినా అలాగే పాజిటివ్ గా స్పందించినా కూడా వారి గురించే అన్నట్లు హైలెట్ చేస్తున్నారు. అయితే అభిమానుల అభిప్రాయాలను బట్టి చూస్తే, ఇది పూర్తిగా తప్పు. సమంత తన జీవితాన్ని, తన కెరీర్‌ను గాడిలో పెట్టుకునే పనిలో ఉంది. ఆమె ప్రస్తుతం తన ఆలోచనలను, జీవితం గురించి తనకు వచ్చిన అనుభవాలను పంచుకుంటోంది. ఆమె చెప్పే ప్రతి పదాన్ని చైతన్య సంబంధిత వ్యవహారాలతో ముడిపెట్టడం అన్యాయం. విడాకుల అనంతరం సమంత



వ్యక్తిగత జీవితాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రపంచమంతటా అనుభవాలను పెంచుకుంటూ, కొత్త అవకాశాలను ఒడిసిపట్టుకుంటూ తనకు నచ్చిన జీవితాన్ని గడుపు తోంది.. అని అభిమానులు దీనికి తగిన విధంగా కౌంటర్ ఇస్తున్నారు. సమంత నెవ్వర్ బిఫోర్ అనేలా ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులు చేస్తోంది, ముంబై, లాస్ ఏంజెలెస్ లాంటి చోట్ల ప్రముఖులతో మీటింగ్స్ జరుపుతోంది. ఈ క్రమంలో ఎన్నో అనుభవాలు ఎదురవుతున్నాయి. వాటిలో మంచి చెడులో కొన్ని భావాలను సోషల్ మీడియాలో షేర్ చేయడం సహజమే. ఈ విషయం అభిమానులకైతే బాగా అర్థమైంది. కానీ కొంతమంది మాత్రం ఏం జరిగినా సమంతను చైతన్య జీవితం వైపు లాగిపోవడం కేవలం ట్రోలింగ్ కోసమేనని ఫ్యాన్స్ అంటున్నారు. విడాకుల తర్వాత కూడా సమంత ఎప్పుడూ చైతన్య గురించి నెగటివ్‌గా మాట్లాడలేదు. ఆమె చేసిన ప్రతి చిన్న కామెంట్‌ను చైతూ, శోభితల వ్యవహారానికి అన్వయించడాన్ని అభిమానులు తప్పుబడుతున్నారు. ఇక సమంత రేంజ్ పెరుగుతూనే ఉంది. ఆమె ప్రస్తుతం బాలీవుడ్‌లో అవకాశాలు చూస్తోంది. ఓటీటీలో ఇప్పటికే సిటాడెల్ ప్రాజెక్ట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రీచ్ పొందుతోంది. అలాగే నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి ఆమె సీరియస్‌గా ప్లానింగ్ చేస్తోంది. ఏదేమైనా ఆమె ఏదైనా పోస్ట్ చేస్తే అది ఆమె వ్యక్తిగత ఆలోచనలతో సంబంధముంటుంది, లేదా ఉండకపోవచ్చు. కానీ మళ్లీ మళ్లీ ఆమెను గతంతో లింక్ చేయడం, చైతన్య విషయానికి తీసుకురావడం సరికాదని అభిమానులు అంటున్నారు. ఇకనైనా సమంతను ఆమె కెరీర్‌పై ఫోకస్ చేస్తున్న అద్భుతమైన నటిగా చూస్తే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536